తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శుక్రవారం 10.10.2025 | సంపుటి :12 సంచిక : 80 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698





## మహాకూటమి గెలిస్తే ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం

### తేజస్వీ యాదవ్ హామీ

పాట్నా(జనంసాక్షి):బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి. ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీల నేతలు హామీల వర్షం కురిపిస్తున్నారు. ఈ క్రమంలో తాము (ఇండియా కూటమి) అధికారం లోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారు. పట్నాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపే ఇందుకు సంబంధించి ప్రతిపాదిత చట్టాన్ని తీసుకువస్తామని

మిగతా 2లో..






# స్టే

- ఆరు వారాల పాటు నిలిచిపోయిన ఎన్నికల ప్రక్రియ
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- రెండురోజుల పాటు హైకోర్టులో సమగ్ర వాదనలు
- గవర్నర్ సంతకం చేయకుంటే చట్టం అయినట్లే: ఏజీ

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణస్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు జీఓ 9పై హైకోర్టు స్టే విధించింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించి షాక్ ఇచ్చింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై విచారణను 4 వారాలపాటు వాయిదా వేసింది. అనంతరం రెండు వారాల్లోపు అన్ని పార్టీలు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. గురువారం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండో రోజు వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ వాదనలు విన్న న్యాయస్థానం.. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించింది. అయితే, జీవో 9 విడుదల అనంతరం హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు బుధవారం పిటిషన్లపై న్యాయస్థానం విచారణ చేపట్టి నేటికి వాయిదా వేసింది. ఇవాళ మరోసారి విచారణ చేపట్టిన ధర్మసనం.. ప్రభుత్వం తరఫు వాదనలు విని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ తాత్కాలికంగా నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం,

మిగతా 2లో..

### రిజర్వేషన్ సాధించేవరకు పోరాడుతాం

సీఎంతో చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం : మంత్రి వాకిటి శ్రీహరి

హైకోర్టు స్టే ఊహించలేదు : :మంత్రి పొన్నం

ఉత్తర్వు కాపీలు అందాక తదుపరి కార్యాచరణ

కోర్టులో బలమైన వాదనలు వినిపించామని వెల్లడి

ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్, బీజేపీల ద్రోహం

చట్టం చేకుండా అడ్డుకున్న రెండు పార్టీలు

మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

### 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

ఆ తర్వాతే 'స్థానిక' ఎన్నికలకు వెళ్తాం

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

### బీసీలకు అన్యాయం జరిగింది

బీసీ సంఘాల నిరసన

2లో..

### న్యాయస్థానాల్లో నిలబడని జీవోతో మభ్యపెట్టారు

ఇంతకాలం చేసిందంతా డ్రామా అని తేలిపోయింది : కేటీఆర్

ఆరు గ్యారంటీల తరహాలోనే బీసీలకు 42శాతం డ్రామాలు

55 ఏళ్లు అధికారంలో ఉన్నా బీసీలకు మొండిచెయ్యే: హరీశ్

2లో..

### రాజకీయ ప్రయోజనాలకోసమే రిజర్వేషన్ నాటకాలు

ఇది సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ చేతకానితనమని వెల్లడైంది: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

స్టే రావడానికి ప్రభుత్వమే కారణం : రామ్‌చందర్ రావు

### తెలంగాణ 'స్థానిక' ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేత

హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్ఈసీ ప్రకటన

2లో..



## సోలార్ విద్యుత్ వినియోగంపై ఆసక్తిగా ఉన్నాం

### ప్రతిపాదనలను అధ్యయనం చేస్తాం

### జర్మనీ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగం బలోపేతం లో భాగంగా సోలార్ విద్యుత్తు ఉత్పత్తి, వినియోగంలో ఆసక్తిగా ఉన్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జర్మనీ ప్రతిని ధులతో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోలార్ రంగం పై ఆసక్తిగా ఉందని తెలుసుకొని కొన్ని

మిగతా 2లో..

### దశలవారీగా హ్యామ్ రోడ్ల నిర్మాణం

ట్రాఫిక్ సర్వేను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన చేపట్టాలి

మొదటి దశలో రూ.10,986 కోట్లు కేటాయింపు

అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

12లో..

## ఆ ఘటన నన్ను షాక్‌కు గురిచేసింది

- అయితే అది ఒక మర్చిపోయిన అధ్యాయం
- దాడికి యత్నం ఘటనపై సీజేఐ గవాయ్
- ఘటనను జోక్‌గా తీసుకోవద్దు
- ఇది సుప్రీంకోర్టు ను అవమానించడమే
- బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాల్సిందే
- సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా

2లో..

### ఘటనకు కారకుడైన న్యాయవాదికి సుప్రీంలోకి నోఎంట్రీ

బార్ అసోసియేషన్ సభ్యత్వం రద్దు

## సాహిత్యంలో ప్రముఖ హంగేరియన్ రచయితకు నోబెల్

### లాస్లో క్రాస్జ్నాహోర్కైకు దక్కిన పురస్కారం



స్టాక్‌హోం(జనంసాక్షి):ప్రముఖ హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్జ్నాహొర్కై ఈ ఏడాది సాహిత్యంలో నోబెల్ బహుమతిని గెలుచుకున్నారు. సాహిత్య బహుమతిని స్వీడిష్ అకాడమీకి చెందిన నోబెల్ కమిటీ విజేతలకు ప్రదానం చేస్తుంది.గత సంవత్సరం ఈ బహుమతిని దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్ దక్కించుకున్నారు. స్వీడిష్ అకాడమీ సభ్యులు నామినేటెడ్ అభ్యర్థుల రచనలను రహస్యంగా అంచనా వేస్తారు. అకాడమీ సభ్యుల మెజారిటీ మద్దతును అందుకున్నవారే తుది అర్హత సాధిస్తారు. గోప్యతా నియమం అన్ని బహుమతి విభాగాలకు వర్తిస్తుంది. లాబీయింగ్, మీడియా హైప్, రాజకీయ జోక్యం మొదలైనవాటికి ఎంపిక ప్రక్రియలో తావుండదు.క్రాస్జ్నాహొర్కై 1985లో తన తొలి నవల సాటాంటాంగోతో రచనారంగంలో తనదైన ముద్ర వేశారు.మూడు దశాబ్దాల తర్వాత 2013లో ఆంగ్లంలో ఉత్తమ అనువాద పుస్తక అవార్డును గెలుచుకుంది. లాస్లో క్రాస్జ్నాహొర్కై 1987లో కమ్యూనిస్ట్ హంగేరీని విడిచిపెట్టి,

మిగతా 2లో..

### మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు

కర్ణాటక కీలక నిర్ణయం

12లో..



## ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీ నష్టాల్లోకి..


- టికెట్ ధరల పెంపుతో కుటుంబాలపై భారం
- బస్ భవన్ వద్ద బీఆర్ఎస్ నేతల ఆందోళన
- ఎండి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చిన కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో సర్కారు నడపట్లేదు.. సర్కస్ నడుపుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బస్ భవన్ వద్ద నిరసనలో భాగంగా ఆయన మాట్లాడారు. ఉదయం మా పార్టీ నేతలను గృహ నిర్బంధం చేశారు.. తర్వాత వెళ్లవచ్చున్నారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ అరెస్టు చేస్తున్నారు. ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఉచిత బస్సు పథకం పెట్టి ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారు. ఆ నష్టాలను భరించాల్సింది ప్రభుత్వమే. మహిళలకు ఉచిత బస్సు కల్పించి.. పురుషులకు రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో కుటుంబంపై టికెట్ ధరల భారం పెరిగింది. ఆర్టీసీ బస్సు పాసుల ధరలు 25 శాతం పెంచారు. మెట్రో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీని తరిమేశారు.

మిగతా 2లో..

### భారత్- యూకే సంబంధాల్లో


## కొత్తశక్తి



- స్టార్మర్‌తో భేటీ అనంతరం ప్రధాని మోదీ
- ముంబయిలో ఇరువురి సమావేశం
- కీలక అంశాలపై ఇరుదేశాధినేతలు చర్చలు

ముంబై(జనంసాక్షి):భారత్-యూకే సహజ భాగస్వామ్యులని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. భారత్-యూకే సంబంధాలలో కొత్త శక్తి ఉందని అభిప్రాయపడ్డారు. ఇరుదేశాల భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక పురోగతికి కీలకమైన పునాదిగా మారుతోందని అభిప్రాయపడ్డారు. ఇండియా-బ్రిటన్ సంబంధాలకు పునాది ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్టబద్ధమైన పాలన వంటి విలువలపై ఉన్న ఉమ్మడి నమ్మకమేనని తెలిపారు. ముంబయిలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్ తో ఉన్నత స్థాయి చర్చల అనంతరం ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్, యూకే మధ్య అతిపెద్ద బిజినెస్ లీడర్స్ శిఖరాగ్ర సమావేశం జరిగింది. వీటన్నింటితో పాటు ఇరు దేశాల సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి సూచనలు, అవకాశాలను పంచుకున్నాం. జులైలో నేను యూకే పర్యటన సందర్భంగా చరిత్రాత్మక సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో, రెండు దేశాలకు దిగుమతి ఖర్చు తగ్గుతుంది. యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వాణిజ్యం పెరుగుతుంది. ఈ ఒప్పందం భారత్‌లోని పరిశ్రమలు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఒప్పందంపై సంతకం చేసిన కొద్ది నెలల్లోనే, ఇప్పటివరకు అతిపెద్ద వ్యాపార ప్రతినిధి బృందం యూకే ప్రధాని స్టార్మర్‌తో పాటు భారత్‌కు రావడం ఇరుదేశాల భాగస్వామ్యానికి నాందిగా నిలిచింది."అని ప్రధాని మోదీ అన్నారు యూకేకు చెందిన తొమ్మిది విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లను ప్రారంభిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం తాలుక గురుగ్రామ్ క్యాంపస్ ఇప్పటికే ప్రారంభమైందని, అక్కడ ఇప్పటికే మొదటి సంవత్సరం విద్యార్థులు చేరారని పేర్కొన్నారు.

మిగతా 2లో..



## యుద్ధభూమిలో ఎగిరిన శాంతి కపోతం

- ఇజ్రాయెల్, హమాస్ మధ్య మొదటిదశ శాంతి ఒప్పందం
- ఇరుపక్షాలు సంతకం చేశాయని ట్రంప్ వెల్లడి
- ట్రంప్ చొరవను స్వాగతించిన ప్రధాని మోడీ


వాషింగ్టన్(జనంసాక్షి):
గాజాలో యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయని, ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేశాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. ట్రంప్ శాంతి ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని స్వాగతించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బలమైన నాయకత్వానికి ఇది అద్దంపడుతోందన్నారు. బందీలను విడుదల చేయడం, గాజా ప్రజలకు మెరుగైన మానవతా సాయం అందేలా చూడటం వల్ల శాశ్వత శాంతికి బాటలు పడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్- హమాస్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 21 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. దానిని భారత్, రష్యా, చైనా సహా పలు దేశాలు ఆహ్వానించాయి. తాజాగా ఆ దిశగా తొలి అడుగుపడిందని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. గాజా మొదటి దశ శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్, హమాస్‌లు అంగీకరించినందుకు గర్వంగా ఉంది. ఈ నిర్ణయంతో హమాస్ చేతిలో బందీగా ఉన్నవారంతా త్వరలోనే విడుదల అవుతారు. ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుందని ప్రకటించారు. అలాగే సోమవారం బందీలు విడుదల కావొచ్చని చెప్పారు. అలాగే ఈ విషయంపై ఫోన్ కాల్‌లో ట్రంప్ మాట్లాడుతుంటే బందీల కుటుంబాలు ఆసక్తిగా వింటున్నట్లు ఉన్న ఒక వీడియోను వైట్‌హౌస్ పోస్ట్ చేసింది. శాంతి ఒప్పందాన్ని హమాస్ సైతం ధ్రువీకరించింది. గాజాలో యుద్ధానికి ముగింపు పలికేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంది. ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ దళాల పూర్తి ఉపసంహరణ, మానవత సాయానికి అనుమతి, ఖైదీల మార్పిడి

మిగతా 2లో..

## అవును.. ఆ విమానం మా వల్లే కూలింది

అయితే ఉద్దేశపూర్వకంగా చేసింది మాత్రం కాదు.. ప్రమాదవశాత్తు జరిగింది

అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమాన ప్రమాదంపై ఎట్టకేలకు స్పందించిన పుతిన్



మాస్కో(జనంసాక్షి):గతేడాది అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమాన ప్రమాదానికి సంబంధించి రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది విషాదకరమైందన్న ఆయన.. ఆ ప్రమాదానికి రష్యా వైమానిక దళం కారణమని అంగీకరించారు. అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్ తో భేటీ సందర్భంగా తొలిసారి దీనిని అంగీకరించిన పుతిన్.. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నం చేశారు. ప్రమాదం జరిగిన రోజు ఉదయం.. ఉక్రెయిన్ డ్రోన్లను నాశనం చేసేందుకు క్షిపణులను మోహరించామని, అవి పౌర విమానానికి కొన్ని మీటర్ల దూరంలో పేలిపోయానని పుతిన్ చెప్పారు. అయితే, పౌర విమానంపై నేరుగా క్షిపణి దాడి చేయలేదని, శకలాల వల్లే విమానం దెబ్బతిన్నదని చెప్పారు. అటువంటి విషాద సందర్భాల్లో బాధితులకు పరిహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులపై చట్టపరంగా చర్యలను

మిగతా 2లో..

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్‌పట్టివేత

జీడిమెట్లలో 220 కిలోల ఎఫిడ్రిన్ స్వాధీనం

హైదరాబాద్(జనంసాక్షి):
నగరంలో పోలీసులు భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను పట్టుకున్నారు. జీడిమెట్లలో 220 కిలోల ఎఫిడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.72 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దేశీయంగా రూ.10 కోట్లు ఉంటుందన్నారు.

మిగతా 10లో..





## ఎస్ఐఆర్‌కు కొన్ని పార్టీలు సహకరించడం లేదు

- తప్పుడు కథనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి
- ఈసీ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై సుప్రీం కోర్టులో గురువారం కూడా విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం కీలక వ్యాఖ్యలు చేసింది. కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు ఈసీ ప్రయత్నాలకు సహకరించకుండా.. తప్పుడు కథనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపింది.బిహార్‌లో ఎస్ఐఆర్‌పై దాఖలైన పలు పిటిషన్లపై గురువారం వాదనలు కొనసాగాయి. అంతకుముందు ప్రతిపాదిత జాబితాలో పేరు ఉండి, తుది జాబితాలో తొలగించిన 3.36లక్షల ఓటర్ల వివరాలను అందజేయాలని సుప్రీం పేర్కొంది. వీటిని పరిశీలించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీల ధర్మాసనం.. ఈ అంశం గందరగోళంగా ఉందని, వీరికి అప్పీలు చేసుకునే అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం పారా లీగల్ వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని బిహార్ లీగల్ సర్వీసెస్ ఛైర్‌పర్సన్‌ను

మిగతా 2లో..

## తెలంగాణ 'స్థానిక' ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేత

**హైదరాబాద్(జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేసినట్లు ప్రకటించింది. హైకోర్టు ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ అమలు, నామినేషన్ల ప్రక్రియను నిలిపివేసినట్లు తెలిపింది. తదుపరి నోటిఫికేషన్ ఇచ్చేవరకు ఎన్నికల ప్రక్రియలన్నీ నిలిపివేసినట్లు ప్రకటించింది.

## రిజర్వేషన్ సాధించేవరకు పోరాడుతాం

**హైదరాబాద్(జనంసాక్షి):**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్9 అమలుపై హైకోర్టు స్టే విధించిన క్రమంలో తదుపరి కార్యాచరణ చేపడతామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఉన్నత న్యాయస్థానం నిర్ణయంతో బీసీల నోటి వద్ద ముద్ద లాగేసినట్లయిందని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. బీసీలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరతామన్నారు. కోర్టు తీర్పు కాపీ చూసిన తర్వాత ఎలా ముందుకెళ్లాలో ఆలోచిస్తామని చెప్పారు. హైకోర్టు తీర్పు కాపీ వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తాం. సుప్రీం కోర్టుకు వెళ్లడంపై నిర్ణయం తీసుకుంటాం. కోర్టులో కేసులు వేయించింది భారత రాష్ట్ర సమితే. భాజపాతో కుమ్మక్కై బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంది. హైకోర్టు స్టే ఇవ్వకుండా ఉండేందుకు ఎంతో ప్రయత్నించాం అని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.స్థానిక ఎన్నికలకు హైకోర్టు స్టే విధించడంపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు. బీసీలకు 42 శాతంపై అన్ని పార్టీలు మద్దతు ఇచ్చిన కూడా స్టే విధించడం విచారకరమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ కొలిక్కి వచ్చిందనుకున్నాం.. కానీ కోర్టు తీర్పు ఊహించలేదని చెప్పారు. ఎక్కడ ఇబ్బంది లేకుండా కులగణన పూర్తి చేసి బీసీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు. బీసీల నోటి కాడ కూడు లాగేయడం శోచనీయమని పేర్కొన్నారు. నోటి కాడ ముద్ద ఎవరు లాగేసారో కోర్ట్ తీర్పు కాపీ వచ్చాక చెబుతామని హెచ్చరించారు..

**చట్టం చేకుండా అడ్డుకున్న రెండు పార్టీలు**

రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9తో పాటు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించిచడంపై కాంగ్రెస్ నేతలు స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎవరు చేయలేని సాహసం చేసిందని వ్యవసాయ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బిసి బిల్లును అడ్డుకున్నదే బిజెపి అన్నారు. బిజెపిని నిలదీయమాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటింటికి తిరిగి కులగణనం చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్ల రూపొందించామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ – బీజేపీ ఒక్కటై బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం 42 శాతం బీసీల రిజర్వేషన్ కు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. బీసీలకు న్యాయం జరగాలనిఅభిప్రాయపడ్డారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటై బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ చిత్తశుద్ధితో చట్టం చేసిందన్నారు. అడ్డుకున్నదే బిజెపి అన్నారు.

హైకోర్టులో స్టే రావడం బాధాకరం:పొన్నం

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం బాధాకరమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కాపీ అందిన తరువాత చట్టపరంగా, న్యాయపరంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం తరుపున హైకోర్టులో బలమైన వాదనలు వినిపించడం జరిగిందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం కుల సర్వే నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ వేసి, సబ్ కమిటీ వేశామని గుర్తు చేశారు. అనంతరం కేబినెట్ ఆమోదించి.. శాసనసభలో చట్టం చేసి గవర్నర్‌కి బీసీ బిల్లును పంపడం జరిగిందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరపకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని మంత్రి పొన్నం పేర్కొన్నారు. హైకోర్టు స్టే విధిస్తుందని అనుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ధీమా వ్యక్తం చేశారు. సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు హైకోర్టులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదో జవాబు చెప్పాలని పొన్నం నిలదీశారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయంతో ఎన్నికలకు వెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు.

## బీసీలకు అన్యాయం జరిగింది

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించడంపై బిజెపి రాజ్యసభ సభ్యుడు,.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. ఈ సందర్భంగా హైకోర్టు వద్ద ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు..బీసీల నోటికాడ ముద్దను ఆపారని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తొందరపాటు చర్యలతో అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ స్పందన చూశాక బంద్‌కు పిలుపునిస్తామని పేర్కొన్నారు. కొంతమంది బీసీలకు పదవులు వస్తుంటే ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. త్వరలో బీసీల సత్తా ఏంటో చూపిస్తామని ఆర్.కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రంలోగా స్పందించక పోతే తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల పక్రియను రెండు వారాల పాటు ఆపడమనేది దురదృష్టకరం. ఎందుకంటే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికలను ఆపొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా రెండు వారాల పాటు ఎన్నికలను వాయిదా వేయడం తాము తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 56 శాతం బీసీ ప్రజల హక్కులకు విఘాతం కలిగిస్తుంది. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. నోటికాడి అన్నం ముద్దను లాక్కున్నారు. నిన్నటి నుంచి విచారణ జరిపిన కోర్టు.. మరో రెండు రోజులు సమయం తీసుకుని ఇంకా విస్తృతంగా విచారణ చేపట్టాల్సి ఉండేదన్నారు. ఎందుకు ఆదరబాదరగా స్టే విధించాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం అని ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. ఈరోజు సాయంత్రంలోగా ప్రభుత్వం స్పందన ఏంటో చూస్తాం. తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి రాష్టాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. బీసీల్లో ఏంతో చైతన్యం వచ్చింది.. ఊరురా స్పందన తెలుపుతాం. సీఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. సాయంత్రంలోగా ప్రకటించాలి. లేదంటే పెద్ద ఎత్తున బంద్ నిర్వహిస్తాం. దేశాన్ని కదిలించేలా బంద్ ఉంటుంది. ఏం తమాషాగా ఉందా..? బీసీలంటే అంత చులకనగా ఉందా..? ముఖ్యమంత్రి పదవులు రావు మంత్రి పదవులు రావు.. లేక లేక సర్పంచ్ అవకాశం వస్తే వాటిని కూడా లాగేసుకోవడం సరికాదు. ఈ సమాజంలో బీసీల సత్తా ఏంటో చూపిస్తాం. స్టే విధించడం చాలా దురదృష్టకరం. రేపట్నుంచి రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు.

## రాజకీయ ప్రయోజనాలకోసమే రిజర్వేషన్ నాటకాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ బీసీలను రాజకీయంగా వాడుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేయాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ లేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే విధించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం దురదృష్టకరమని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ చేతకాని తనం కారణంగానే.. ఈ తీర్పు వెలువడిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై స్టే రావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్‌లకు బీజేపీ మద్దతు పలుకుతోందని స్పష్టం చేశారు. బీసీల అంశాని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ది కోసం వాడుకుంటోందని విమర్శించారు. గవర్నర్‌కి పంపిన తర్వాత బిల్లు కోసం 3 నెలల సమయం ఉంది.. ఎందుకు తొందర పడుతునారని సూచించారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ జీవోపై హైకోర్టు స్టే

ఎన్నికల సంఘం తరఫున సమగ్రమైన కౌంటర్‌ను దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తర్వాత.. రెండు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లకు సూచించింది. హైకోర్టు ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికల పక్రియపై సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై స్టే ఇచ్చింది. రిజర్వేషన్ల అంశంపై విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది. నాలుగు బీసీ రిజర్వేషన్లపై రెండురోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు విన్న ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గురువారమే స్థానిక సంస్థల ఎన్నికల కోసం నోటిఫికేషన్ విలువడింది. నోటిఫికేషన్‌పై సైతం హైకోర్టు స్టే విధించింది. దాంతో ఎన్నికల పక్రియ నిలిచిపోనున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కోసం ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల జీవో నంబర్ 9ని జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ బుట్టెంబారి మాధవరెడ్డి, సముద్రాల రమేశ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఆర్ కృష్ణయ్య, వీ హన్మంతరావుతో పాటు పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు వేశారు. ఆయా అన్ని పిటిషన్లను సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ ప్రారంభించింది. తాజాగా రిజర్వేషన్ల అంశంపై గురువారం సైతం వాదనలు కొనసాగాయి. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

**గవర్నర్ సంతకం చేయకుంటే చట్టం అయినట్లే..:ఏజీ**

గవర్నర్ బిల్లును పాస్ చేయకుంటే చట్టంగా మారినట్టేనని అడ్వకేట్ జనర్ సుదర్శన్ రెడ్డి ధర్మాసనం ముందు వాదించారు. ఇందుకు తమిళనాడు ఉదాహరణను ఆయన చూపారు. బీసీ కుల గణనపై అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని.. స్వాతంత్ర్యం తర్వాత సమగ్ర కులగణన సర్వే తెలంగాణలోనే జరిగిందని చెప్పారు. ఈ సర్వేపై ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని.. బీసీ జనభా 57.6 శాతం ఉన్నారంటే ఎవరూ కాదనడం లేదని.. 57.6 శాతం జనాభా ఉన్నా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఏజీ చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని, రాజకీయ వెనుకబాటుతనం ఉందని అసెంబ్లీ గుర్తించి తీర్మానం చేసిందని.. గ్రామీణ, పట్టణ సంస్థల్లో బీసీలకు 42 శాతం ఇవ్వాలని అసెంబ్లీ నిర్ణయం తీసుకుందన్నారు. గడువులోగా గవర్నర్ ఆమోదించకపోతే చట్టంగా భావించాల్సి ఉంటుందని.. తమిళనాడు ప్రభుత్వం, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నోటిఫై చేయాల్సిన అవసరం లేదని కోర్టుకు తెలిపారు. అసెంబ్లీ చేసిన చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉందని.. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉందన్నారు. ఇది రాష్ట్ర ప్రజల కోరిక అని.. దాన్ని అసెంబ్లీ ఆమోదించిందన్నారు. శాస్త్రీయ పద్ధతిలో కులగణన సర్వే జరిగిందని.. సర్వేలో అన్ని కులాల లెక్కలు తేలాయన్నారు. బీసీ సబ్ కేటగిరిల వారీగా వివరాలు సర్వేలో తేలాయన్నారు. సర్వేలో అగ్రవర్ణాల లెక్కలు బయటకు వచ్చాయన్నారు. బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనం ఉందని గుర్తించే.. అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. అసెంబ్లీ చేసిన చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉంది. ఇది రాష్ట్ర ప్రజల కోరిక. దాన్ని అసెంబ్లీ ఆమోదించింది.శాస్త్రీయ పద్ధతిలో కులగణన సర్వే జరిగింది. సర్వేలో అన్ని కులాల లెక్కలు తెలిశాయి. బీసీల్లోని సబ్ కేటగిరీల వారీగా వివరాలు సర్వేలో తేలాయి. అగ్రవర్ణాల లెక్కలు కూడా బయటకు వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. కొందరు ఇది నోటిఫికేషన్ కాదంటున్నారు. అది తప్పని ఏజీ పేర్కొన్నారు. నోటిఫికేషన్ ప్రతులను ధర్మాసనం ముందుంచారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత న్యాయస్థానాల జోక్యం ఉండబోదని వాదించారు. ఈ అంశాన్ని సుప్రీం కోర్టు కూడా స్పష్టం చేసినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.మరో న్యాయవాది రవివర్మ తన వాదనలు వినిపిస్తూ... రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50శాతం సీలింగ్ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారని, 85 శాతం జనాభాకు 42 శాతంతో కలిపి 67 శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నామని వివరించారు. 15 శాతం జనాభాకు 33 శాతం ఓపెన్‌గానే ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

**హైదరాబాద్(జనంసాక్షి):**బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అందరికీ తెలుసని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను వాళ్లు గమనిస్తున్నారని చెప్పారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలకు మేలు చేయడాన్ని భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు హైకోర్టులో ఇంప్లీడ్ కాలేదన్నారు. ఈ పార్టీల నేతలు చరిత్రహీనులుగా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. దేశంలోనే తొలిసారి కులగణన చేసింది తమ ప్రభుత్వమేనని చెప్పారు."రిజర్వేషన్లపై మాకు సంకల్పబలం ఉంది. అందుకే ఇక్కడివరకు చేరుకున్నాం. స్థానిక సంస్థల ఎన్నికలపై కొందరు కోర్టుకు వెళ్లారు. 2018లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన చట్టం ఇప్పుడు ఓబీసీలకు ఉరితాడుగా మారింది. ఓబీసీలకు మేలు చేద్దామన్న ఆలోచన ఆ పార్టీకి లేదు. మా ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు వేస్తున్నారు. మీ అబద్ధాలు నమ్మేందుకు బీసీలు, సంఘాల నేతలు అమాయకులు కాదు. ఏం లెక్కలున్నాయో చెప్పాలని అడిగారు కనుకే కులగణన చేశాం. జీవో ఇచ్చేసి ఎన్నికలకు వెళ్తే దాన్ని కొట్టేసేవారు. అందుకే శాస్త్రీయంగా కులగణన చేపట్టి బిల్లు పాస్ చేశాం. లక్షమందికిపైగా ఉద్యోగులను పంపి వివరాలు సేకరించాం .క్యాబినెట్‌లో, అసెంబ్లీలో తీర్మానం చేశాం. ఆ రోజు బిల్లును అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతికి పంపారు. అక్కడ పెండింగ్‌లో ఉంది. ఆ బిల్లును ఆపిందెవరో కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం చెప్పాలి. ఎవరికి చిత్తశుద్ధి ఉందో.. ఎవరికి లేదో ప్రజలు ఆలోచించాలి. బీసీల బిల్లును భాజపా, భారాస కలిసి అడ్డుకుంటున్నాయన్నారు

## న్యాయస్థానాల్లో నిలబడని జీఓతో మభ్యపెట్టారు

**హైదరాబాద్(జనంసాక్షి):**స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని రోజులపాటు మోసపూరితంగా వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హైకోర్టు ఇచ్చిన స్టే తో 42 శాతం రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ సర్కారు ఇంతకాలం చేసిందంతా డ్రామా తప్ప మరొకటి కాదని రుజువైపోయిందని ఆయన పేర్కొన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలు, చట్టం పరీక్షకు నిలవకుండా వ్యవహరించిన తీరు వల్లనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందని కేటీఆర్ కాంగ్రెస్ పై మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాలరాసి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని బీసీలను దారుణంగా మోసం చేశారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం మభ్యపెట్టేందుకు తెచ్చిన జీఓ న్యాయస్థానాల్లో నిలబడదని బీఆర్ఎస్ చెప్పిన మాట అక్షరాలా నిజమని తేలిపోయిందని ఆయన స్పష్టం చేశారు.కులగణనను మొదలుకుని జీఓ దాకా రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో అడుగడుగున చేసినదంతా మోసం, దగా, నయవంచన తప్ప మరొకటి కాదు. కులగణన నుంచి మొదలుకొని ప్రతి సందర్భంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాన్ని అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వానికి అనేక సూచనలు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అసెంబ్లీలో పాస్ చేసిన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాల్సింది పోయి, ఏకపక్షంగా దేశ రాజధానికి వెళ్లి ధర్నా పేరిట నాటకమాడారు" అని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకి ముందు రిజర్వేషన్లు సాధించిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి 42 శాతం బీసీలకు పదవులు కట్టబెడతామని చెప్పి, పూటకొక మాటను కాంగ్రెస్ మార్చిందన్నారు. చివరికి రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి చేసుకున్నాక రిజర్వేషన్లు సాధిస్తామని చెప్పిన అడ్డగోలు మాటల్ని కూడా కేటీఆర్ గుర్తు చేశారు.ఒకవైపు రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్ లో ఉండగానే ఆర్డినెన్స్ పేరిట కొంతకాలం హంగామా చేశారని, చివరికి న్యాయస్థానాల్లో నిలబడని జీఓతో మభ్యపెట్టారని ఆయన అన్నారు.

**ఆరు గ్యారంటీల తరహాలోనే బీసీలకు 42శాతం డ్రామాలు:హరీశ్**

ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి కాంగ్రెస్ ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటు పడిందా? అంటూ ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే మీ కాంగ్రెస్ నేతలు జాతీయ నాయకులతో ఢిల్లీ వేదికగా కొట్లాడాలని హితవు పలికారు. కలిసి వచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ది పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయన్నారు. 22 నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి.. గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా క్రియేట్ చేశారు తప్పా.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించడం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్ట బద్ధత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్‌రెడ్డి తెలివిగా దాన్ని పక్క దోవ పట్టించారని.. బీసీల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారని.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మీ డ్రామాలు ఆపాలని.. బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే 42శాతం పెంపు విషయమై ఢిల్లీలో కొట్లాడాలని చెప్పారు. పార్లమెంట్‌లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చాలని.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ పోరాటంలో అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఢిల్లీ వేదికగా యుద్ధ భేరి మోగించాలని.. ద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ బీసీల కోసం గొంతెత్తుతుందని.. ఢిల్లీని నిలదీస్తుందన్నారు.

## మహాకూటమి గెలిస్తే ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం

అన్నారు."20 ఏళ్లలో రాష్ట్ర యువతకు ఎన్డీయే ఉద్యోగాలు కల్పించలేకపోయింది. మేం అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే చట్టాన్ని తీసుకువస్తాం. 20 నెలల్లోనే దీన్ని అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ప్రభుత్వ ఉద్యోగాలపై హామీ ఇచ్చాను. నేను అధికారంలో ఉన్న ఆ కొద్ది కాలంలోనే ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించా. నాకు ఐదేళ్ల సమయం ఉంటే ఎన్ని ఉద్యోగాలు ఇస్తానో మీరే ఊహించుకోవచ్చు" అని బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌ను కాపీక్యాట్ అంటూ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం కొన్ని నెలలుగా చేపడుతున్న కార్యక్రమాలు గత ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను పోలిఉన్నాయని ఆరోపించారు.

## సాహిత్యంలో ప్రముఖ హంగేరియన్ రచయితకు నోబెల్

ఫెలోషిప్ కోసం పశ్చిమ బెర్లిన్‌లో ఒక సంవత్సరం గడిపారు. ది ప్రిజనర్ ఆఫ్ ఉర్గా, డిస్ట్రక్షన్ అండ్ సారో బినీత్ ది హెవెన్స్ వంటి రచనలలో తూర్పు ఆసియా, చైనాల నుండి ప్రేరణ పొందారు. లాస్లో క్రాస్నాహోర్కై రచనలకు లెక్కకు మించిన అభిమానులున్నారు.

## ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీ నష్టాల్లోకి..

మెట్రో, ఆర్టీసీ లేకుండా మొత్తం ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందని కేటీఆర్ అన్నారు. అనంతరం బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి భారత రాష్ట్ర సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు తదితరులు వెళ్లారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు గులాబీ నేతలను గృహనిర్బంధం చేసారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. .

## యుద్ధభూమిలో ఎగిరిన శాంతి కపోతం

చోటుచేసుకోనుందని వెల్లడించింది. ఈ ఒప్పందం వేళ.. రష్యా స్పందించింది. ట్రంప్ అత్యున్నత ప్రతిపాదనలను చేసినట్లు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ అభివర్ణించారు. ఒప్పందంలో నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాలని, గాజాలోకి అన్నిరకాల నిత్యావసరాల సరఫరాలను కొనసాగించాలని ఐరాస పేర్కొంది. ఈ పరిణామాల వేళ అమెరికా అధ్యక్షుడు 'పీస్ ప్రెసిడెంట్' అని వైట్‌హౌస్ అభివర్ణించింది. ఆయన చేతిలో ఒక ÷ల్ పట్టుకొని నడిచివస్తోన్న ఫొటోను షేర్ చేసింది. ఇదిలాఉంటే.. తనకు నోబెల్ శాంతి బహుమతిపై ఉన్న ఆశలను ట్రంప్ మరోసారి వ్యక్తంచేశారు. శాంతి బహుమతి విజేతను నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించనున్న నేపథ్యంలో దానిగురించి శ్వేతసౌధంలో రిపోర్టర్లతో మాట్లాడారు. నోబెల్ సంగతి తనకు తెలియదని, అయితే ఏడు యుద్ధాలు ఆపానని, ఎనిమిదో యుద్ధాన్ని కూడా ఆపబోతున్నట్లు చెప్పారు.

# సోలార్ విద్యుత్ వినియోగంపై ఆసక్తిగా ఉన్నాం

ప్రతిపాదనలతో వచ్చినట్టు జర్మనీ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, 200 యూనిట్ల వరకు గృహ జ్యోతి పథకం కింద ఉచితంగా విద్యుత్ సర ఫరా చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం జర్మనీ ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలోని వ్యవసాయ పంపుసెట్ల తోపాటు గృహ జ్యోతి లబ్ధిదారులకు సోలార్ విద్యుత్ అందించాలని ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులు, గృహ జ్యోతి వినియోగదారులకు ప్రతినెలా ఖచ్చితమైన ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. జర్మన్ ప్రతినిధులు సూచించిన సోలార్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ రాష్ట్రంలో ఏ విధంగా అనుసంధానం చేసుకోగలం, తెలంగాణ విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేసుకోవడానికి జర్మన్ బృందం ప్రతిపాదనలు ఏ మేరకు ఉపయోగపడతాయో అధ్యయనం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ను ఆదేశించారు.జర్మనీ ప్రతినిధులు తీసుకొచ్చిన ప్రతిపాదనలపై అధ్యయనం చేసి ఓ నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ను డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా , జర్మన్ ప్రతినిధులు డాక్టర్ సెబాస్టియన్, డాక్టర్ రఘు చలిగంటి తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఘటన నన్ను షాక్‌కు గురిచేసింది

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడికి యత్నించిన ఘటన ఇటీవల కలకలం రేపింది. దీన్ని పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. తాజాగా దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ స్పందించారు. ఆ ఘటనతో తొలుత తాను షాకయ్యానని తెలిపారు.ఓ కేసు విచారణ సందర్భంగా ఈ ఘటన ప్రస్తావనకు వచ్చింది. సీజేఐ మాట్లాడుతూ.. "సోమవారం నాటి ఘటనతో నేను, సహచర జడ్జి షాక్ అ య్యాం. అయితే, మా వరకు అది ఒక మర్చిపోయిన అధ్యాయం" అని అన్నారు. మరో న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ స్పందిస్తూ.. "సీజేఐపై దాడికి యత్నించడాన్ని జోక్‌గా తీసుకోవద్దు. ఇది సుప్రీంకోర్టు ను అవమానించడమే. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాల్సిందే" అని అన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లా డుతూ.. ఈ ఘటన క్షమార్హం కాదన్నారు. దీన్ని మర్చిపోయిన అధ్యా యం అనడం సీజేఐ గొప్పతనమని కొనియాడారు. అక్టోబరు 6న ఈ ఘటన చోటు చేసుకుంది. సీజే ఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం కోర్టు నం. 1లో వాజ్యాలపై విచారణను కొనసాగిస్తుండగా రాకేశ్ కిశోర్ (71) అనే న్యాయవాది వేదిక వద్దకు వచ్చారు.వెంటనే తన కాలికున్న బూటును తీసి విసర బోతుండగా భద్రతా సిబ్బంది అడ్డుకుని అతనిని బయటకు తరలించారు. ఈసమయంలో ఆ న్యాయవాది.. 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అని నినదించడం వినిపించింది.

**ఘటనకు కారకుడైన న్యాయవాదికి సుప్రీం కోర్టులోకి నో ఎంట్రీ..**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ చర్యలు ప్రారంభించింది. రాకేశ్ సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతోపాటు న్యాయస్థానం ప్రాంగణంలోకి కూడా ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. తాజా ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై ఓ న్యాయవాది దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఇలాంటి అస్థిరమైన ప్రవర్తన కోర్టు అధికారికి పూర్తిగా తగదని, వృత్తిపరమైన నీతిని తీవ్రంగా ఉల్లంఘించడమేనని పేర్కొంది. సుప్రీంకోర్టు గౌరవాన్ని కూడా కాలరాయడమేనని తెలిపింది. న్యాయవాది రాకేశ్ కిశోర్ చేసిన దాడి స్వతంత్ర న్యాయవ్యవస్థపై.. పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. కాగా.. ఘటన నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే రాకేశ్ కిశోర్ లాయర్ లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఓ కేసు విచారణ సమయంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై లాయర్ కిశోర్ తన కాలి బూటుతో దాడికి యత్నించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై దాన్ని అడ్డుకొని ఆయన్ను బయటకు తరలించారు. ఈ క్రమంలో ఆయన 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీజేఐ స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవన్నారు.

## భారత్- యూకే సంబంధాల్లో కొత్తశక్తి

"భారత్-యూకే భాగస్వామ్యం విశ్వసనీయమైనది. ప్రతిభ, సాంకేతికత ఆధారితమైనది. యూకే ప్రధాని స్టార్మర్ నాయకత్వంలో భారత్, యూకే సంబంధాలు గణనీయమైన పురోగతిని సాధించాయి. భారత్, యూకే సహజ భాగస్వాములు. ప్రస్తుత ప్రపంచ అస్థిరత యుగంలో ఇరుదేశాల మధ్య పెరుగుతున్న ఈ భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక పురోగతికి ఒక ముఖ్యమైన పునాది." అని మోదీ తెలిపారు."ఈరోజు సమావేశంలో, మేము ఇండో-పసిఫిక్, పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, ఉక్రెయిన్ యుద్ధం గురించి చర్చించాం. ఉక్రెయిన్- రష్యా యుద్ధం, గాజా సంఘర్షణ వంటి అంశాలపై చర్చించాం. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో యూకేతో సముద్ర భద్రతా సహకారాన్ని పెంపొందించడానికి భారత్ పూర్తిగా కట్టుబడి ఉంది. కీలకమైన ఖనిజాలపై సహకారం కోసం ఇండస్ట్రీ గిల్డ్, సప్లై చైన్ అబ్జర్వేటరీని ఏర్పాటు చేయాలని మేము నిర్ణయించుకున్నాం. సైనిక శిక్షణలో సహకారంపై భారత్, యూకే ఒక ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం భారత వైమానిక దళ ఫ్లయింగ్ బోధకులు యూకేలోని రాయల్ ఎయిర్ ఫోర్స్ లో శిక్షకులుగా పనిచేస్తారు. "అని మోదీ వ్యాఖ్యానించారు.

**భారత్‌పై బ్రిటన్ ప్రధాని ప్రశంసలు**

భారతదేశ ఆర్థిక రాజధానిగా పేరొందిన ముంబయిలో ప్రధాని మోదీతో సమావేశం కావడం చాలా ముఖ్యమని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అభిప్రాయపడ్డారు. భారతదేశ వృద్ధి కథ చాలా అద్భుతమైనదని కొనియాడారు. 2028 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న భారత్, ప్రధాని మోదీ నాయకత్వాన్ని తాను అభినందించాలనుకుంటున్నానని వెల్లడించారు. 2047 నాటికి భారత్?ను పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు."భారత్ అభివృద్ధి ప్రయాణంలో యూకే భాగస్వామిగా ఉండాలని కోరుకుంటోంది. నా సందర్శన ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సామర్థ్యాన్ని రెట్టింపు చేయడం గురించే. అందుకే నేను నాతో పాటు రికార్డు స్థాయిలో 126 మంది బ్రిటిష్ ప్రతినిధుల బృందంతో భారత్?కు తీసుకొచ్చాను. మేము భారత్?తో కలిసి భవిష్యత్తుపై దృష్టి సారించాం. కొత్త ఆధునిక భాగస్వామ్యాన్ని సృష్టిస్తున్నాం. అందుకే ఈ ఏడాది జులైలో యూకే-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. రెండు గొప్ప దేశాలు మరింతగా కలిసి పనిచేస్తాయనే నమ్మకం, విశ్వాసం ఉంది." అని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు.రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ముంబయిలో ప్రధాని మోదీ-స్టార్మర్ సమావేశమయ్యారు. ఈ సమావేశం కోసం రాజ్‌భవన్‌కు వచ్చిన యూకే ప్రధానికి మోదీ స్వాగతం పలికారు. ఈ క్రమంలో పలు అంశాలపై చర్చలు జరిపారు.

## అవును ఆ విమానం మా వల్లే కూలింది

పరిశీలిస్తామన్నారు. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం 2024 డిసెంబరు 25న రాజధాని బాకు నుండి చెచెన్ రాజధాని గ్రోజ్నీకి వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. రష్యా వైమానిక దాడుల్లో విమానం దెబ్బతింది. ఈ క్రమంలో కజకిస్థాన్‌లో ల్యాండ్ చేసేందుకు ప్రయత్నించగా.. కుప్పకూలింది.

## ఎస్ఐఆర్‌కు కొన్ని పార్టీలు సహకరించడం లేదు

ఆదేశించింది. బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించి పలువురు పిటిషనర్లు వాదనలు వినిపించారు. దాదాపు 10శాతం ఓటర్లు తమ హక్కును కోల్పోయారని సామాజిక వేత్త యోగేంద్ర యాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు చేరగా.. వారి నుంచి నిర్దేశిత ధ్రువీకరణ పత్రాల్లో ఒక్కటి కూడా తీసుకోలేదని ఆరోపించారు. వీటికితోడు లక్షలాది మహిళా ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని, లక్షల కుటుంబాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండటం కూడా పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం.. ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారని, బిహార్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటారని ఆశాభావం వ్యక్తం చేసింది.

# బీసీ రిజర్వేషన్లకు బీజేపీ మోకాలడ్డు

- బీజేపీని గద్దె దింపాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



హైదరాబాద్‌ (జనంసాక్షి) : బీజేపీ ప్రభుత్వ కుట్రతోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్‌ చేశారు. సామాజిక న్యాయం కోరే శక్తులు, ప్రజాస్వామికవాదులంతా కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధమైన చర్యలన్నీ తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కులగణన, సర్వే నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదని, శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్‌ చేసి గవర్నర్‌కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయయని, బీజేపీ కులతత్వ, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ కాలరాస్తున్నదని, రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదని తెలిపారు. కేంద్రంలో అధికారంలో బిజెపి ఉండడం వల్లనే ఈ రోజు ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీకి పుట్టగతులు లేకుండా చేస్తేనే సాధ్యమని తెలిపారు.

# ఉప ఎన్నిక ముగిసే వరకూ అప్రమత్తంగా ఉండాలి

- ఎంసీసీ ఉల్లంఘనలపై వేగంగా స్పందించాలి
- ఎంసీసీ కంట్రోల్‌ రూం ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి,జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆర్‌ వి కర్ణన్‌



హైదరాబాద్‌, అక్టోబర్‌ 8 (జనంసాక్షి) : ఎన్నిక ముగిసే వరకూ రౌండ్‌ ది క్లాక్‌ అప్రమత్తంగా ఉండాలనీ కంట్రోల్‌ రూమ్‌ బాధ్యులు, సిబ్బందినీ జిల్లా ఎన్నికల అధికారి,జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆర్‌వి కర్ణన్‌ ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జూబ్లీహిల్స్‌ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో గురువారం మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ కంట్రోల్‌ రూంను జిల్లా ఎన్నికల అధికారి,జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆర్‌ వి కర్ణన్‌ ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల అదనపు కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ , విజిలెన్స్‌ అదనపు ఎస్పీ, ఎంసీసీ నోడల్‌ అధికారి నరసింహారెడ్డి, మీడియా నోడల్‌ అధికారి దశరథం, సిఐ అమృత్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వేచ్ఛాయిత ,పారదర్శక ఎన్నికల నిర్వహణలో ఎంసీసి కంట్రోల్‌ రూమ్‌ ముఖ్య భూమిక పోషించాలని జిల్లా ఎన్నికల అధికారి అన్నారు. కంట్రోల్‌ రూమ్‌ కు వచ్చే ఎన్నికల ప్రవర్తన నియమవళి ఉల్లంఘన ఫిర్యాదుల పై సత్వరమే స్పందించాలన్నారు . ఎంసీసీ ఉల్లంఘనలు జరిగినట్లు సమాచారం అందినవెంటనే క్షేత్రస్థాయి ఎన్నికల బృందాలు ఎక్స్పెండేచర్‌ మానిటరింగ్‌ టీం, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌-ఎస్‌టీ, బీఎస్‌టీ, వీవీటీ, ఎంసీసీలను అప్రమత్తం చేయాలన్నారు.

## మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు

### కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం

బెంగళూరు (జనంసాక్షి) : కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన నెలసరి సెలవు ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. నెలలో ఒకరోజు మహిళా ఉద్యోగులకు ఈ నెలసరి సెలవు ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగినులతో సహా వస్త్ర పరిశ్రమ, ఐటీ, బహుళజాతి సంస్థలు, ఇతర ప్రైవేటు పరిశ్రమల్లో కూడా పనిచేసే వాళ్లకు ఈ సెలవు వర్తించనుందని కర్ణాటక సర్కార్‌ పేర్కొంది. కేబినెట్‌ మీటింగ్‌ తర్వాత న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్‌ దీనిగురించి మాట్లాడారు. '' మహిళా ఉద్యోగినుల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకునే నెలసరి సెలవు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. మహిళలకు నెలసరి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు మానసిక, శారీరక సౌకర్యం ఇవ్వాలన్నదే మా ఉద్దేశం. మేము తీసుకున్న ఈ నిర్ణయం మహిళా ఉద్యోగినులకు ఎంతగానో సాయపడనుంది. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా విజయవంతంగా అమలు చేస్తున్నాయి. అందుకే ఇక్కడ కూడా ఈ సెలవు ఇవ్వాలని అనుకుంటున్నామని'' పేర్కొన్నారు.

# బీసీలను మరోసారి మోసం చేసిన కాంగ్రెస్‌

- జీవో ఇస్తే నిలవదని తెలిసీ స్థానిక ఎన్నికల స్టంట్‌
- 42శాతం రిజర్వేషన్లకు ఎలా చట్టబద్దత వస్తుందో తెలియదా
- ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలి
- మాజీమంత్రి గంగుల కమలాకర్‌ డిమాండ్‌



హైదరాబాద్‌, అక్టోబర్‌9 (జనంసాక్షి) : రాష్ట్ర కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీలను మరోసారి మోసం చేసిందని మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీమంత్రి శ్రీనివాస్‌ గౌడ్‌తో కలసి ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్‌ జీఓ ద్వారా సాధ్యం కాదని, రాజ్యాంగ సవరణ జరిగితేనే ఫలితం ఉంటుందని ప్రతి అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టంగా చెప్పామని పేర్కొన్నారు. ఈ విషయంలో తమిళనాడు వెళ్లి కూడా అధ్యయనం చేసి వచ్చి వివరించామన్నారు. బీసీలను అవమానం చేసేలా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. జీఓ న్యాయస్థానంలో నిలబడదని సీఎం, మంత్రులు, అందరికీ తెలుసని అన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు జరపాల్సిందేనని డిమాండ్‌ చేశారు.బీహార్‌, మహారాష్ట్ర ప్రభుత్వాలు చేసిన తప్పిదాలు చేయవద్దని కోరారు. రాహుల్‌ గాంధీ ప్రధాని అయ్యాకే బీసీ రిజర్వేషన్లు పెంచుతామన్న రేవంత్‌ రెడ్డి జీవో ఎందుకు ఇచ్చారు. 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పిస్తామని జీఓ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. బీసీలు ఏం చేస్తారు లే అని రేవంత్‌ రెడ్డి ప్రభుత్వం చెల్లని జీవో ఇచ్చిందని ఆరోపించారు. 1992లో తమిళనాడు సీఎం జయలలిత, ఎమ్మెల్యేలను ఢిల్లీ తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ల కోసం భీష్మించి కూర్చోవడంతో కేంద్రం దిగివచ్చి రాజ్యాంగ సవరణ చేయడం వల్ల తమిళనాడులో బీసీలకు రిజర్వేషన్లు పెరిగాయని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్ల కోసం రేపే ఢిల్లీ వెళ్దామని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డికి సూచించారు.42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే కాంగ్రెస్‌ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది హెచ్చరించారు.ఎన్నికలకు తొందర లేదు, రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించిన తర్వాతే నిర్వహించాలన్నారు.చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి ఢిల్లీకి కదలాలని, రిజర్వేషన్ల అంశం తేలే వరకు హైదరాబాద్‌ రావద్దని సూచించారు. 56 సార్లు సొంత పనుల కోసం ఢిల్లీ వెళ్లిన సీఎం బీసీల కోసం ఒక్కసారి ఢిల్లీ వెళ్లి పోరాడాలని సూచించారు. రాహుల్‌ గాంధీని ఖుషీ చేసేందుకు, పదవులు కాపాడుకునేందుకు కాంగ్రెస్‌ నేతలు స్టంట్‌ చేస్తున్నారని మాజీమంత్రి శ్రీనివాస్‌ గౌడ్‌ విమర్శించారు.రాష్ట్రపతిని కలవకుండానే ఢిల్లీలో ధర్నా చేసి హంగామా చేశారని ఆరోపించారు.చట్టం ప్రక్రియ పూర్తి కాకముందే జీవోఎలా తెస్తారని ప్రశ్నించారు.బీహార్‌లో ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.రాహుల్‌ గాంధీ కోసం తెలంగాణలో బీసీలను బలి పెట్టి రోడ్లపైకి తీసుకొచ్చారని ఆరోపించారు.

# ఏసీబీకి చిక్కిన చిట్యాల తహసీల్దార్‌



నల్లగొండ, అక్టోబర్‌9 (జనంసాక్షి) : నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహసీల్దార్‌ కృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గుండ్రంపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ భూమికి సంబంధించన మ్యూటేషన్‌ కోసం రూ. 2లక్షలు డిమాండ్‌ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. తహసీల్‌ కార్యాలయంలో వ్యూహం ప్రకారం మాటువేసిన ఏసీబీ అధికారులు గురువారం తహసీల్దార్‌ గుగులోత్‌ కృష్ణా , మరో ప్రైవేట్‌ వ్యక్తి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నాంబర్‌ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ సిబ్బంది లంచాలకు పాల్పడితే 1064 టోల్‌ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## బీసీలను 42శాతం పేరుతో కాంగ్రెస్‌ మోసం

- 50ఏళ్లుగా కాంగ్రెస్‌ బడుగులకు వ్యతిరేకమే
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌



సూర్యాపేట, అక్టోబర్‌9 (జనంసాక్షి) : స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ కల్పిస్తామని చెప్పి కామారెడ్డి డిక్లరేషన్‌ పేరుతో పరోక్షంగా మరోసారి కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్‌ఎస్‌ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్‌ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం గత 50 సంవత్సరాలుగా బీసీలకు, బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకమన్నారు. కోర్టులో జీఓ 9 నిలబడదని తెలిసి కాంగ్రెస్‌ ప్రభుత్వం నటించిందన్నారు. ఆర్టికల్‌ 9 సవరించి పార్లమెంట్‌లో అనుమతి వస్తే తప్పా ఇది సాధ్యం కాదని బీఆర్‌ఎస్‌ మొదటి నుంచి చెబుతూనే ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చామని, ఏదో పోరాడమని చెప్పుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నటించిందన్నారు. కోర్టు స్థానిక సంస్థల నోటిఫికేషన్‌ నిలిపివేసిందని, దీనికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్‌ అన్నారు. ఆరూ గ్యారంటీల మాదిరిగానే కాంగ్రెస్‌ ప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో బీసీల మనోభావాలను, ఆత్మ గౌరవాన్ని అగౌరవ పరిచిందన్నారు. నోటిఫికేషన్‌ వెలువడడంతో ఎంతో మంది బీసీ అభ్యర్థులు డబ్బులు పోగొట్టుకున్నారని, దీనికి కాంగ్రెస్‌ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. బీఆర్‌ఎస్‌ మొదటి నుంచి చెబుతున్నట్లుగానే 42 శాతం రిజర్వేషన్ల సాధనకు పోరాడుతుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్‌ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.

## నేడు తెలంగాణ బంద్‌కు పిలుపు!

హైదరాబాద్‌ (జనంసాక్షి) : రిజర్వేషన్లను వదులుకోబోమని... ప్రభుత్వం మరింత గట్టిగా పోరాడి తమ హక్కులను కాపాడాలని బిసి సంఘాలు కోరుతున్నాయి. రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని... తెలంగాణ బంద్‌ చేపడతామని హెచ్చరిస్తున్నాయి. ఇలా బీసీ సంఘం నేత, మాజీ ఎంపీ ఆర్‌. కృష్ణయ్య, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్‌ మల్లన్నతో పాటు మరికొందరు బిసి నాయకులు హెచ్చరిస్తున్నారు.

# ఏఐ ఉపయోగించి అశ్లీల చిత్రాలు

- 36 మంది విద్యార్థినుల ఫొటోలు మార్ఫింగ్‌..
- స్టూడెంట్‌ సస్పెండ్‌

రాయ్‌పూర్‌ (జనంసాక్షి) : ఒక స్టూడెంట్‌ 36 మంది విద్యార్థినుల ఫొటోలు మార్ఫింగ్‌ చేశాడు. ఏఐ ఉయోగించి అశ్లీల చిత్రాలుగా మార్చాడు. ఇది బయటపడటంతో బాధిత విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. అంతర్గత కమిటీ దర్యాప్తు తర్వాత ఆ స్టూడెంట్‌ను బహిష్కరించారు. ఛత్తీస్‌గఢ్‌ రాజధాని రాయ్‌పూర్‌లోని ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ (ఐఐఐటీ)లో ఈ సంఘటన జరిగింది. మూడో ఏడాది చదువుతున్న సయ్యద్‌ రహీమ్‌ అద్నాన్‌ అలీ, 36 మంది క్లాస్‌మేట్స్‌ ఫొటోలను మార్ఫింగ్‌ చేశాడు. ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ) టూల్‌ ద్వారా విద్యార్థినుల ఫొటోలను అశ్లీల చిత్రాలుగా మార్చాడు. కాగా, అక్టోబర్‌ 6న బాధిత మహిళా స్టూడెంట్స్‌ దీనిని గుర్తించారు. ప్రొఫెసర్లకు ఫిర్యాదు చేశారు. దీంతో మహిళా ప్రొఫెసర్‌ నేతృత్వంలో నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశారు. సయ్యద్‌ ల్యాప్‌టాప్‌, మొబైల్‌ ఫోన్‌, పెన్‌ డ్రైవ్‌ స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అభ్యంతరకరమైన ఏఐ జనరేటెడ్‌ కంటెంట్‌ ఉన్నట్లు నిర్ధారించారు. అదే రోజున ఆ విద్యా సంస్థ నుంచి అతడ్ని బహిష్కరించారు. హాస్టల్‌ నుంచి పంపివేశారు. తల్లిదండ్రులను రప్పించి బిలాస్‌పూర్‌ జిల్లాలోని అతడి సొంతూ రుకు పంపారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు ఈ ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. సమాచార సాంకేతిక చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడు సయ్యద్‌ ల్యాప్‌టాప్‌, మొబైల్‌ ఫోన్‌, పెన్‌ డ్రైవ్‌ను కమిటీ నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆ స్టూడెంట్‌ను అరెస్ట్‌ చేసేందుకు ఒక పోలీస్‌ బృందం బిలాస్‌పూర్‌ వెళ్లిందని పోలీస్‌ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఎన్నికల నోటిఫికేషన్‌ వచ్చాక స్టేలు ఇవ్వలేదు

- తాజాగా హైకోర్టు స్టేపై ఎంపి మల్లు రవి



న్యూఢిల్లీ, అక్టోబర్‌ 9 (జనంసాక్షి) : ఎన్నికల నోటిఫికేషన్‌ ఇచ్చిన తర్వాత సుప్రీంకోర్టుగాని, హైకోర్టుగాని స్టే ఇచ్చిన దాఖలాలు లేవని కాంగ్రెస్‌ ఎంపీ మల్లు రవి తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు మూడు నెలల్లోగా రాష్ట్రపతి, గవర్నర్‌ బిల్లుకు ఆమోదం తెలపకపోతే.. ఆమోదం పొందినట్టుగా భావించాల్సి ఉంటుందని చెప్పిందని గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్లు ఇవ్వడంతో చాలామంది నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. ఎన్నికలు పెట్టకపోవడంతో పంచాయతీకి రావాల్సిన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి రావడం లేదని స్పష్టం చేశారు. చట్టం ప్రకారం బీసీ రిజర్వేషన్లు చేశామని మల్లు రవి తెలిపారు. అసెంబ్లీలో పెట్టామని, అన్ని పార్టీలు కూడా మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. బీసీలు 56 శాతం ఉన్నారని రిపోర్ట్‌ వచ్చిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 10శాతం వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్‌ కల్పించిందని చెప్పారు. 50 శాతం సీలింగ్‌ అప్పుడే దాటిందని అన్నారు. హైకోర్టు స్టే ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థను పక్కన పెట్టినట్టు గుర్తించాల్సిందే అని వెల్లడించారు. రిజర్వేషన్లపై జడ్జిమెంట్‌ రావడం అంటే ప్రజాస్వామ్యం గురించి చాలా లోతుగా అసెంబ్లీలో, పార్లమెంట్లో చర్చ జరగాలని ఆయన సూచించారు. న్యాయ వ్యవస్థను గౌరవిస్తున్నామని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించే వ్యవస్థ న్యాయవ్యవస్థ అని పేర్కొన్నారు. రేవంత్‌ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత శాస్త్రీయంగా తెలంగాణలో కులగణన చేశారని తెలిపారు. బీసీ కులగణన ప్రతి కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితులు తెలుసుకున్నారని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు దానికి అడ్డుకట్ట వేసినట్లైందని అసహనం వ్యక్తం చేశారు. న్యాయ నిపుణులతో చర్చించి ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న దానిపైన ఆలోచన చేస్తామని ఆయన వివరించారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీ మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు.

# భార్యను చంపి మంచం కింద దాచిపెట్టిన భర్త



బెంగళూరు (జనంసాక్షి) : కర్ణాటకలోని బెలగావిలో దారుణం జరిగింది. ఓ వ్యక్తి తన భార్యను చంపి మృతదేహాన్ని మంచం కింద దాచిపెట్టడం కలకలం రేపింది. ఇంతకీ అసలేం జరిగిందో తెలియాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. ఇక వివరాల్లోకి వెళ్తే.. ఆకాష్‌ కంబర్‌ అనే వ్యక్తికి నాలుగు నెలల క్రితం సాక్షి(20) అనే యువతితో వివాహం జరిగింది. దంపతుల మధ్య గొడవలు రావడంతో మూడు రోజుల క్రితం ఆకాష్‌ భార్యను హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె మృతదేహాన్ని మంచం కింద దాచిపెట్టి ఇంట్లో నుంచి పారిపోయాడు. ఆకాష్‌కు అతడి తల్లి ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ వచ్చింది. దీంతో ఆందోళనతో ఆమె ఇంటికి వచ్చాక మంచం కింద కోడలు మృతదేహాన్ని చూసి షాకైపోయింది. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సాక్షి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు జరిగిన విషయం చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ఆకాశ్‌ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే వరకట్న వేధింపుల వల్లే సాక్షిని ఆకాశ్‌ హత్య చేశాడని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇదిలాఉండగా హర్యానాలోని గురుగ్రామ్‌లో మరో దారుణం జరిగింది. ఏడాదికి రూ. 20 లక్షల ప్యాకేజీకి పనిచేస్తున్న 28 ఏళ్ల ఓ సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుభమ్‌ మీనా అనే వ్యక్తికి 6 నెలల క్రితం ఢిల్లీకి చెందిన ఓ మహిళతో ప్రేమ వివాహం చేసుకున్నాడు. దంపతులిద్దరూ నయాగావ్‌ ప్రాంతంలోని మాతా కాలనీ సమీపంలో ఉంటున్నారు. రాజస్థాన్‌లోని ఓ సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో అతడు పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం శుభమ్‌ ఇంటినుండి బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. చివరికి ఇంటిపైన మరో రూమ్‌లో సూసైడ్‌ చేసుకున్నాడు. అయితే అతడు డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు తెలిసింది.

# చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

3కోట్లతో పోలీస్‌ జంప్‌

విశాఖపట్టణం, అక్టోబర్‌9 (జనంసాక్షి) : విశాఖలోని ఎండాడలో హెడ్‌ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి కుటుంబం చీటీల పేరుతో జనానికి కుచ్చుటోపీ పెట్టింది. ఏకంగా రూ. 3 కోట్ల జనం సొమ్ముతో కానిస్టేబుల్‌ అండ్‌ ఫ్యామిలీ జంప్‌ అయింది. దీంతో బాధితులు ఏం చేయాలో అర్థం కాక.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డివిజన్‌లో హెడ్‌ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. భార్య రవణమ్మ, కూతురుతో కలిసి ఎండాడలో ఉంటున్నారు. జగ్గారావు పోలీస్‌ కావడంతో.. అతని భార్య రవణమ్మ.. పోలీసమ్మ అవతారం ఎత్తింది. స్థానికంగా బాగానే పరిచయాలు పెంచుకుంది. అంతే కాదు 2019లో చీటీల వ్యాపారం షురూ చేసింది రవణమ్మ. లక్ష రూపాయల నుంచి 5 లక్షల రూపాయల వరకు చీటీలు నడిపించేది. క్రమంగా చీటీల దందాలోకి జగ్గారావు కూడా దిగాడు. బంధువులు, చుట్టుపక్కల అపార్టుమెంట్లలో ఉండేవాళ్లు, చిన్న చిన్న ఉద్యోగులు, ఇళ్లల్లో పని చేసేవారు, వాచ్‌మెన్లు.. ఇలా ఎవరినీ వదలలేదు. అందరితో మంచి మాటలు కలిపి చీటీలు వేయించారు. జనాల లక్షలకు లక్షలు వసూలు చేశారు. మరోవైపు జనం కూడా పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం చీటీలు వేసుకుంటూ వచ్చారు..చాలా ఏళ్ల నుంచి నమ్మకంగా చీటీలు నడిపిన రవణమ్మ.. మొన్నటికి మొన్న రాత్రికి రాత్రి దుకాణం సర్దేసింది. ఇళ్లు ఖాళీ చేసి జగ్గారావు, రవణమ్మ ఎక్కడికో వెళ్లిపోయారు.

# చికెన్‌ తిన్న ఆరుగురికి అస్వస్థత



పెన్‌పహాడ్‌, అక్టోబర్‌ 09 (జనంసాక్షి) : చికెన్‌ తిని ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన పెన్‌పహాడ్‌ మండలం దూపాడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు కత్తి ఉపేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గడిచిన శనివారం తన మనవడి 21వ రోజు వేడుక సందర్భంగా పెన్‌పహాడ్‌లోని క్వాలిటీ చికెన్‌ సెంటర్‌ వద్ద 6 కేజీల చికెన్‌ తీసుకుని వెళ్లాడు. భోజనం అనంతరం గంట తర్వాత కుటుంబ సభ్యులకు స్వల్పంగా వాంతులయ్యాయి. మామూలు వాంతులే అని పట్టించుకోలేదు. కాగా తెల్లవారుజాము నుండి విపరీతంగా వాంతులు, విరోచనాలు కాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు, ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో ఇద్దరు చిన్నారులను, మరో ప్రైవేట్‌ ఆస్పత్రిలో ఓ మహిళను అడ్మిట్‌ చేశారు. డాక్టర్లు ఇచ్చిన రిపోర్టు ప్రకారం చికెన్‌ తినడం వల్లే అస్వస్థతకు గురైనట్లు బాధితుడు తెలిపాడు. చికెన్‌ సెంటర్‌ నిర్వాహకుడిని ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నట్లు వెల్లడించాడు. క్వాలిటీ చికెన్‌ సెంటర్‌పై అధికారులు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను రక్షించాలని ఈ సందర్భంగా ఉపేందర్‌ పేర్కొన్నాడు.

# సనాతన ధర్మానికి అవమానం జరిగిందా!

## జస్టిస్.గవాయిపై దాడి ప్రతీకార చర్యనా!?

భారతదేశంలో న్యాయవ్యవస్థ అనేది కేవలం చట్టాల కూర్పు మాత్రమే కాదు, రాజ్యాంగ ఆత్మ కూడా. అది సామాజిక న్యాయానికి ప్రతీక కూడా. అయితే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ .బీ.ఆర్. గవాయి మీద జరిగిన చెప్పు దాడి, ఆయన కుటుంబానికి విస్తరించిన రాజకీయ,మతపరమైన వివాదాలు కూడా చేరి ఉన్నాయా?, ఈ సంఘటన ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోతైన విభేదాలను బహిర్గతం చేశాయి. 2025 అక్టోబర్ లో సుప్రీం కోర్టులో జరిగిన ఈ దాడి, ఇటీవల 2025 సెప్టెంబరులో గవాయి తల్లి కమలతాయి గవాయి మీద ఆరెస్సెస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) శాతం జయంతి ఆహ్వాన తిరస్కార వివాదంతో మరింత ఉద్ధృతమైంది. ఈ సంఘటనలు కేవలం వ్యక్తిగత దాడులు మాత్రమే కావుబీ అవి మతం, కులం, రాజ్యాంగ విలువల మధ్య ఉద్భవించిన ఘర్షణల ప్రతిఫలనంగా మనం చూడాలి.

దళిత నేపథ్యం నుంచి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వరకు:

బీ.ఆర్. గవాయి (పూర్తి పేరు: భూషణ్ రామకృష్ణ గవాయి) 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో ఒక దళిత (షెడ్యూల్డ్ కాస్ట్) కుటుంబంలో జన్మించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రభావంతో బౌద్ధ మతాన్ని స్వీకరించిన కుటుంబం నుంచి వచ్చిన ఆయన, నిరాడంబర జీవితంతో పోరాడి ఎదిగారు. 1985 మార్చి 16న బొంబే హైకోర్టులో అడ్వకేట్ గా పనిచేశారు. 2003లో బొంబే హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2018లో ఒరిస్సా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టారు. 2019 మే 24న సుప్రీం కోర్టు జడ్జిగా ఎదిగి, 2025 మే 14న 52వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మొదటి బౌద్ధ మతస్థుడు. రెండో దళిత సిజేఐ (కేజీ బాలకృష్ణన్ తర్వాత). 2010లో బాలకృష్ణన్ రిటైర్ అయిన తర్వాత 9 సంవత్సరాల అనంతరం షెడ్యూల్డ్ కాస్ట్ నుంచి సుప్రీం కోర్టు జడ్జిగా నియమితులయ్యారు.

ఆయన వ్యక్తిత్వం సరళత, నిబ్ధత, సామాజిక న్యాయానికి అంకితభావంతో కూడినది. అంబేద్కర్ ఆలోచనలు ఆయనను ప్రభావితం చేసాయి. సమానత్వం, అణగారిన వర్గాల హక్కులు, రాజ్యాంగ విలువలను దళిత నేపథ్యం నుంచి వచ్చి, రాజ్యాంగాన్ని కాపాడుతున్నారు. ఆయన తీర్పులు వ్యక్తిగత అనుభవాలతో మెలిగినవి, ఈక్విటీకి (సమానత్వం) కట్టుబడి ఉన్నాయి. ఈ నేపథ్యం, ఆయనపై జరిగిన దాడులకు కులపరమైన కోణాన్ని ఇస్తుంది.

**ఈ వివాదానికి మూలం ఎక్కడ?విష్ణు విగ్రహ పునరుద్ధరణ పిటిషన్:**

ఈ దాడి వెనుక 2023లో సుప్రీం కోర్టులో జరిగిన ఒక సున్నితమైన విచారణ దాగి ఉంది. ఖజురాహోలోని జావరి మహల్‌లో భగవాన్ విష్ణువు విగ్రహం దెబ్బతిని, దాన్ని పునరుద్ధరించాలనే పిటిషన్ దాఖలైంది. ఈ కేసు విచారణలో జస్టిస్.గవాయి బెంచ్‌కు బాధ్యత వహించారు. పిటిషనర్ భక్తుడు భావోద్వేగంతో "విగ్రహాన్ని పునరుద్ధరించాలి, ఇది మా భగవాన్" అని చెప్పాడు. దీనిపై గవాయి, "మీరు భగవాన్ ను వేడుకోండి, ఆయనే తనను తాను పునరుద్ధరించుకుంటారు" అని వ్యంగ్యాస్త్రంతో స్పందించారు. ఇది న్యాయస్థానం మతపరమైన విషయాల్లో జోక్యం చేసుకోవడం సరైనది కాదని సూచించిన మాటలు. కానీ, సోషల్ మీడియాలో ఇది "సనాతన ధర్మానికి అవమానం"గా వక్రీకరించబడింది.

నిజానికి "ఇది వ్యంగ్య వ్యాఖ్య మాత్రమే. మత ఎగతాళి కాదు. జస్టిస్.గవాయి గత వ్యక్తి గత జీవితం, ఉద్యోగ జీవితాన్ని లోతుగా పరిశీలిస్తే ఆయన అన్ని మతాలకు సమానం గౌరవం చూపించారు. బౌద్ధుడైనప్పటికీ, హిందూ ధర్మానికి కూడా గౌరవం చూపించారు. కానీ, ఆయన దళిత-బౌద్ధ నేపథ్యం కారణంగా ఈ మాటలు కుల ద్వేషంగా మలిచబడ్డాయి." జస్టిస్. గవాయి తన ముఖ్య తీర్పుల్లో మత సహనాన్ని బలపరిచిన సంఘటనలు అనేకం వున్నాయి.



ఉదాహరణకు, 2024లో ఒక ల్యాండ్‌మార్క్ రూలింగ్‌లో మతపరమైన హక్కులు, సమానత్వాన్ని సమతుల్యం చేసి, వ్యక్తిగత అనుభవాల ఆధారంగా తీర్పు ఇచ్చారు.

ఈ వివాదంపై జస్టిస్.గవాయీ స్పందన:

ఈ వివాదం విస్తరణ వెలుగులోకి వచ్చిన తర్వాత, జస్టిస్.గవాయి వెంటనే స్పందించారు: "నా మాటలు తప్పుగా అర్థమయ్యాయి. నేను సనాతన ధర్మాన్ని, అన్ని మతాలను సమాన గౌరవ భావంతో చూస్తాను" అని అన్నారు. ఇది న్యాయస్థాన బాధ్యతల నిర్వహణ సందర్భం." ఈ స్పష్టీకరణ ఉన్నప్పటికీ, భావోద్వేగాల సోషల్ మీడియా కామెంట్లు ఆగలేదు. "ఇది మతపరమైనది కాదు, కులపరమైనది. జస్టిస్. గవాయి లాంటి దళిత న్యాయమూర్తిని లక్ష్యం చేసుకోవడం, అంబేద్కర్ రాజ్యాం పై దాడి. ఆయన ఇప్పటివరకు సుమారు 300 తీర్పులు ఇచ్చారు. అన్నింటిలో కూడా మొదట ఆయన రాజ్యాంగ హక్కులు, రాజ్యాంగ చట్టాలపై దృష్టి పెట్టారు. ఉదాహరణకు, ఆర్టికల్ 370 రద్దును ఆమోదించిన కాన్‌స్టిట్యూషన్ బెంచ్‌లో పాల్గొన్నారు, అక్కడ రాజ్యాంగ విలువలు, ప్రొసీజరల్ ఫెయిర్‌నెస్‌ను బలపరిచారు."

ఈ వివాదం 2025 సెప్టెంబరులో మరింత ఉద్ధృతమైంది.ఆరెస్సెస్ విజయదశమి కార్యక్రమానికి (సెంటెనరీ ఈవెంట్) గవాయి తల్లి కమలతాయి గవాయిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. మొదట ఆమె హాజరు కాకపోవడం గురించి న్యూస్ రిపోర్టులు వచ్చాయి. కానీ, వివాదం, ఆరోపణలు, కుటుంబంపై నిందలు కారణంగా ఆమె తిరస్కరించారు. ఒక చేతివ్రాత లేఖలో, "నేను ఘన అంబేద్కరైట్ ను. ఆరెస్సెస్ కార్యక్రమానికి హాజరు అయితే కూడా, అంబేద్కర్ ఐడియాలజీని ముందుంచుతాను" అని స్పష్టం చేశారు. ఆమె కొడుకు (గవాయి సోదరుడు) మొదట ఆమె హాజరు కావడాన్ని సమర్థించారు. "పర్సనల్, పొలిటికల్ రిలేషన్స్ డిఫరెంట్" అని. కానీ, కమలతాయి దాన్ని "ఫాల్స్ కాన్‌స్పిరసీ"గా తిరస్కరించారు. ఆరోగ్య సమస్యలు కూడా కారణంగా చెప్పారు.

"ఈ ఆహ్వాన తిరస్కారం, గవాయి కుటుంబం అంబేద్కర్ వారసత్వానికి కట్టుబడి ఉన్నట్టు చూపిస్తుంది.ఆరెస్సెస్ లాంటి సంస్థలు మత-జాతీయత్వాన్ని ప్రమోట్ చేస్తాయి. కానీ, దళిత-బౌద్ధ కుటుంబాలకు ఇది సంఘర్షణ వంటిది.జస్టీస్. గవాయి వ్యక్తిత్వం మొదటి నుంచీ సరళమైనది. సహనశీలమైనది. ఏలాంటి వివాదాల్లో ఇంత వరకు చిక్కుకోలేదు. ఆయన నిష్పాక్షికంగా రాజ్యాంగ గౌరవాన్ని కాపాడుతూ విధులు నిర్వహిస్తున్నారు.ఆయన ట్రాక్ రికార్డ్ లో ఎక్కడా, ఎవరితోనూ రాజీ పడిన చరిత్ర నమోదు కాలేదు."

**కోర్టులో భద్రతా లోపం- కుల ద్వేషం:**

2023 ఆగస్టులో, సుప్రీం కోర్టు విచారణ సమయంలో 71 ఏళ్ల న్యాయవాది రాకేష్ కిషోర్, గవాయి ముందు నిలబడి "సనాతన ధర్మానికి అవమానం!" అని అరుస్తూ చెప్పు విసిరే ప్రయత్నం చేశాడు. భద్రతా సిబ్బంది ఆపారు, కానీ ఈ సంఘటన షాకింగ్. కిషోర్ దాన్ని "దైవాజ్ఞ"గా సమర్థించుకున్నాడు. "ఇది స్పష్టంగా కులవివక్షతో కూడిన దాడి. జస్టిస్.గవాయి ఆర్టికల్ 370 లాంటి తీర్పుల్లో రాజ్యాంగ సమతుల్యతను చూపారు, కానీ ఇప్పుడు దళిత నేపథ్యం కారణంగా లక్ష్యమయ్యారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ద్వారా వ్యాపించింది."

ఈ దాడి తర్వాత, అటార్నీ జనరల్ కిషోర్‌పై క్రిమినల్ కంటెంప్ట్ కేసు దాఖలు చేయాలని కోరారు. గవాయి వ్యక్తిత్వం శాంతమైనది, న్యాయపరమైనది. ఇలాంటి సంఘటనల్లో కూడా ఆయన తన సహనాన్ని కోల్పోలేదు.తన పనిని యధావిధిగా ప్రశాంతంగా చేసుకుని పోయారు.కోపాన్ని,తన భావావేశాన్ని చూపలేదు. అలాంటి లక్షణాలే ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుంది.

**చివరిగా... ఐక్యత, సహనం, రాజ్యాంగ రక్షణ:**

చెప్పు దాడి సంఘటన నుంచి ఆరెస్సెస్ ఆహ్వాన తిరస్కారం వరకు... మనం పరిశీలించి చూస్తే.. సమాజంలో మతం, కులం మధ్య లోతైన దూరాన్ని చూపిస్తున్నాయి.జస్టిస్. గవాయి జీవితం, గతంలో ఇచ్చిన తీర్పులు (ఆర్టికల్ 370, ఫండమెంటల్ రైట్స్) అన్నింటిలో కూడా ఆయన గత వ్యక్తిత్వం, నడవడి "అంబేద్కర్ విలువలను" రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి. "సనాతన ధర్మం అంటే అది కూడా అహింస, సహనాన్నే బోధిస్తుంది. దాడులు ధర్మాన్ని అవమానిస్తాయి. మనం విద్య, ఐక్యతతో సత్యం కోసం పోరాడాలి. అంతే కానీ హింసతో కాదు." జస్టిస్.గవాయి లాంటి వారిని కాపాడకపోతే, ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ఈ వివాదాల నుంచి మనం ఏమి నేర్చుకోవాలి? మత సహనం, కుల సమానత్వం ద్వారా ముందుకు సాగాలి.జస్టీస్. గవాయి లాంటి న్యాయమూర్తులు రాజ్యాంగ రక్షకులు. వారి వారసత్వాన్ని గౌరవించాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

# మనసు గోడలు దాటి.. మానసిక ఆరోగ్యమే అసలైన సంపద

సాధారణంగా ఒంట్లో నలత వస్తే, అది సూక్ష్మజీవులు, వైరస్లు, కరోనా లాంటి బయటి శక్తుల దాడితోనే మొదలవుతుంది. కానీ మానసిక రుగ్మతల లెక్క వేరే లెవల్. అవి మనిషి గుండె లోపలికి నిశ్శబ్దంగా జొరబడి, అక్కడే తిష్ట వేసుకొని కూర్చునే అదృశ్య రోగాలు. ఇవి ఇతరుల కండ్లకు కనబడవు, డాక్టర్లకు కూడా పూర్తిగా అంతుచిక్కని రహస్యాలు లాగా ఉంటాయి. ఈ సమస్యలు మనిషి ఆత్మబలాన్ని తీసేసి, మనసును ముక్కలుముక్కలు చేస్తాయి. ఆఖరికి, ఈ మానసిక బాధే మనిషికి రకరకాల ఒంటి రోగాలు రావడానికి బీజం వేస్తుంది.

> **ఈనాటి యువత మానసిక ఆరోగ్యంతో వుండడం ఎంతో అవసరం. సమాజంలో పెట్రేగిపోతున్న విపరీత ధోరణులకు ముఖ్య కారణం మానసికంగా ఆరోగ్యంగా లేక పోవడమే. యువతలో పెరుగుతున్న ఒత్తిళ్ళ వల్ల రక రకాల సమస్యలు మూలమవుతున్నారు. వారు సమాజంలో సంఘ విద్రోహక చర్యలకు పాల్పడుతున్న వారెందరో, హత్యలు, ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారెందరో..**

ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న నిర్వహించే " ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం," మన దేశంలో పెరుగుతున్న మానసిక ఆరోగ్య సమస్యల గురించి అవగాహన పెంచడానికి ఒక గొప్ప అవకాశం. 1992లో ప్రారంభమైన ఈ దినోత్సవం, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించి, సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తుంది. 2025లో దీని థీమ్" సహజంగా విపత్తులు, అత్యవసర పరిస్థితులలో



మానసిక ఆరోగ్య సేవలకు ప్రాధాన్యత కల్పించడం భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఇది చాలా ముఖ్యమైనది. ఈ దినోత్సవం మానసిక అనారోగ్యంపై ఉన్న అపోహలను తొలగించి, దాని గురించి బహిరంగంగా మాట్లాడేలా ప్రోత్సహిస్తుంది.

**రేపటి భవితకు తొలి అడుగు.. యువత మానసిక ఆరోగ్యం**

మానసిక ఆరోగ్యం అంటే కేవలం అనారోగ్యం లేకపోవడం మాత్రమే కాదు, ఇది ఒక వ్యక్తి శారీరకంగా, మానసికంగా, మరియు సామాజికంగా ఆరోగ్యంగా ఉండటం." మానసిక ఆరోగ్యం అంటే ఒత్తిళ్ళ నుండి మరియు బాధల నుండి స్వేచ్ఛను పొంది ఆదర్శవంతంగా వుండే స్థితి "ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ) నిర్వచనం ప్రకారం, " మానసిక ఆరోగ్యం బహుళ భావనలతో కూడి వుంది. శారీరక, మానసిక, సామాజిక, ఉద్వేగ పరంగా, ఆధ్యాత్మికంగా ఆరోగ్యంగా వుండడాన్ని మానసిక ఆరోగ్యం గా చెప్పడం జరిగింది". భారతదేశానికి ఉన్న యువశక్తి వారి మానసిక ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది.

భారతదేశానికి ఉన్న యువశక్తి, వారి మానసిక ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. నేటి యువత బాల్యం నుండి యవ్వనంలోకి అడుగుపెట్టే సమయంలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు చదువుల ఒత్తిడి, భవిష్యత్తుపై అనిశ్చితి, సోషల్ మీడియా ప్రభావం, మరియు కుటుంబ సమస్యలు వంటివి వారిని మానసికంగా కుంగదీస్తాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదికల ప్రకారం, 2020 నుండి 2022 మధ్య దేశంలో ఆత్మహత్యల సంఖ్య 26% పెరిగింది. మానసిక ఒత్తిడి, ఆందోళన, మరియు డిప్రెషన్ వంటివి ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు, మానసికంగా ఆరోగ్యంగా ఉన్న యువకులు తమ జీవితంలోని సవాళ్లను ఎదుర్కోగలరు, మంచి సంబంధాలను పెంచుకోగలరు మరియు తమ సామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకోగలరు.

**మానసిక ఆరోగ్యం పరిస్థితి.. ప్రపంచవ్యాప్తంగా**

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ) 2024 నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 100 కోట్లకు పైగా ప్రజలు వివిధ మానసిక ఆరోగ్య సమస్యలతో జీవిస్తున్నారు. ఆందోళన మరియు ఒత్తిడి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. 2011-2021 మధ్య కాలంలో మానసిక రోగుల సంఖ్య ప్రపంచ జనాభా పెరుగుదల కంటే వేగంగా పెరిగింది.

ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.1 బిలియన్ (నూట పది కోట్లు) మంది ప్రజలు మానసిక రుగ్మతలతో జీవిస్తున్నారు.కోవిడ్-19 ప్రభావం వల్ల మానసిక ఆరోగ్య సమస్యలు గణనీయంగా పెరిగాయి. డిప్రెషన్, ఆందోళనతో బాధపడుతున్న వారి సంఖ్య 416 మిలియన్ల నుండి 615 మిలియన్లకు పెరిగింది ఇది దాదాపు 50% పెరుగుదల. మానసిక, న్యూరోలాజి కల్, పదార్థ వినియోగ రుగ్మతలు ప్రపంచ వ్యాప్తంగా 13% వరకు పెరిగాయి, ఇది ఆందోళన కలిగించే విషయం. ప్రతి నలుగురిలో ఒకరు వారి జీవితంలో ఏదో ఒక దశలో మానసిక రుగ్మతతో బాధపడతారని అంచనా.చికిత్సలో విపరీతమైన అంతరం ఉంది అధిక ఆదాయ దేశాలలో 50% మందికి మాత్రమే, తక్కువ మరియు మధ్యతరగతి ఆదాయ దేశాలలో 85% మందికి సరైన చికిత్స అందుబాటులో లేదు.ప్రపంచ ఆర్థిక వేదిక (World Economic Forum – 2018) ప్రకారం, ప్రతి దేశంలో మానసిక ఆరోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి.భారతదేశంలో మానసిక సమస్యలు ఉన్న వారిలో 70-80% మందికి సరైన చికిత్స అందడం లేదు.భారత జనాభాలో సుమారు 13.7% మందికి మానసిక సమస్యలు ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.భారత యువతలో దాదాపు 10% మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.

తెలంగాణ జనాభా సుమారుగా 4 కోట్ల మందిగా ఉంది

ఈ రాష్ట్రంలో తీవ్రమైన మానసిక రుగ్మతల ద్వారా ప్రభావితుల సంఖ్య సుమారు 47 లక్షల మందిగా ఉంటుంది.అలాంటి రుగ్మతల గురించి చికిత్స గ్యాప్ (treatment gap) 75% వరకు ఉన్నట్టు తేలింది – అంటే చాలా మంది వారికి అవసరమైన చికిత్సకు చేరలేకపోతున్నారు.తెలంగాణలో మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం కార్యకలాపాలు కూడా సాగుతున్నాయి – తెలంగాణ మెంటల్ హెల్త్ అవేర్నెస్ కార్యక్రమాలు.ఇంకా, రాష్ట్రం లో టేలీ మానస్ హెల్ప్ లైన్ ప్రారంభించబడినప్పటి నుండి 1,38,000 (ఒక లక్షకు పైగా) కాల్స్ అందుకున్నట్లు వార్తల ద్వారా తెలుస్తోంది- తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (TPA) వంటి సంస్థలు విద్యార్థులు, యువతకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. వారు 2017 నుండి నేటి వరకు 2.5 లక్ష మందికి పైగా కళాశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.2020-2021 మధ్య కాలంలో 2500 మంది వ్యక్తులకు ఉచిత ఫోన్ కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా వారి మానసిక పరిస్థితిని మెరుగుపరిచారు.



డా.మోతుకూరి రాంచందర్,
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్,
హైదరాబాద్ - 9533660938

# అకాల భారీ వర్షాలతో రైతాంగం విలవిల

దేశవ్యాప్తంగా వాతావరణ మార్పులు భూగోళానికి సవాలు విసురుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు ఒకవైపు, అకాల వర్షాలు మరొకవైపు - ఈ రెండింటి దెబ్బకు ఋతువులు గతి తప్పుతున్నాయి. ప్రకృతి పగబట్టి అన్నదాతల ఆరుగాలం శ్రమను ముంచేస్తోంది. దీని ప్రభావంతో దేశంలో ఆహార ద్రవ్యోల్బణం పెరిగి, కూరగాయల ధరలు ఎగిసే అవకాశం ఉందని "క్లైమేట్ ట్రెండ్స్" నివేదిక హెచ్చరించింది.

2022-23లో వేడి తీవ్రత సాధారణం కంటే 30 రెట్లు అధికంగా నమోదైంది. గత 40 ఏళ్లలో 30 శాతం జిల్లాల్లో తక్కువ వర్షపాతం, మరోవైపు కొన్ని జిల్లాల్లో అతివృష్టి పెరిగిందని గణాంకాలు తెలుపుతున్నాయి. వర్షాధారంగా సాగుచేస్తున్న 15%-%40 శాతం ప్రాంతాల్లో 2050 నాటికి ప్రస్తుత పద్ధతులు అనుకూలం కాని పరిస్థితి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఈ ఏడాది వానాకాలం ప్రారంభంలో నిరాశపరిచినా, చివర్లో విరుచుకపడి రైతులను ముంచింది. జూన్‌లో వర్షాల మధ్య విరామాలు (Dry Spells) ఉండగా, తర్వాత ఉపరితల ఆవర్తనాలు, అల్పపీడనాలు, ద్రోణాలతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్ర సగటు వర్షపాతం 740.6 మి.మీ. కాగా, 33 శాతం అధికంగా 988.3 మి.మీ. నమోదైంది. నైరుతి రుతుపవనాలు తిరుగు ముఖం పట్టగా, అక్టోబర్ 15లోపు పూర్తిగా నిష్క్రమించనున్నాయి.

నారాయణపేట జిల్లా మరికల్‌లో 64.8 మి.మీ., మహబూబ్‌నగర్ ముసాపేటలో 63.6 మి.మీ., దేవరకద్రలో 63.1 మి.మీ. వర్షపాతం నమోదయింది. రాష్ట్రవ్యాప్తంగా 137 మండలాల్లో అత్యధిక వర్షాలు (60% పైగా), 294 మండలాల్లో అధిక వర్షాలు (20-59%), 187 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

ఇలా ప్రకృతి పగతో రైతులు విలవిలలాడుతున్నారు. ముందస్తు వర్షాలకూ, అధిక వర్షాలకూ ఇద్దీ పరిస్థితుల్లోనూ రైతన్నకు నష్టమే. మొదట్లో పత్తి సాగు ఉత్సాహంగా సాగినప్పటికీ, రెండు నెలల వర్షాభావం పంటల ఎదుగుదల దెబ్బతీసింది. ఇప్పుడు తిరిగి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు పంటలను పూర్తిగా నాశనం చేస్తున్నాయి. పత్తి చేలల్లో మొలకలు వస్తున్నాయి, మొక్కజొన్న కుళ్లిపోతోంది, మిర్చి మొక్కలు కాయలతోనే కూలిపోతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 45.47 లక్షల ఎకరాల్లో పత్తి, 6.44 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.2 లక్షల ఎకరాల్లో మిరప సాగు జరిగింది. పంటలపై క్రమపద్ధతిలో వర్షాభావం-అతివృష్టి దెబ్బ తగిలి రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. నీటితో నిండిన పొలాల్లో వేర్లు ఊపిరాడక పంటలు ఎండిపోతున్నాయి. పత్తిలో రసం పీల్చే పురుగులు, మొక్కజొన్నలో కాండం కుళ్లు వ్యాపించాయి. ఇది కేవలం వ్యవసాయ సమస్య మాత్రమే కాదు, వాతావరణ సంక్షోభానికి సంకేతం కూడా. అకాల వర్షాలు, భూకంపాలు, ఆమ్ల వర్షాలు ఇవన్నీ మానవజాతి మనుగడకే ముప్పు తెస్తున్నాయి. ఈ పరిణామాలపై ప్రపంచ స్థాయిలో చర్చించి నివారణ చర్యలు చేపట్టడం అత్యవసరం.

ప్రభుత్వాలు శీఘ్రప్రగతి పేరుతో సహజ వనరుల నాశనానికి దారితీసే పారిశ్రామికీకరణను నియంత్రించాలి. భూతాప ఉద్గారాలను తగ్గించే విధానాలు రూపకల్పన చేయాలి. వాతావరణ మార్పులను తట్టుకునే రకాల విత్తనాలను ప్రోత్సహించి, గ్రీన్‌హౌస్ సాగు, రక్షిత వ్యవసాయ పద్ధతులు విస్తరించాలి. రైతులకు కోల్డ్‌స్టోరేజీలు, శీతల రవాణా వసతులు, మెరుగైన సరఫరా గొలుసు వ్యవస్థలు అందుబాటులో ఉండాలి. మానవ మనుగడను కాపాడే మార్గం ప్రకృతిని గౌరవించడం ద్వారానే సాధ్యం. ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు, అందరూ తమవంతు బాధ్యత నిబద్ధతతో నిర్వర్తించినప్పుడే ఈ భూమిపై జీవకోటి నిలబడగలదు.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు,
వరంగల్ జిల్లా,
9573666650

# నాలుగు దశాబ్దాల సాహిత్య ప్రయాణీకుడు

మానవత్వం పరిమళిస్తేనే కదా మనిషి 'అన్న కవితా వాక్యం కవి ఎన్వీ రఘువీర్ ప్రతాప్ సాహిత్యంలోని ఉత్కృష్ట లక్ష్యాన్ని సుస్పష్టం చేసింది. నాలుగు దశాబ్దాలుగా తెలుగు సాహిత్య రంగంలో సాహితీవేత్తగా, రచయితగా, ముఖ్యంగా గజల్, రూబాయిల కవిగా, వక్తగా, విశ్లేషకునిగా పేరొందిన ఆయన అంతర్లీనమంతా స్నేహమయమైన ఆత్మీయాను బంధపు మానవతా కవితా ప్రపంచమే. కలంతో పాటు తన గళాన్ని కూడా యుగళంగా పరిమళింపజేసి తన ప్రత్యేక ముద్రను రచనా లోకంలో పదిలపరచుకున్నారు. చిత్రలేఖనం, రంగస్థల నటనలో కూడా ప్రాచుర్యం పొందిన ఆయన అటవీశాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులను నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు. సృజనాత్మక ప్రవృత్తితో ఎన్నో రచనలు చేసిన ఆయన దాదాపు 16 కు పైగా గ్రంథాలను ప్రచురించారు. పాఠకుల ఆదరణ పొందిన రెక్కలు, నానీలు, మణిపూసలు వంటి మినీ కవితా ప్రక్రియ లలో కూడా ఆయన విరివిగా రచనలు చేశారు. పలు భాషలలోకి ఆయన రచనలు అనువాదమయ్యాయి. ఎన్నో సాహిత్య సదస్సులలో పత్ర సమర్పణ ప్రసంగాలు చేశారు. విశ్వవిద్యాలయ స్థాయిలో ఆయన భిన్న ప్రక్రియలలో రచించిన రచనలపై పరిశోధన కూడా జరుగుతున్నది. షష్టిపూర్తి జరుపుకున్న ఆయన నిరంతర సాహిత్య కృషిని విశ్లేషిస్తూ 60 మంది ప్రసిద్ధ సాహితీవేత్తలు రాసిన విశ్లేషణా త్మక వ్యాసాలతో 'మరువంపు పూల మట్టితీగ ' అన్న సంకలనం వెలువడింది. ఎన్నో విశిష్ట సాహిత్య పురస్కారాలు, గౌరవ సత్కారాలను అనేక వేదికలపై అందుకున్నారు.



తాత్వికత, సామాజికత, మానవీయతతో కూడిన వైవిధ్యమైన రచనలు పాఠక లోకానికి అందించిన రఘువీర్ ప్రతాప్ రచనా భాష సరళంగా, శైలి నిరాడంబరంగా ఉంటుంది. నిండైన భావుకతతో రచనను విశిష్టంగా నిర్మించ డంలో ఆయన నిపుణతను సాధించారు. జీవన వాస్తవాలను అర్థం చేసుకొని సమకాలీన జీవన సమాజాన్ని ఎక్సరే కళ్ళతో కవి వీక్షించారనడానికి ' దరిద్రానికి ఆకలి ఎక్కువే అన్నట్లు/ గతి లేని పథకాలెన్నుంటె ఏం లాభం?' పేదరికం రూపుమాపుతారట/ పేదల నడదొక్కారు చక్కగా' అన్న వాక్యాలు నిదర్శనంగా కనిపిస్తాయి. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, దోపిడీలు లేని ఆరోగ్య కరమైన సమాజాన్ని కవిగా ఆయన ప్రగాఢంగా ఆకాంక్షించారు. పర్యా వరణ ప్రాధాన్యతను గురించి చెబుతూ ' సుఖ జీవనము కోరు కుంటే/ ఇంటింటా ఉండాలి తరువు' అన్నారు. అస్పష్టతకు ఎలాంటి తావు లేకుండా, సరళ వ్యక్తికరణతో అలవోకగా తనలోని భావాల్ని కవిత్వమయం చేయగలిగిన నిగూఢ శక్తి ఈ కవిలో కనిపిస్తుంది.

వచన కవితలను భావచిత్రాలుగా భాసింపజేసి దృశ్య రమణీయంగా మల చడంలో రఘువీర్ ప్రతాప్ కు పక్కా ప్రణాళిక ఉందని ఆయన రచనలో పాటించిన ఆర్ధ్రత, సాంద్రత,నవ్యత అన్న మూడు సూత్రాలను బట్టి తెలుస్తున్నది. పర్యావరణ దృక్పథం,రైతు జనపక్షపాతం, సామాజిక ప్రక్షాళన అన్న ఆకాంక్షలను కలిగిన కవిగా ఆయన నాలుగు దశాబ్దాల పాటు దూసుకుపోయే కవితా ప్రయాణమే చేశారు. సహనశీలత,స్నేహ స్వభావం, కలిగిన కవిగా సాహిత్య సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందిన ఆయన పాలమూరు బిడ్డ. ఉద్యోగరీత్యా పలు ప్రాంతాల్లో పనిచేస్తూనే నిరంతర సాహిత్య రచన వ్యాసంగాన్ని విడవకుండా దీక్షతో కొనసాగించారు. ఉద్యోగ విరమణ దశలో కూడా నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా అటవీ శాఖలో ఉద్యోగం చేస్తూనే ఎంతో ద్విగుణీకృతమైన ఉత్సాహంతో లెక్కకు మించిన పరిశోధనాత్మక, ప్రమాణాత్మక రచనలు చేశారు. 'మట్టిని ముద్దాడాలని ఉంది/ఊపిరి పోసిన ఈ భూమికి/ హృదయం అద్దాలని ఉంది/నడతను నేర్పిన ఈ నేలకు నమస్కరించాలని ఉంది' అన్న ఈ కవితా వాక్యాలు కవిలోని అనుభూతి మయమైన సమర్థతను, కృతజ్ఞతా భావాన్ని వెల్లడించాయి. 'రెక్కలు' ప్రక్రియలో ' ఒంటిపై/ వయసుందని /ఎగిరెగిరి పడకు/ పొద్దయినా సద్దుమణిగేదే' అన్న వాక్యాలు జీవన వాస్తవికతను ప్రతి ఒక్కరికి తెలిసేలా తేటతెల్లం చేసిన తీరు కనిపిస్తుంది. 'నానీల' కవిగా కూడా ఆయన ఎంతో పేరు పొందారు . ' మా వంటింటి/ పోపు డబ్బాల్లోనే ఉన్నాయి/ సజీవ ఆత్మీయ/ పరిమళాలు '... 'పాలమూరు/ ప్రజల కష్టాలెన్ని ?/ పిల్లలమర్రికున్న / ఊడలన్ని' వంటి నానీలు పాఠకులను నిశితంగా ఆలోచింపజేశాయి .



ఏ రచనకా రచనను ఒక ప్రత్యేకతగా తీర్చిదిద్దేందుకు శ్రమపడడాన్ని నైజంగా మార్చుకోవడం వల్ల చిరకాలం గుర్తుండి నిలిచిపోయే సాహిత్యాన్ని నాలుగు దశాబ్దాలుగా ఒక ప్రవాహంగా రఘువీర్ ప్రతాప్ అందిస్తున్నారు. తమ స్వగ్రామమైన కల్వకోలులో ఉన్న 'సత్య పీఠం' స్ఫూర్తితో 'ధర్మ నికేతనం సాహిత్య కళాపీఠం' అన్న సంస్థను స్థాపించి సాహిత్యకారులకు ప్రోత్సాహక పురస్కారాలు అందిస్తూ, సభలను నిర్వహిస్తూ, ఆధ్యాత్మిక, ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమాలను కూడా విస్తృతంగా చేపట్టారు. 'కనీస మానవీయ స్పందనే' అంతటా ఆయనకు కార్యసూత్రంగా మారి సృజనకార్య క్షేత్రానికి నడిపించడం గమనార్హం. కవితా ంజలి, అమ్మంటే, అంతర్వాహిని, చిగురాశల ఊహలలో, నానీ ముత్యాలు, అపురూపం, అవ్యక్త, నిశ్శబ్ద లయ, అమృతధార, మహోన్నత వృక్షాలు, విశ్వ రహస్య విశేషము, గజల్ జ్యోత్స్న, కావ్య మధూలిక వంటి గ్రంథాలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. 'మదర్' అన్న ఆంగ్ల కవితా సంపుటిని కూడా వెలువరించారు.

'పంకజం పంకిలం అంటకనే ఎదుగుతుంది / నిస్వార్థం మనసుని ముట్టుకునే ఒదుగుతుంది/పేదవాని గుడిసైనా ఆకలే నెమరేస్తుంది/స్వధర్మం మానవతను హత్తుకునే పెరుగుతుంది 'అన్న ఉదాత్తమైన వాక్యాలు కవిగా ఆయనలోని ప్రజ్వలిత ప్రతిభను ప్రతిబింబించాయి. 'నడవలేని ఎద్దులెన్నుంటే ఏం లాభం / కురియలేని మబ్బులు లెన్నుంటే ఏం లాభం' అని నిలేస్తారు. 'గుడిసెలకైనా అదే గాలి / మేడలకైనా అదే గాలి ' అని ప్రకృతి పాటించే సమ మానవధర్మాన్ని ఎంతో స్పష్టంగా తెలిపారు.' 'ఊపిరయ్యే దేవతేగా చెట్టు అంటే/ఉనికిని నిలిపే శ్వాసేగా చెట్టంటే' అని మనిషి మనుగడకు మూలాధారమైన చెట్టును అభివర్ణిం చారు. ప్రతి పదాన్ని సున్నితంగా, సునిశితంగా పరిశీలించి మార్ధవంగా, మధుర కోమలంగా, ఆలోచనాశీలంగా, మానవ జీవన తాత్విక కోణంగా మలచి అంతర్లీన భావాన్ని జతచేసి నిత్యనూతనంగా వ్యక్తీకరించే లక్షణమున్న రఘువీర్ ప్రతాప్ కవిత్వం పై అచంచల విశ్వాసం కలిగిన అరుదైన ఈతరం సాహిత్యకారుడు.

**(ఎన్వీ రఘువీర్ ప్రసాద్ సాహిత్యాభినందన సంచిక 'యశోభూషణం 'ఆవిష్కరణ జరిగిన సందర్భంగా ఈ వ్యాసం..)**

డా.తిరునగరి శ్రీనివాస్
9441464764

# నామినేషన్ ప్రక్రియ సజావుగా జరగాలి

• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలకు నేటినుండి జిల్లా వ్యాప్తంగా నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిరాహుల్ రాజ్ హవేలీ ఘనపూర్ మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్ ప్రక్రియలో భాగంగా నోటీస్ ప్రదర్శించిన విధానాన్ని అలాగే హెల్ప్ డెస్క్ లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు వారి విధుల పట్ల ఉన్న అవగాహన ను కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ సమయం లో ఆర్వో, ఏ ఆర్వో ఏమేమి చెక్ చేయాలో క్షుణ్ణంగా కలెక్టర్ వివరించారు .మూడు రోజులపాటు



నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అభ్యర్థులకు ఏమైనా సలహాలు, సందేహాలు ఉంటే అక్కడ సంప్రదించాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియ జరిగే ఈ మూడు రోజులు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా మెదక్ జిల్లాలో మొదటి దశలో మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 10 మండలాల్లో ఎంపిటిసి , జడ్పీటీసీ లకు నామినేషన్ ల ప్రక్రియ ప్రారంభం అయ్యిందన్నారు. మెదక్ జిల్లాలో 523,327 మంది ఓటర్లు ఉండగా అందులో 251,532 పురుషులు,271,787 మహిళ ఓటర్లు ఉన్నారు. జిల్లాలోమొత్తం 21 జడ్పీటీసీ, 190 ఎంపీటీసీ స్థానాలు ఉండగా... మొదటి దశలో మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలలో మెదక్, హవేలీ ఘనపూర్ ,రామాయంపేట, నిజాంపేట్, పాపన్నపేట, రేగోడు టేక్మల్ ,అల్లదుర్గం, పెద్ద శంకరం పేట,చిన్న శంకరం పేట 10 జెడ్పీటీసీ స్థానాలు, 99 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ ల ప్రక్రియ మొదలు అయ్యిందనీ తెలిపారు.ప్రతి ఒక్కరూ స్థానిక సంస్థల ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకొని రాష్ట్రంలో మెదక్ జిల్లాలో ఉన్నత స్థానంలో ఉంచాలని ఎలాంటి ప్రలోభాలకు లొగ్గకుండా ఉండాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

## బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్



**కేశంపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చలో బస్ భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సీఐ నరహరి ఆదేశాల మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి , మాజీ సర్పంచులు తలసాని వెంకట్ రెడ్డి , నవీన్ కుమార్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు జమాల్ ఖాన్ తదితరులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచడంతో సామాన్య ప్రజలపై భారం పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

## అక్రమ అరెస్టులు చేయడం సరికాదు



**రాజేంద్రనగర్, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** ఆర్టీసి చార్జీల పెంపుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ చలో బస్ భవన్ ముట్టడి పిలుపు నేపథ్యంలో ముందస్తుగా అక్రమంగా హౌస్ అరెస్టులు పోలీస్ స్టేషన్లో నిర్బంధం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బీఆర్ఎస్ పార్టీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజ్ అన్నారు. ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచడాని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఉద్రిక్తల మధ్య బస్ భవన్ ముట్టడి విజయవంతమైందని నాగరాజు అన్నారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంగాని రవికుమార్, శాంతి నాయక్, చంద్రశేఖర్, సుగుణ స్వర్ణ, దేవి, శ్యాముల్ లతో కలిసి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాముడు యాదవ్ మాట్లాడుతూ ఆర్టీసీ పెంచిన చార్జీలు తగ్గించాలని మహిళలకు ఫ్రీ బస్సు పేరుతో పురుషులకు రెట్టింపు ధర టికెట్ ను పెంచడం ఏమిటని రాముడు యాదవ్ ప్రశ్నించారు? పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించే వరకు పోరాటం ఆగదని మధ్యతరగతి ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. అనంతరం నార్సింగ్ పోలీస్ స్టేషన్ కు తరలించి పూచి కత్తుపై విడుదల చేశారు.

# మహబూబ్‌నగర్ మెడికల్ హబ్‌గా అభివృద్ధి

• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ నగరంలోని రాజేంద్రనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సాయికిరణ్ ఎండోక్రైయిన్, గ్యాస్ట్రో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ మెడికల్ హబ్‌గా అభివృద్ధి కావడం సంతోషంగా ఉందన్నారు. మహబూబ్ నగర్ లో అన్ని రకాల అధునాతన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇప్పుడు మహబూబ్ నగర్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. వైద్యుడు అంటే దేవుడితో సమానమని, ఎలాంటి పరిస్థితుల్లో రోగి ఆసుపత్రికి వచ్చినా నాణ్యమైన వైద్యం అందించి బ్రతికించే ప్రయత్నమే చేస్తారని అన్నారు. డాక్టర్ అంటే ప్రాణాలు నిలబెట్టే వారిగా చూడాలి తప్ప శత్రువుగా చూడరాదని, ఎవరైనా డాక్టర్ల పైన దాడి చేసి వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని, అట్టి వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహబూబ్‌నగర్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేసుకున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి మహబూబ్ నగర్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మహబూబ్ నగర్ లో అటు జడ్చర్లలో మరో బైపాస్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్



పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ జె, రాంమోహన్, డాక్టర్ సామ్యేల్ , డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ చైతన్య రెడ్డి, డాక్టర్ బి.సాయికిరణ్ , డా.జె.తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లైవ్ కిచెన్స్ థియేటర్ ప్రారంభం

• నాలుగు ప్రత్యేక వంటశైలులల రుచుల అనుభవం

**ఖైరతాబాద్, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** హయత్ హైదరాబాదు గచ్చిబౌలిలో 4-నోట్ ను ఘనంగా ప్రారంభించినట్లు హయత్ హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ ఫుడ్ బివరేజ్ పియుష్ శర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడు తూ ఇది లైవ్ కిచెన్స్ థియేటర్‌గా రూపొందించిన ప్రత్యేక రెస్టారెంట్ అన్నారు. ఇక్కడ వంటగదులు ఒక థియేటర్‌లా ప్రదర్శించ బడతాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధ వంటకాల సంప్రదాయా లను అతిథులు ప్రత్యక్షంగా అనుభవించవచ్చని అన్నారు. అతిథులు రెస్టారెంట్ లోపల లేదా బయట కూర్చుని, ప్రతి షో కిచెన్ నుండి వంటకా లను ఆర్డర్ చేసుకుని, వైవిధ్యభరిత రుచుల అను భవాన్ని పొందవచ్చన్నారు. ఇది వైవిధ్యభరితమైన, నూతనతతో కూడిన, ప్రపంచ రుచుల సంగ మాన్ని అనుభవించే ప్రత్యేక అవకాశం ఇస్తుందన్నా రు. నార్త్ ఇండియన్, ఓరియెంటల్, తెలుగు రుచు లు, యూరోపియన్, అతిథులు లైవ్ కిచెన్ ప్రదర్శన




రూపొందించిన 4-నోట్ కేవలం రెస్టారెంట్ కాదని, ఇది లైవ్ కిచెన్స్, క్యూరేటెడ్ , ఆత్మీయ అను భూతి కలిగించే స్థలాలు, ఆకర్షణీయమైన వాతా వరణం మరచిపోలేని రుచుల అనుభవాన్ని సృష్టిం చే ప్రత్యేక రెస్టారెంట్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా, హైదరాబాదీ అతిథులను వైవిధ్యమైన రుచులను ఆస్వాదించడానికి, లైవ్ కిచెన్ థియేటర్‌ను అను భవించడానికి, స్మరణీయ క్షణాలను పంచుకోవడానికి ఆహ్వానిస్తున్నాం అన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వనికి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు

**ఉర్కొండ, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని బీసీలను రాజకీయం లబ్ధి కొరకు వాడుకుంటున్నారని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో తెలియజేశారు. ప్లాన్ 'బీ'ని సిద్ధం చేసుకుని ఇవాళ హైకోర్టులో తూతూమంత్రంగా వాదనలు వినిపించిందని జనార్దన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను రాజకీయంగా వాడుకుంటోందని,బీసీ రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే విధించడంపై స్పందించారు. రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం దురదృష్టకరమని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ చేతకాని తనం కారణంగానే ఈ తీర్పు వెలువడిందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. బీసీలకు న్యాయం చేయాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ లేదని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే.. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50% క్యాప్‌ను నిర్దేశించిందని గుర్తు చేశారు. ఈ విషయం తెలిసినా.. రాజ్యాంగపరమైన నిబంధనలపై కనీస



అవగాహన లేకుండా రేవంత్ సర్కారు వ్యవహరించిందని పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజేందర్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ముచ్చర్ల లక్ష్మారెడ్డి, మండల నాయకులు ఆంజనేయులు,పరశురాం, రాములు,సందీప్ కుమార్, గోపి, కొమ్ము శీను, రేపాని శ్రీను,మల్లేష్, పూర్ణదీప్ రెడ్డి, రామాంజనేయులు ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఆర్టీసీ చార్జీలను వెంటనే తగ్గించాలి

• ఛలో బస్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

**ఉప్పల్, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** కాంగ్రెస్ సర్కార్ అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను నిరసిస్తూ ఆర్టీసీ బస్సులో బస్ భవన్ కు బయల్దేరిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్ అని పురుషులకు టికెట్ల రేట్లు డబుల్ చేసి, బస్ పాస్ ధరలు పెంచితే కుటుంబం మీద భారం పడదా? పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేసారు. వారు బస్సు టికెట్ రేట్ల పెంపుపై ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ అధినేత తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీని లాభాల బాట పట్టించాలని ఆర్టీసీలో కార్గోను నూతనంగా ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిలుకనగర్ కార్పొరేటర్ బన్నల గీత ప్రవీణ్ ముదిరాజ్, మల్లాపూర్



కార్పొరేటర్ పాన్నాల దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జేన్ శేఖర్, బన్నల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగిలించిన కంప్యూటర్లు స్కూల్ గేటు ముందు ప్రత్యక్షం

**చేర్యాల/మద్దూరు, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** దసరా సెలవుల్లో గుర్తు తెలియని వ్యక్తులు మద్దూరు మోడల్ స్కూల్ కంప్యూటర్ ల్యాబ్ లోని 9 ల్యాప్ టాప్ లు, 3 కంప్యూటర్ లను దొంగిలించిన విషయం సెలవులు ముగిసిన తర్వాత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిశీలించి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం స్థానిక మోడల్ స్కూల్ మెయిన్ గేట్ పక్కన దొంగిలించిన ల్యాప్ టాప్ లు, కంప్యూటర్ లు ప్రత్యక్షమయ్యాయి. ఈ విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేర్యాల సీఐ ఎల్ శ్రీను, ఎస్ఐ షేక్ మహబూబ్ చేరుకొని డాగ్స్ స్క్వాడ్ తో తనిఖీలు చేపట్టారు. పంచనామా నిర్వహించి లాప్ టాప్ లు, కంప్యూటర్ లను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ చేస్తున్నారు.



# సొంత గ్రామాభివృద్ధిని అడ్డుకున్న మాజీ చైర్మన్ భర్త

• అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు
• జోగిపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు

**జోగిపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** గత ప్రభుత్వంలో జిల్లా జడ్పీ చైర్మన్ గా ఉన్న మాజీ చైర్మన్ భర్త పి. జైపాల్ రెడ్డి సొంత గ్రామ అభివృద్ధిని అడ్డుకున్నారని, నేషనల్ హైవే రోడ్డు నుంచి సర్వీస్ రోడ్డు తీసుకొని గ్రామానికి అన్యాయం చేశారని అందోల్ జోగిపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు చూసి చైర్మన్ భర్త విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలోనే సుమారుగా రూ. వెయ్యి కోట్లను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ మంజూరు చేసిన నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ హాయంలో ఏర్పాటు చేసిన నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంతో జోగిపేటకు వ్యాపార పరంగా తీవ్ర నష్టం చేసిన ఘనత మీకే దక్కుతుందన్నారు. జోగిపేటను వ్యాపారపరంగా అభివృద్ధి పరిచేందుకు సుమారుగా 30 నుంచి 40 గ్రామాలను అనుసంధానం చేసేందుకు అజ్జమర్రి నుంచి రూ.80 కోట్లతో జోగిపేట వరకు రోడ్డును వేయిస్తున్నారని, మీ కళ్లకు కనిపించడం లేదన్నారు. దీంతో అటువైపు భూములు రెట్లు కూడా పెరిగాయన్నారు. అందోలు వద్ద రూ.43 కోట్లతో నర్సింగ్



కళాశాల, రూ.60 కోట్లతో 150 పడకల ప్రభుత్వాసుపత్రిని మంజూరు చేసి, 60 శాతం పనులు కూడా పూర్తయ్యాయన్నారు. పదేళ్లుగా మున్సిపాలిటీ భవనాన్ని నిర్మించలేని దద్దమ్మలు మీరేనని, పుట్టింగ్ స్థాయిలోనే నిర్మాణం చేపట్టి బిల్లులు స్వాహా చేసిన చరిత్ర మాజీ ఎమ్మెల్యే సోదరులకే దక్కుతుందన్నారు. మంత్రి దామోదర్ మున్సిపాలిటీ భవనానికి రూ. 6 కోట్లను మంజూరు చేసిన పనులు కొనసాగుతున్నాయన్నారు. సంగుపేట నుంచి అన్నాసాగర్ వరకు రోడ్డు వెడల్పు, డివైడర్ పనులకు మాజీ మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేసారే తప్ప పనులు చేపట్టకపోవడంతో నిధులు రద్దు అయ్యాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి దామోదర్ ప్రత్యేక చొరవతో రూ.20 కోట్లను మంజూరు చేసి, రోడ్డు పనులు జరుగుతున్నాయని ఒక్కసారి వచ్చి చూస్తే తెలుస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ నాయకులను అనేక ఇబ్బందులకు గురిచేశారని, అక్రమంగా కేసులు బనాయించారని, కానీ మా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ నాయకులపై ఏలాంటి కక్ష్యసాధింపులకు పాల్పడలేదన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు పింక్‌బుక్‌లో రాస్తున్నామని చెప్పడం, నాలుకలు కోస్తామని బీఆర్ఎస్ నాయకులు బెదిరించడమేనని, మీ బెదిరింపులకు భయపడేది లేదని, పింక్ కాదని...ప్రస్తుతం ఖాకీ బుక్ నడుస్తుందని, చట్టం తనపని తాను చేసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా మాజీ జడ్పీ చైర్ పర్సన్ భర్త జైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పి.నారాయణలు వారి స్వగ్రామాలకు కనీసం రోడ్లు కూడా వేసుకోలేదని ఆయన ఆరోపించారు. నామినేటేడ్ పదవులను అమ్ముకున్న చరిత్ర మీదని, కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపునిచ్చే నాయకుడు మంత్రి దామోదర్ ఒక్కరేనన్నారు. మీకు అభివృద్ధి చేయడం చేతగాక కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. ఈ సమావేశంలో ఆత్మ కమిటీ డైరెక్టర్‌లు చిట్యాల మధు, తుడుం యాదయ్య, ఖాలీద్, నాయకులు చోటుఖాన్, రాజు, హాజీ, అడ్డు, నజీర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మున్సిపల్ మహాసభను విజయవంతం చేయాలి

• సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అల్లీ దేవేందర్




**మొయినాబాద్, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** మున్సిపల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ పేర్కొన్నారు. గురువారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మొయినాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ ఈనెల 14,15 తేదీలలో రంగారెడ్డి జిల్లాలోని తుర్కయంజాల్ లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఐదవ రాష్ట్ర మహాసభ జరుగుతుందని ఈ మహాసభలను కార్మికులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర మహాసభలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రెండు రోజులు చర్చించి కార్మికుల సమస్యలపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు రత్నం, అధ్యక్షులు సుధాకర్ ప్రధాన కార్యదర్శి సురేష్ ఉపాధ్యక్షులు ప్రవీణ్, నరసింహ, అంజయ్య రామచందర్ శివ లక్ష్మమ్మ సాలమ్మ లతా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తాం

- జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, జిల్లాలో ఈ రోజు నుండి నుండి జిల్లాలోని 16 మండలాల్లో ఎంపిటిసి, జడ్పీటిసి స్థానాలకు జరగనున్న నామినేషన్ ప్రక్రియ సందర్భంగా పటిష్ట నిఘా ఉంచాం అని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుంది స్థానిక ఎస్ఐలతో పాటు డిఎస్పిలు, సిఐలు పర్యవేక్షణ చేస్తున్నారు. 100 మీటర్ల పరిధి నిభందనలు ఉంటాయి, బారికేడ్స్ ఏర్పాటు చేశాము, ఎన్నికల నిభందనలు, అధికారుల సూచనలు పాటించాలి. నామినేషన్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు, నియమనిబంధనల మేరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని (ఎన్నికల కోడ్) పటిష్టంగా అమలు చేస్తాము. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జిల్లా ప్రజలు, పౌరులు రాజకీయ పార్టీలు అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పి అన్నారు శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలిగించవద్దని కోరారు, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసు నిఘా ఉంటుంది అని తెలిపారు. మద్యం అమ్మకాలపై నిఘా ఉంచాము రహదారుల వెంట హెూటల్స్ డాబాల్లో మద్యం అమ్మవద్దు అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక పండుగలాగా జరగాలని అందరూ చట్టాన్ని గౌరవిస్తూ శాంతియుత గా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని అన్నారు. జిల్లాలోకి అక్రమ రవాణా జరగకుండా అక్రమ మద్యం ఇతర వస్తువులు రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. నియమావళి నిభందనలు ప్రకారం ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి నిఘా పెడుతున్నాం, రౌండ్ ది క్లాక్ పెట్రోలింగ్ కొనసాగుతుంది, ప్రజలు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి డయల్ 100 కు, పోలీస్ కంట్రోల్ రూం 8712659360 కి సమాచారం ఇవ్వాలి. గత ఎన్నికలలో కేసుల్లో ఉన్న నెరస్థులను ముందస్తుగా బైండోవర్ చేయడం, సమస్యలు సృష్ఠించే ట్రబుల్ మాంగర్స్ ను, రౌడీలను, కేడిలను, సస్పెక్ట్ లను ముందస్తు బైండోవర్ చేస్తాం. జిల్లాలో ఉన్న ఆయుధాలను ముందస్తుగా స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది. సోషల్ మీడియా పై ప్రత్యేక నిఘా ఉంచాం, తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే విధంగా, అవమానపరిచే విధంగా రూమర్స్ సృష్టించడం లాంటివి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే సంభందిత వ్యక్తులు, వాట్సప్ అడ్మిన్ లపై చట్టపరమైన చర్యలు తప్పవు అని ఎస్పీ హెచ్చరించారు.

## నిబంధనల మేరకు నామినేషన్ల ప్రక్రియ జరగాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**జడ్చర్ల, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా నిబంధనల మేరకు నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల మొదటిదశ ఎన్నికలలో భాగంగా ప్రారంభమైన జడ్పిటిసి, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియను గురువారం కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్చర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జడ్పిటిసి, మండల పరిధిలోని కోడుగల్ గ్రామ పంచాయతీ క్లస్టర్ లో ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెక్స్, నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించి రిటర్నింగ్ అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదటి విడతలో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు ఈనెల 9 నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 12న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ ఉంటుందని, మొదటి విడత ఎన్నికలకు ఈనెల 23న పోలింగ్, నవంబర్ 11న కౌంటింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దళారుల చేతిలో మోసపోకూడదు



**చిలప్‌చేడ్, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** రైతులు దళారులను నమ్మి మోసపోకూడదని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించాలని తాసిల్దార్ సహదేవ్ అన్నారు.చిలప్ చేడ్ మండలంలోని సోమక్కపేట సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం సీఈఓ పోచయ్యతో కలిసి తహసీల్దార్ సహదేవ్ గురువారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారుల చేతిలోపెట్టి మోసపోకుండా ధాన్యన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని అన్నారు. ధాన్యాన్ని ఐకేపీ, సొసైటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే అమ్ముకోవాలన్నారు. అలాగే రైతులు తమ ధాన్యంలో తేమశాతం 17కి మించకుండా ఉండాలని, బాగా ఎండబెట్టి తాలు మట్టి లేకుండా ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు.తూకం వేసిన వెంటనే రైతులకు తమ బ్యాంక్ అకౌంట్, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ సెంటర్ ఇన్‌చార్జ్‌కు అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాగానే 24 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమచేస్తారని తెలిపారు. ఎ గ్రేడ్ మద్దతు ధర 2389 రూపాయలు, సాధారణ రకం 2369 రూపాయలు, సన్నరకం వరి ధాన్యంకు అదనంగా బోనస్ 500 రూపాయలు ఇస్తారని తహసీల్దార్ సహదేవ్ సీఈవో పోచయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు జిల్లా యంత్రాగం సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్
- నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరి స్తూ నారాయణ పేట జిల్లాలో తొలి విడత ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్ లు జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నారాయణపేట జిల్లా పరిధిలోని 8 మండలాలు దామరగిద్ద, నారాయణ పేట, ధన్వాడ, మరికల్, కోస్గి, కొత్తపల్లి, గుండుమల్, మద్దూరు జెడ్పీటీసీ స్థానాలతో పాటు, పై మండలాల పరిధిలోని 82 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ, నారాయణపేట క్లస్టర్ పరిధిలోని పేరపళ్ళ, సింగారం, బైరంకొండ ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను, అలాగే నారాయణ పేట మండలం జాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాజాపూర్-1, జాజాపూర్-2, శేర్నపల్లి ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాలు, అలాగే దామరగిద్ద మండల కేంద్రంలోని జెడ్పీటీసీ, క్లస్టర్ పరిధిలోని ఎంపీటీసీ స్థానాల నామినేషన్ కేంద్రాలను ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారా అని పరిశీలించారు. హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా..? లేదా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని ఆర్.ఓలను ఆదేశించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామినేషన్ పత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

- ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించాలి
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య అన్నారు. గురువారం హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులను, మెడికల్ స్టోర్ రూమ్ లో మందుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అనేక రకాల సౌకర్యాలను కల్పించిందని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడానికి క్షేత్రస్థాయి సిబ్బంది అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ ఫర్హాన్ షేక్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గట్టి పోటీ ఇస్తాం

- టిఆర్పి గజ్వేల్ ఇంచార్జి యాదగిరి గౌడ్



**తూప్రాన్, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** గజ్వేల్ నియోజకవర్గంలో బి ఆర్ఎస్ ,కాంగ్రెస్ పార్టీలకు తెలంగాణ రాజ్యాధికారి పార్టీ గట్టి పోటీ ఇస్తుందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ గజ్వేల్ ఇంచార్జి ఈ మాపురం యాదగిరి గౌడ్ తెలిపారు. ప్రజా సమస్యలకు అండగా నిలుస్తున్న తెలంగాణ రాజాజీ పార్టీకి విషెస్ ఆదరణ లభిస్తుందని గజ్వేల్ టిఆర్పి నియోజకవర్గ ఇన్చార్జి ఇమాంపూర్ యాదగిరి గౌడ్ తెలిపారు. మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి దొడ్ల నారాయణరెడ్డి ఈరోజు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దొడ్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ, “బీజేపీ పార్టీలో నేను కష్టపడి పనిచేసినా, నాకు తగిన గౌరవం రాలేదు. నేను చేసిన కృషికి గుర్తింపు దక్కలేదు. అందుకే ప్రజా సమస్యలకు అండగా నిలుస్తున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీని ఆశ్రయించాను” అని అన్నారు. చేరికల సందర్భంగా తీన్మార్ మల్లన్న దొడ్ల నారాయణరెడ్డిని ఆహ్వానిస్తూ, పార్టీ బలోపేతం కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్య దర్శి నగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ రానున్న కాలంలో పార్టీని బలోపేతం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే పార్టీ విస్తృతంగా బలోపేతం అవుతుంది 2028 లో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం ప్రతి నియోజకవర్గంపై టిఆర్పి జెండా ఎగరవేస్తాం అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మా బలమెంటో చూపిస్తామని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గం వ్యాప్తంగా అటు బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇస్తున్నాం తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యం ఒకటే బీసీలు రాజ్యాధికారంలోకి రావడం దానికి ఎంత కష్టపడాలో అంత కష్ట పడుతున్నాం అన్నారు. 2028లో అన్ని పార్టీలకు పోటీ ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ మెదక్ నియోజకవర్గం గజ్వేల్ నియోజకవర్గం పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**జడ్చర్ల, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినీలకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని కోడుగల్ గల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలను కలెక్టర్ విజయేంద్ర బోయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నంలో వడ్ల గింజ మెరికలు ఉండడం గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యాన్ని శుభ్రంగా కడిగి వండాలని, నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కళాశాలలో ఫుడ్ కమిటీ, భోజన నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

### భవిత కేంద్రం తనిఖీ

మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో గల భవిత కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందిస్తున్న ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ విధానాన్ని పరిశీలించి, అక్కడే నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించి, అక్కడికి వెళ్లేందుకు భవిత భవనం నుండి దారి ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారిని మంజుల దేవి ఉన్నారు.

## సాంకేతిక శిక్షణతో ఉపాధి అవకాశాలు

- హత్నూర్ ఏటిసి సెంటర్ కలెక్టర్ తనిఖీ



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** సాంకేతిక శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా హత్నూర పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు . ఏటిసి సెంటర్లో ఎంత మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు, శిక్షణా సౌకర్యాలు , సెంటర్‌లో ఉన్న అవసరాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఏ ఏ కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు విద్యార్థులకు అందుతున్న అధునాతన శిక్షణ పై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ లో అందిస్తున్న అధునాతన శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని శిక్షణలో మంచి నైపుణ్యం సాధించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఏటీసీ సెంటర్ లో ఉన్న మౌలిక సదుపాయాలు అవసరాల పై సమగ్రంగా సమీక్షించారు. రానున్న రోజుల్లో అడ్వాన్స్ టెక్నాలజీ రంగంలోనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ,ఏటీసీలో శిక్షణ పొందిన వారికి భవిష్యత్తు లో మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ అన్నారు . ఈ సందర్శనలో హత్నూర తాహాసిల్దార్ ఫర్హాన్ షేక్, ఏటీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హయాంలోనే అభివృద్ధి

- విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకుల వెల్లడి



**సదాశివపేట, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హయంలోనే మెరుగైన అభివృద్ధి జరిగిందని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అపర్ణ శివరాజ్ పార్టీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ లు పేర్కొన్నారు. గురువారం సదాశివపేట పట్టణంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదాశివపేట పట్టణ అభివృద్ధి కోసం టియుఎఫ్ఐడిసి నిధుల ద్వారా రూ. 10 కోట్ల పనులకు ఈ నెల 7వ తేదీన టెండర్ కాల్ పిలవడాని స్వాగతిస్తున్నామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రస్తుత ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ మంత్రి హరీష్ రావు సహాయ సహకారాలతో సదాశివపేట పట్టణ అభివృద్ధికి 25 కోట్లు మంజూరు చేయగా,అందులో 324 పనులకు గాను 208 పనులకు రూ. 13 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబించి పట్టణ అభివృద్ధికి అడ్డుపడిందని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులతోనే ప్రస్తుతం పట్టణంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కావస్తున్న పట్టణాభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. పట్టణ అభివృద్ధి లో భాగంగా ఇండోర్ స్టేడియం, సిమ్మింగ్ పూల్, పాత మున్సిపల్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్, సిద్ధాపూర్ గౌని నుండి ఆత్మకూర్ బేస్ వరకు సిసి రోడ్, పోలీస్ స్టేషన్ ఎదురుగా మున్సిపల్ స్థలంలో కాంప్లెక్స్ నిర్మాణం పనులకు టెండర్స్ లో ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. గత బిఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వ కాలంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహకారంతో పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్,తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్,తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇంద్ర మోహన్ గౌడ్,చౌదరి ప్రకాష్,మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కోదూరు అంజయ్య, నాయకులు ముద్ద నాగనాథ్, అక్బర్ హుస్సేన్,ఖమీల్, నాసిర్,నాగుల విజయ్, దిడిగే నాగేష్, వాదోని చంద్రశేఖర్, జబ్బర్, బరాడి శివ, పని కృష్ణ , ఆయూబ్, నాయకులు పాల్గొన్నారు.

## చేగువేరా స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి



**వనపర్తి టౌన్, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** ప్రపంచ విప్లవ యోధుడు సోషలిస్టు సమాజం కోసం పోరాడి ప్రాణాలర్పించిన చేగువేరా స్ఫూర్తితో సిపిఐ నేతలు కార్యకర్తలు ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు కోరారు. వనపర్తి సిపిఐ ఆఫీస్ లో చేగువేరా 58వ వర్ధంతి సిపిఐ పట్టణ కమిటీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాట్లాడుతూ.. డాక్టర్‌గా మంత్రిగా విప్లవకారుడిగా ఆయన పోరాటం చిరస్మరణీయమన్నారు. ప్రజా పోరాటంలో ఆయన ప్రాణాలు కోల్పోయిన ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానం సాధించారని, ఆయన సోషలిస్టు సమాజ ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు.చేగువేరాకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఇప్పటికీ ఉన్నారంటే ప్రజల కోసం ఆయన సాగించిన పోరాటం చేసిన త్యాగాలే కారణమన్నారు. ఆస్ఫూర్తితో అందరం పని చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ భువన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వినాథం, జిల్లా నేతలు జ్యోతి రూప సుప్రియ సిపిఐ నేతలు అంజి కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా మినరల్ వాటర్ వ్యాపారం

సారంగాపూర్, అక్టోబర్ 9 (జనం సాక్షి) : నిత్యజీవితంలో మినరల్ వాటర్ అలవాటు పడ్డ ప్రజలు. డబ్బులు పెట్టి నీటి ని కొనుక్కోవాల్సిన పరిస్థితి...ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకొని కొందరు నీళ్ల దందాకు శ్రీకారం చుడుతున్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలో పాటు పలు గ్రామాలలో వాటర్ ప్లాంట్ వెలిశాయి. ప్రస్తుత జీవనశైలిలో ప్రజలు దరూ ప్యూరిఫైడ్ వాటర్ తాగడానికి అలవాటుపడ్డారు. ఆరోగ్యం కోసమని తాగుతున్న మినరల్ వాటర్ తర్వాత రోజుల్లో అనారోగ్యాల బారిన పడేలా చేస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో తూతూమంత్రంగా బోరు నీటిలో కొన్ని కెమికల్ కలిపి నీరు సరఫరా చేస్తున్నారు. నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్స్ పై అధికారులు తనిఖీలు నిర్వహించి అన్ని పోషక విలువలతో కూడిన మిశ్రమాలు, లవణాలు కలిగి ఉన్నాయని నిర్ధారించి చెప్పే పరిస్థితుల్లో అధికారులు లేరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోను నిబంధనలు పాటించ కుండా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం మాడుతున్నారు. నిబంధనలు పాటించకుండా ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్స్ పై అధికారుల దృష్టి కరువైంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులను కట్టడి చేయాలని నీటి శుద్ధి ప్రక్రియ చేయకుండా నిర్వహిస్తున్న ప్లాంట్లను తనిఖీ చేసి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నాణ్యత ప్రమాణాలను అతిక్రమించి నిర్వహిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





మినరల్ వాటర్ పేరుతో జరుగుతున్న వి క్రయాల్లో ఫంగస్ చేరి ప్రజలు రోగాల బారిన పడు తున్నారు. పూర్తిగా శుభ్రం చేయని నీటిలో ఈకోలి బ్యాక్టీరియా, కోళీఫార్మా ఎక్కువగా ఉండటం అనారో గ్యానికి కారణం అవుతుంది. వీటివల్ల టైఫాయిడ్, కా మెర్లు, అతిసారం, కడుపుమంట, గొంతు సంబంధి త వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చె బుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి అనుమతులు లేకుండా నడుస్తున్న వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు

# పంట చేలో అక్రమంగా గంజాయి సాగు

- 160 గంజాయి మొక్కలు స్వాధీనం
- బహిరంగ మార్కెట్లో 16 లక్షల విలువ



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లాలో గంజాయిపై ఉక్కు పాదం మోపుతున్నప్పటికీ కొంతమంది అక్రమార్కులు భయపడకుండా యదేచ్ఛగా గంజాయిని సాగు చేస్తున్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసోద గ్రామం లో పంటచేళ్లలో 160 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో డీఎస్పీ జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి పై ఉక్కు పాదం మోపడం జరుగుతుందన్నారు. గంజాయి మహమ్మారిని పూర్తిగా ఉక్కుపాదంతో అణిచివేస్తుందన్నారు. గంజాయి సేవించిన, పండించిన, వ్యాపారం చేసిన కఠిన.చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదిలాబాద్ మండలం లోని అసోద గ్రామంలో భారీ ఎత్తున గంజాయి మొక్కలు పెంచుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ రూరల్ ఎస్ఐ వి విష్ణువర్ధన్ ప్రత్యేక బృందంతో అక్కడికి వెళ్లి పంటచేలలో పత్తి పంట మరియు కంది పంట మధ్యలో గంజాయి మొక్కలను పెంచుతున్నగా వాటిని పట్టుకున్నట్లు తెలిపారు.బుధవారం గ్రామీణ మండలంలోని అశోద గ్రామంలో అంతర పంటగా సాగిస్తున్న 160 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని నిందితున్ని అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పట్టు బడ్డ దాని విలువ బహిరంగ మార్కెట్లో 16 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 329/2025, సెక్షన్ 8(b) r/w 20 (b)(I) of NDPS actతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. గంజాయి పండిస్తున్న వారి పట్ల కేసులు నమోదు చేసి వారికి ప్రభుత్వ పథకాలు వర్తించకుండా జిల్లా కలెక్టర్ గారికి నివేదికలు పంపనున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ఇంత భారీ ఎత్తున గంజాయిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించినటువంటి రూరల్ సీఐ కె ఫణి ధర్, రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్, సిబ్బంది మంగల్ సింగ్, విటల్, సురేష్ లను ప్రత్యేకంగా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ కె ఫనిధర్, ఎస్ఐ విష్ణువర్ధన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అపోహలు వీడి అవయవదానానికి ముందుకు రావాలి

- అవయవ దానంపై జనహిత సేవా సమితి కృషిని అభినందిస్తూ సత్కారం



బెల్లంపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి) : ప్రజలు అపోహలు వీడి అవయవ దానానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖనిలోని సింగరేణి మెడికల్ కళాశాలలో సదాశయ ఫౌండేషన్ 17వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నేత్ర, అవయవ దానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నేత్రదాన కార్యక్రమాలు చేపట్టిన బెల్లంపల్లి జనహిత సేవా సమితి సేవలను అభినందించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు టి శ్రవణ్ కుమార్, జనహిత సేవా సమితి సభ్యులు డోలి సుకుమార్, భీమిని కనకయ్యను, నేత్రదానం చేసిన ఐదుగురు నేత్రదాతల కుటుంబ సభ్యులకు శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ ప్రజలందరు అపోహలు వీడి నేత్ర, అవయవ దానానికి ముందుకు రావాలని, ఈ సత్కారానికి కారణమైన నేత్ర అవయవ దానం కొరకు ముందుకు వస్తున్న దాతలకు, అవగాహన కల్పిస్తున్న జనహిత ఈసందర్భంగా తెలంగాణ నేత్ర అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సదశయా ఫౌండేషన్ సభ్యులకు, నేత్రదాతల కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 9 (జనంసాక్షి) : జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రభావిత గ్రామాలలో అవార్డు ఎంక్వయిరీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో రిహాబిలిటేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసి, రిహాబిలిటేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చింతనెక్కొండలో వీధి కుక్కల హల్‌చల్

పర్వతగిరి, అక్టోబర్ 09 (జనంసాక్షి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన దబ్బెట కొమ్మాలు తండ్రి వీరయ్య ఇంటి నుండి వ్యవసాయ భూమి పొలానికి నీళ్ళు పెట్టేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో వీధి కుక్కలు గుంపుగా చుట్టూ ముట్టి అందులో ఒక కుక్క కాలును బలంగా నాటుతే అందుకొని పీకింది. చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు కరల సాయంతో కుక్కలన్నీటిని చల్లా చదరం చేసి వారిని దూరంగా వెళ్లగొట్టి రక్తస్రావం అవుతున్న కొమ్మాలును పక్కన కూర్చోబెట్టి తాత్కాలికంగా కాలుకి కట్టు కట్టి మెరుగైన వైద్యం కోసం పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 200కు పైగా కుక్కలు గ్రామంలో ఉన్నాయి. రోజు వీధి వీధినా గల్లి గల్లిన కుక్కలు గుంపులుగా తిరుగుతూ గ్రామస్తులను పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను రైతులను కూలీలను భయభ్రాంతులకు గురి చేస్తూ కరుస్తున్నాయని ఆరోపించారు. నెక్కొండ వరంగల్ ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా వాహనాలు వెళుతూ ఉంటాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని వీరి కుక్కలు వెంబడించడంతో కింద పడి కాళ్ళు చేతులు విరిగిన రోజులు ఉన్నాయని ఇదే విషయమై పలుమార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరు పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో వీధి కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని వేడుకున్నారు.

# ఉద్యోగులకు జాప్యం లేకుండా సేవలందించాలి

- ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి



భూపాలపల్లి, అక్టోబర్ 9 (జనం సాక్షి): ఉద్యోగులకు జాప్యం లేకుండా సేవలు అందించాలని భూపాలపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయంలో అన్నీ గనులు , డిపార్ట్మెంట్ ల సంక్షేమ అధికారుల తో ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల టెర్మినల్ బెనిఫిట్స్, ఉద్యోగుల గృహ రుణాల రాయితీ, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు తదితర సంక్షేమ పథకాలు, ఉద్యోగుల గైర్హాజరు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా గనులు, డిపార్ట్మెంట్ల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు నిత్యం సమాచారం అందిస్తూ, వేగంగా పరిష్కరించాలని సూచించారు. అన్నీ గనులు, డిపార్ట్మెంట్ ల సంక్షేమ అధికారులతో గైర్హాజరు అవుతున్న వారిని విధులకు తప్పనిసరిగా హాజరు అయ్యేలా వారిని ప్రోత్సహించాలని, సింగరేణి యజమాన్యం ఇప్పుడున్న పరిస్థితులలో ఎలాంటి వారినైనా ఉపేక్షించకుండా డిస్మిస్ చేసే అవకాశాలు త్వరలో రాబోతున్నాయని, గైర్హాజరు అవుతున్న ఉద్యోగులకు తెలియజే యాలని, అదేవిధంగా డ్యూటీ చేయని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా లేకుండా మేనేజర్లకు గని తెలియ జేయాలని కోరారు. సంక్షేమ అధికారులు ఉత్సాహంగా పనిచేస్తూ పెండింగ్ దరఖాస్తులు లేని విధంగా భూపాలపల్లి ఏరియా ని మొదటి స్థానం లో నిలపాలని పేర్కొన్నారు. ఉద్యోగుల పర్సనల్ ఫైల్స్, నామినేషన్ లు తనిఖీ చేసి సరి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ లు క్రాంతికుమార్, గుండు రాజు, అన్నీ గనుల సంక్షేమ అధికారులు అన్ని విభాగాల మినిస్ట్రియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ ఎస్ఐపై మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు

మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 09 (జనంసాక్షి): మహబూబాబాద్ టౌన్ ఎస్.ఐ.పై మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు చేసినట్లు ముస్లిం సంఘాల తెలంగాణ జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ లోని మా నాన్న యూసుఫ్ అలీ ఖాన్ పేరు మీద ఉన్న సర్వే నెంబరు 448 భూమిపై దౌర్జన్యం చేస్తున్న దౌర్జన్య కారులపై చర్యలు తీసుకునే విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ, కనీసం ఫిర్యాదు పై ప్రాథమిక దర్యాప్తు కూడా చేయకుండా, మా నాన్న చావుకు పరోక్షంగా కారణమైన దౌర్జన్య కారుల వేధింపులతో పాటు, మహబూబాబాద్ టౌన్ ఎస్ఐ ప్రశాంత్ నిర్లక్ష్యం కూడా కారణం కావడంతో హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఎస్ఐ ప్రశాంత్ పై శాఖ పరమైన చర్యలకు ఆదేశించాలని, మా భూమి విషయంలో దౌర్జన్యాలకు పాల్పడుతున్న దౌర్జన్య కారులపై చట్టపరమైన చర్యలకు ఆదేశించాలని మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో వోల్వో శిక్షణా తరగతులు

- ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



భూపాలపల్లి, అక్టోబర్ 9 (జనం సాక్షి): భూపాలపల్లి ఏరియా సింగరేణి లో వోల్వో డంప్ ట్రక్కు ఆపరేటర్ కోసం పదవ తరగతి ఉత్తీర్ణులై, కనీసం మూడు సంవత్స రాల,అనుభవం కలిగిన్న హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి నిరుద్యోగ యువకులైన సింగరేణి ఉద్యోగుల పిల్లలు, మాజీ ఉద్యోగుల పిల్లలు, పరిసర గ్రామాల ప్రజలు, భూనిర్వాసితుల కోసం సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి తెలియజేశారు. దీనికి ముదునెలలకు ఒక బ్యాచ్ కు 60 మంది చొప్పున ట్రైనింగ్ ఇవ్వడం జ రు గు తుం ద ని తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువకులు పదవ తరగతి ఉత్తీర్ణులై 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన సంవత్సరం, మెరిట్ పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు . ఎస్సీ, ఎస్టీ వారికి రూల్ ఆఫ్ రిజర్వేషన్, వయస్సు మినహాయింపు ఉంటుందని తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారికి ఎటువంటి స్టైఫండ్ కానీ భృతి కానీ ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు. శిక్షణ పూర్తిగా వారి సొంత పూచికత్తు మీదనే ఆధారపడి ఉంటుందని తెలియజేశారు.ఈ దరఖాస్తులను అక్టోబర్ 20 లోపు సంబంధిత భూపాలపల్లి సింగరేణి ఎంవీటీసీ లో అందజేయాలని తెలిపారు.

# ప్రజలకు సమాచార అస్త్రం ఆర్టీఐ

- జూనియర్ కళాశాలల్లో వ్యాసరచన పోటీలు



వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 9 (జనంసాక్షి): రాష్ట్ర సమాచార కమిషన్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం వరంగల్ జిల్లాలోని పలు జూ. కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించబడినట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఆర్టీఐ ద్వారా సుపరిపాలన అనే అంశం పై జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో సమాచార హక్కు చట్టం–2005 పై వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. డిఐఈఓ డా. శ్రీధర్ సుమన్ గురువారం నాడు పోటీ పరీక్షలు వాటి తీరుతెన్నులను పరిశీలించారు.రంగశాయిపేట, కృష్ణాకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న వ్యాసరచన లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం–2005 అనేది ప్రజలకు సమాచారాన్ని పొందడంలో అస్త్రంగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 20 సం. పూర్తయినందున ప్రభుత్వం పలు అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్ళు సంపత్ కుమార్, శరధ్చతి, అధ్యాపకులు, నాన్–టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి

# ముఖ్యమంత్రి సంపూర్ణ సహకారం

- న్యూఢిల్లీలో ఇక్లి సౌత్ ఏసియా, ఎన్ఐయుఏ సంయుక్త ఆధ్వర్యంలో ఆరైస్ సిటీస్ కార్యక్రమం
- నగరం తరపున ప్రాతినిధ్యం వహించిన మేయర్



వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 9 (జనంసాక్షి): వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. దేశ రాజధాని న్యూ ఢిల్లీ లో ఇక్లి సౌత్ ఏసియా, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్ ఐ యు ఏ) సంయుక్త ఆధ్వర్యం లో రెండు రోజులపాటు (అక్టోబర్ 8,9) ఏర్పాటు చేసిన ఆరైస్ సిటీస్ కార్యక్రమం లో మేయర్ నగరం నుండి ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొన్నారు. ఇక్లి సౌత్ ఏసియా సంస్థ 20 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో శుభాకాంక్షలు తెలుపుతూ వివిధ ప్రాంతాల నుండి సుమారు 200 మంది డెలిగేట్స్ (ప్రతినిధులు) ఒక ప్లాట్ ఫాం మీదకు తీసుకు వచ్చి ఒకరి విధానాలను (ప్యూచర్) మరొకరు పంచుకునేలా ఏర్పాటు చేసినందుకు ఆ సంస్థ కు అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వరంగల్ మహా నగర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ యు జి డి ఏర్పాటుకు ఇప్పటికే రూ 4170 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. వరంగల్ లో విమానాశ్రయం ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు తీసుకొంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, హుజురాబాద్ వద్ద రూ.150 కోట్ల వ్యయంతో 25 ఎకరాల స్థలంలో 6 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగినప్లాంట్ను నెలకొల్పుటకు చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. నాన్ స్ట్రక్చరల్ మెజర్స్ లో భాగం గా మెట్రోలాజికల్ డిపార్ట్మెంట్ వారు అందించే డాటాను బసినిచి కు అనుసంధానం చేసి దీని ద్వారా నగర ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం (అలెర్ట్) ను ప్రకటిస్తున్నామని, స్టార్మ్ వాటర్ మేనేజ్మెంట్ కోసం నగరంలోని కొన్ని ప్రాంతాలలో ఇంకుడు గుంతలు (హార్వెస్టింగ్ పిట్స్)ఏర్పాటు చేశామని, ప్రకృతి సిద్ధమైన పరిష్కారాలను కూడా అవలంబి స్తున్నామని, ఇందు కోసం వెట్ ల్యాండ్స్ స్పాంజ్ పార్కులు ఎఫారెస్టేషన్ అర్బన్ గ్రీన్ స్పేస్ లేక్ రిస్టోరేషన్ అన్ని నాన్ స్ట్రక్చరల్ మెజర్స్ లో చేర్చడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధిగా మున్సిపల్ బడ్జెట్ నుండి 10% గ్రీన్ బడ్జెట్ కు కేటాయించాలని ఆదేశించడం మేరకు, దీని పాలసీ తయారుచేసి దానికనుగుణంగా బల్దియాలో మొక్కలు నాటి పచ్చదనం పెంచుతున్నామన్నారు. జిడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో రినేబుల్ ఎనర్జీ కింద బయోగ్యాస్ ఏర్పాటు చేశామని, నాలుగు లక్షల టన్నుల బయో మైనింగ్ చేయడం జరుగుతుందని, ఎఫ్ ఎస్ టి పి పాలసీ మన రాష్ట్రంలోనే నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా పీకల్ స్లడ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మాణించడం జరుగుతుందని, దీని ద్వారా రెవెన్యూ కూడా సేకరిస్తున్నాం. రెన్యువల్ ఎనర్జీ కింద సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక్లి సౌత్ ఏషియా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి అంశాల్లో పూర్తిగా సహకారం అందిస్తున్నారని ఇక్లి వారి సేవలు అనేక ప్రాంతాలకు విస్తరించాలని ఇక్లి వారి సహకారంతో వారిని సంప్రదిస్తూ క్లైమేట్ యాక్షన్ ప్లాన్, బయోడైవర్సిటీ జీరో వేస్ట్ పై ప్రేమ్ వర్క్ వంటి అంశాల్లో వారి సహకారాన్ని కోరుతామని తెలిపారు. త్వరలో బ్రెజిల్ దేశం లో జరిగే కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ లో ఈ అంశాలను ప్రవేశపెట్టి జిడబ్ల్యూ ఎంసీ తరపున నగరంలో అమలు జరుగుతున్న అంశాలను అభిప్రాయాలను అందజేయడం గర్వంగా ఉందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐయుఏ డైరెక్టర్ కుందు గిజీ, ఇక్లి డైరెక్టర్ ఎమన్ కుమార్, ఇక్లి సౌత్ ఏషియా హెడ్ , బెంగాల్ స్పెషల్ సెక్రెటరీ రాజీవ్ సింగ్, వివిధ దేశాల, నగరాల నుండి సుమారు 200 మంది మేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

# మిస్సింగ్ కేసును చేధించిన పోలీసులు

- హత్య చేసి ముక్కలు ముక్కలుగా నరికి మున్నేరు చెట్ల పొదలల్లో వేసిన హంతకులు
- హత్యకు పాల్పడిన మహిళతోపాటు మరో ఇద్దరు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి




**ఖమ్మం రూరల్, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు చాకచక్యంగా చేధించారు.కేసు వివరాలను గురువారం ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి సిబ్బంది తో కలిసి ఖమ్మం రూరల్ ఏసీపీ కార్యాలయం లో విలేఖరుల సమావేశంలో వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పరిమి అశోక్ కొంతకాలంగా ఖమ్మం జిల్లాలో నివాసం ఉంటున్నాడు. ఖమ్మం అర్బన్ మండలం బాలపేట వంగతోట సాగు చేసేవాడు. సాగులో నష్టాలు రావడం, అప్పులపాలు కావడంతో ప్రత్యామ్నాయ వ్యాపారం చేసేందుకు ఖమ్మం వచ్చాడు. ఈ క్రమంలో ఖమ్మం నగర కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయా గా పనిచేసే కొమ్ము నగ్మాతో అశోక్‌కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త శారీరక సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన గట్ల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్ గ్రంథాలయం వద్ద అశోక్‌కు పరిచయం అయ్యాడు. కాలక్రమంలో వీరి పరిచయం స్వలింగ సంపర్కానికి దారితీసింది. అశోక్ రూమ్ కు వెంకటేశ్వర్లు తరచూ వచ్చిపోతుండేవాడు. వచ్చిన ప్రతిసారి అశోక్ కు ఆర్థిక సహకారం చేసేవాడు. అయితే ఏక మొత్తంలో ఒకేసారి వెంకటేశ్వర్లును చంపి అతడి వద్ద ఉన్న బంగారం, ఇతర ఆస్తులను చేజిక్కించుకోవాలనే దురుద్దేశ్యంతో అశోక్ కుట్రకు తెరలేపాడు. ఈ క్రమంలో బాలపేటలో తాను వ్యవసాయం చేస్తున్న సమయంలో పరిచయమైన పెంటి కృష్ణయ్య సహకారం తీసుకున్నాడు. వెంకటేశ్వర్లును ఎలా చంపాలి, చంపిన తర్వాత శరీర భాగాలను గుర్తు తెలియని ప్రదేశాల్లో ఎలా వేయాలి అనే అంశాలను యూట్యూబ్‌లో సెర్చ్ చేశాడు. గత నెల 15వ తేదీన వెంకటేశ్వర్లు యాథావిధిగా అశోక్ రూమ్‌కు వచ్చి పడుకున్నాడు. నిద్రలో ఉన్న వెంకటేశ్వర్లును తెల్లవారుజామున అతి కిరాతంగా అశోక్ నరికి చంపాడు. మెడపై పలుమార్లు నరికి తల మొండెం వేరు చేశాడు. ఆ సమయంలో నగ్మాను రూమ్ బయట కాపలాగా ఉంచాడు. శరీరాన్ని ముక్కలుగా నరికిన తర్వాత ఆ భాగాలను ప్లాస్టిక్ కవర్లలో కట్టి కరుణ గిరి ప్రాంతంలో పొదలు, చెత్తలో విసిరేశాడు. ఆ తర్వాత గదిలోని రక్తపు మరకలను శుభ్రపరిచినట్లు విచారణలో తేలిందని ఏసీపీ తెలిపారు. నిందితులు ఏ-1 పరిమి అశోక్, ఏ-2 కొమ్ము నగ్మా, ఏ-3 పెంటి కృష్ణపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నుండి రెండు తులాల గోల్డ్ చైన్, సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, బి.సాయికుమార్, కారేపల్లి ఎస్ఐ గోపి, కానిస్టేబుల్ సంపత్, కారేపల్లి ఎస్ఐ గోపి, కానిస్టేబుల్ ఆనంద్, అంజి, రాజేశ్, ఉపేందర్, సైదాను ఏసీపీ అభినందించారు.

## అరకొర వసతులతో ప్రారంభమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలు



**మాడ్గులపల్లి (తిప్పర్తి), అక్టోబర్ 9 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తుంద నే నెపంతో జిల్లాలో హడావిడిగా ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు దయానియా స్థితికి చేరుకున్నాయి. అధికారులు ఆర్భాటంగా ప్రారంభించిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యా లు లేకపోవడంతో అకాల వర్షాల కారణంగా అన్నదాతలు హరిగోసలు పడుతున్నారు. అసౌకర్యాల నడుమ ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు పోసిన ధాన్యం అకాల వర్షానికి తాడిసీ పోతుంది . అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేయాల్సి వస్తుంది. తిప్పర్తి మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం రాశులు పోసి ఆరబెట్టుకునే క్రమంలో అకస్మాత్తుగా వర్షం రావడం తోధాన్యాన్నితడవకుండాఉంచేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ధాన్యంపై కప్పేందుకు అవసరమైన ప్లాస్టిక్ పట్టాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు పోసిన ధాన్యం తడిసి పోయింది. ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించిన పంట వర్షంలో తడవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితులలో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో మిగిలిపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసౌకర్యాల నడుమ ఆర్భాటంగా ప్రారంభించిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన కనీస అవసరాలు సమకూర్చి అన్నదాతకు అండగా నిలవాలని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఒకే రోజులో 58 మందికి కోర్టు శిక్షలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** జిల్లాలో మద్యం సేవించి వాహనం నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు ప్రత్యక్షంగానీ, పరోక్షంగానీ ప్రధాన కారణమవుతున్నారు. కొన్నిసార్లు మద్యం సేవించి వాహనం నడిపినవారు స్వయంగా ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతుండగా, ఎన్నో కుటుంబాలు దాని వల్ల రోడ్డున పడుతున్నాయి.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని కామారెడ్డి జిల్లా పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీలు నిర్వహిస్తున్నారు. పట్టుబడిన వాహనదారులను కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయమూర్తుల ఎదుట హాజరుచేయడం ద్వారా జైలు శిక్షలు లేదా జరిమానాలు విధించడం జరుగుతోంది.గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో కోర్టు మొత్తం 58 మందికి శిక్షలు విధించింది.


## సర్వీస్ నౌ సర్టిఫికేషన్స్ సాధించిన 33 మంది యస్‌బిఐటి విద్యార్థులు



**ఖమ్మం, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** ప్రముఖ బహుళజాతి సాఫ్ట్ వేర్ సంస్థ సర్వీస్ నౌ నిర్వహించే సర్టిఫైడ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ (సి.యస్.ఏ) పరీక్షలో తమ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. అమెరికా కేంద్రంగా ఆటోమేటెడ్ బిజినెస్ వర్క్ ఫ్లో, ఐ.టి. సంబంధిత సేవలు అందిస్తున్న సర్వీస్ నౌ లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరచడం ద్వారా ప్రపంచ స్థాయి సంస్థలలో ఉద్యోగ అవకాశాలు పొందగలరని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందించి అభినందించారు. సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ ఉద్యోగాలకు ప్రముఖంగా సర్వీస్ నౌ వారి సర్టిఫైడ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ నే అన్ని కంపెనీలు ప్రామాణికంగా పరిగణిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి. ధాత్రి తెలిపారు. సాఫ్ట్ వేర్ రంగంలో గత 5 సంవత్సరాలుగా ఈ సర్టిఫికేషన్ పొందిన వారి కొరత ఉందని, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ విషయాన్ని గ్రహించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. వాల్మార్ట్, అమెజాన్‌తో పాటు వివిధ ఫార్చ్యూన్ 500 కంపెనీలు క్లయింట్ గా కలిగిన సర్వీస్ నౌ తమ కళాశాలను గుర్తించి, తమ విద్యార్థులకు సర్టిఫికేషన్ కు అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపల్ డా. జి. రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తమ విద్యార్థులకు సర్టిఫికేషన్ సాధించటంలో తోడ్పాటును అందించిన లాజిక్ వైల్ ట్రైనింగ్ సంస్థకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, డా. జె. రవీంద్రబాబు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ డా. జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గందరగోళంగా రామకృష్ణాపురం ఓటర్ లిస్టు

- సర్పంచ్ అభ్యర్థి పేరు గల్లంతు



**చింతకాని, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** చింతకాని మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో ఓటర్ల జాబితా విడుదల అనంతరం గందరగోళం చెలరేగింది. జూలై 31, 2025న విడుదలైన ఓటర్ లిస్టులో కొంతమంది గ్రామస్థుల పేర్లు లేకపోవడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో అభ్యర్థులు పోటీకి రంగంలోకి దిగేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో రామకృష్ణాపురం టీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు రెండు వందల మంది స్థానికులు గ్రామంలో స్థిరనివాసులు కాదని, వారి పేర్లు జాబితాలో ఉండకూడదని గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్ అధికారికి పిర్యాదు చేశారు. అధికారులు పరిశీలన జరిపి కొంతమంది పేర్లలో మార్పులు, చేర్పులు చేశారు. అయితే గ్రామానికి చెందిన కురుగుంట్ల రవీందర్ రెడ్డి, ఆయన భార్య కురుగుంట్ల సునీత, శెట్టి శ్రీకాంత్, ఆయన భార్య ఝాన్సీ లక్ష్మీబాయి, శెట్టి సతీష్, ఆయన భార్య నర్మద లు తమ కుటుంబాలు తరతరాలుగా రామకృష్ణాపురంలోనే నివసిస్తున్నాయని తెలిపారు. "మా ఇళ్లు, పొలాలు ఇక్కడే ఉన్నాయి. మేము మాగ్రామంలోనే ఉంటున్నపటికీ ఓటర్ లిస్టులో మా పేర్లు కొంతమంది కావాలని తొలగించారు అని పేర్కొంటూ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుల విజ్ఞప్తిని పరిశీలించి 2025 జూన్ 5న జిల్లా అప్పటి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ "వారికి రామకృష్ణాపురం గ్రామంలో ఓటు హక్కు కల్పించాలి" అని ఆర్ డి ఓ కు చింతకాని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసారు , అయితే తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో పేర్లు జూలై 31, 2025 ఓటర్ లిస్టులో చేర్చబడలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ ఉత్తర్వులు ఉన్నప్పటికీ, అప్పటి తహసీల్దార్ సిబ్బంది ప్రలోభాలకు లోనై పేర్లు చేర్చలేదు. ఇది స్పష్టమైన అన్యాయం," అని బాధితులు విమర్శించారు.

## బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ పార్టీ అసలు గుట్టు బయటపడింది



**ఖమ్మం, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** బీసీ రిజర్వేషన్లపై ఇవాళ హైకోర్టు వెలువరించిన తీర్పుపై స్పందించిన ఖమ్మం నగర బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ "బీసీ రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి మళ్లీ బహిర్గతమైంది. బీసీ రిజర్వేషన్ బిల్లుపై సరైన చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయకుండా, రెండేళ్లుగా బీసీలను మోసం చేస్తూ నాటకాలు ఆడింది అని తమ అనుకూల వ్యక్తుల ద్వారా కోర్టులో కేసులు వేయించి, నిన్న కావాలనే హైకోర్టులో విచారణను ఇవాల్టికి వాయిదా వేయించి, కోర్టు నుండి స్టే తెచ్చుకుంది అనేది స్పష్టమైంది. ఇది కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాల పట్ల ఎలాంటి నిజమైన నిబద్ధత లేకుండా కేవలం రాజకీయ లాభాల కోసమే వ్యవహరిస్తోందన్నది మరోసారి రుజువైంది అని "కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట బీసీ సామాజిక వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బీసీలకు నిజమైన న్యాయం చేయడంలో విఫలమైంది అని గురువారం హైకోర్టు తీర్పుతో వారి అసలు ఉద్దేశం బట్టబయలైంది అని బీసీల హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం బిఆర్ ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలుస్తుందని, ఈ అంశంలో బీసీ వర్గాల న్యాయమైన హక్కులను కాపాడేందుకు పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని పగడాల అన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**కనగల్, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** జెడ్పిటిసి, ఎంపీటి ల ఎన్నికల ప్రక్రియ లో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల కౌంటర్ల ఏర్పాట్లను ఎన్నికల పరిశీల కురాలు కొర్ర లక్ష్మితో కలిసి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారంపరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి తోపాటు ఎంపీటీసీల కు సంబంధించిన విడివిడి కౌంటర్లను పెట్టాలని, అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో వారి యొక్క నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే కౌంటర్ స్లిప్పు ఇవ్వాలని తెలియజేశారు. ఏర్పాట్లు చూసి కలెక్టర్ సంతృప్తి చెందారు.

**తొలిరోజు జి ఎడవెల్లి నుంచి ఒక నామినేషన్..**

మండలంలోని జి ఎడవెల్లి జనరల్ మహిళ ఎంపీటీసీ స్థానానికి ఒక నామినేషన్ వచ్చినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కే సుమలత తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, డిపిఓ వెంకయ్య, హౌసింగ్ పీడీ రాజకుమార్, ఆర్డీవో వై అశోక్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ప్రముఖ వ్యాపారవేత్త యామ ప్రభాకర్ అన్నారు.గురువారం జిల్లా బాలభవన్ లో ప్లాస్టిక్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ క్లాత్ సంచులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక దేశాలు ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను నిషేధించాయన్నారు.ప్రపంచ వ్యాప్తంగా 9 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే రీసైకలింగ్ చేస్తున్నారన్నారు.చాలా వరకు ప్లాస్టిక్‌ను పూడ్చి పెట్టడం, కాల్చివేయడం చేయాలన్నారు.ప్రతి ఏటా దాదాపు 8 మిలియన టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్లాస్టిక్ కుళ్లిపోవడానికి వేల సంవత్సరాలు పడుతుందన్నారు.పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం ద్వారా ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ప్రతి ఒక్కరు చేతి సంచులను వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి, వీరునాయుడు, అరుంధతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారినా తీరని ప్రజల కష్టాలు

- ఉదృతంగా ప్రవహిస్తున్న వాగు
- గౌండ్లగూడెం -పూసలపాడు మధ్య నిలిచిన రాకపోకలు



**మాడ్గులపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి) :** ప్రభుత్వాలు పాలకులు మారిన తమ తలరాత మారడంలేదని మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామపంచాయతీ పరిధిలోని గౌండ్లగూడం ఆవాస ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఉదృతంగా ప్రవహిస్తున్న పానగల్లు ఉదయ సముద్రం నుండి పెద్దదేవులపల్లి రిజర్వాయర్ కువెళ్లేవాగు ఉప్పొంగి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండడంతో గౌండ్లగూడెం-పూసలపాడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గౌండ్లగూడ ఆవాస ప్రాంతవాసులు ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గౌండ్లగూడ నుండి పూసలపాడు రావడానికి ఇదొక్కటే మార్గం కావడంతో గ్రామ ప్రజలు మోకాళ్ళ లోతు నీళ్లలో వాగులో నుండి నడిచి రావలసిన పరిస్థితి నెలకొంది. గౌండ్లగూడెం నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు తల్లిదండ్రులు తమ భుజాల మీద ఎత్తుకొని అవతలి ఒడ్డు నుండి ఇవతల ఒడ్డు వరకు దించి వెళున్నారు.ఎన్నికల సందర్భంగా వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఉత్తరప్రగల్భాలు పలికిన రాజకీయ నాయకుల మాటలు నీటి మీద రాతలుగా మారిపోయాయని, ప్రభుత్వాలు పాలకులు మారుతున్నారు తప్ప తమ బ్రతుకులు మారడం లేదని గౌండ్లగూడం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే తమకు వాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో ప్రమాదకర స్థితిలో బయటకు వెళ్లలేని పరిస్థితులు దాపురించాయని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ అధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నాను.

# బాకీ కార్డులతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి

- డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ మాజీ ఎమ్మెల్యే



**తుంగతుర్తి, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని కానీ అధికారంలోకి వచ్చి 22 నెలల అయినప్పటికీ ఆరు గ్యారంటీలు కానీ 420 హామీలు అమలు చేయలేదని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలపై నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీహామీలు ఇచ్చిన బాకీ కార్డుల పోస్టర్ను విడుదల చేశారు.ఈ మేరకుఆయన మాట్లాడుతూ మర్చిపోయిన హామీలను గుర్తుచేయాలని ఉద్దేశంతో ప్రజల వద్దకు బాకీ కార్డులు తీసుకువచ్చామని అన్నారు ఇట్టి బాకీ కార్డులను గ్రామంలోని ప్రతి గడపగడపకు చేరవేసి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన మోసాన్ని వివరించాలన్నారు. కాంగ్రెస్ 22 నెలల పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదని ప్రభుత్వంపై గ్రామాల్లో జనం దుమ్మెత్తి పోస్తున్నారని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు ఐక్యమత్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి చేసిన మోసాన్ని వివరించి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, నాయకులు కేతిరెడ్డి గోపాల్ రెడ్డి, దొంగర్ శ్రీనివాస్, తునికి సాయిలు, తడకమళ్ళ రవికుమార్ తో పాటు వివిధ గ్రామాల టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడికి నిరసన




**భువనగిరి, అక్టోబర్ 9 (జనం సాక్షి) :** సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గావాయి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మైనార్టీ జర్నలిస్ట్ ఫ్రంట్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండి సుజావుద్దీన్ ప్రజా సంఘాల నాయకుడు భట్టు రామచంద్రయ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం డి షరీఫ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పై జరిగిన దాడి హేయమైన చర్యాని ఈ ఘటన భారతదేశ రాజ్యాంగంపై జరిగిన దాడి అని దీనిని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని ఈ సందర్భంగా అన్నారు. భారత ప్రజాస్వామ్యానికి ఇది చీకటి రోజు అని దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న న్యాయ వ్యవస్థ కు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న జస్టిస్ గవాయిపై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే ఇది భారత రాజ్యాంగానికి ఒక మచ్చలాగా ఉండిపోతుందని అన్నారు.భారతదేశంలో భారత రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలకు కులాలకు సమాన హక్కులు ఉన్నాయి కానీ కొందరు మత ఉన్మాదులుగా వ్యవహరించి భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మానవత్వాన్ని కాలరాస్తు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని వారన్నారు. ఇలాంటి దుర్మార్గాపు చర్యల పట్ల ప్రభుత్వాలు కఠినంగా ఉండి రాజ్యాంగ వ్యతిరేక దాడులకు పాల్పడిన వ్యక్తులకు కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని వారు ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సలహాదారుడు ఇబ్రహీం బియబాని, అధ్యక్షుడు డాక్టర్ షేక్ హమీద్ పాషా, కోశాధికారి బైరపాక సీరిల్, సహాయ కార్యదర్శి ఎస్ కే హుస్సేన్ , సభ్యులు ఫసిఉద్దీన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రఫీ ఉద్దీన్ గౌరీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అంజద్,సిపిఎం పార్టీ నాయకులు మాయ కృష్ణ, మైనార్టీ నాయకులు అమీన్ మైమన్, హనీఫ్ మైమన్ ఎస్ కే మహది హాసన్,, హాజీ, షకీల్, కబీర్, తదితరులు పాల్గొన్నారు.






## మళ్లీ లాభాల్లోకి..

### రాణించిన ఫార్మా, ఆయిల్ ,గ్యాస్, రియాల్టీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ ఐటీ షేర్లు

**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఫార్మా, ఆయిల్ ,గ్యాస్, రియాల్టీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ ఐటీ షేర్లు రాణించాయి. సెన్సెక్స్ 390 పాయింట్లకు పైగా పెరగ్గా.. నిఫ్టీ 120 పాయింట్లకు పైగా పెరిగింది. ఉదయం 81,900.00 (క్రితం ముగింపు 81,773.66) వద్ద ప్రారంభమైన సూచీ ఒక దశలో 81,667.68 కనిష్ఠానికి పడిపోయింది. ఆ తర్వాత పుంజుకొని 398.45 పాయింట్లు లాభపడి చివరకు 82,172.10 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ 122.80 పాయింట్లు పెరిగి 25,168.95 వద్ద స్థిరపడింది. రూపాయి మారకం విలువ డాలర్‌తో పోలిస్తే 88.79 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యు స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లాభాల్లో ముగియగా.. యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్ కంపెనీ, టాటా కన్స్యూమర్, మారుతి సుజుకి నష్టపోయాయి.

# ఉద్యోగం చేస్తూనే కోట్లు కొల్లగొట్టొచ్చు



**ఉద్యోగులకు కోటీశ్వరులు కావాలనే ఆశ ఉంటుంది. కానీ సరైన ప్లానింగ్ లేకపోవడం వల్ల చాలామంది తమ కలను నెరవేర్చుకోలేకపోతున్నారు. జీతం తక్కువగా ఉన్నా సరైన ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి విధానాన్ని అనుసరిస్తే ప్రైవేట్ ఉద్యోగులు కూడా దీర్ఘకాలంలో కోటీశ్వరులు కావడం సాధ్యమే.**

**• సంపాదించే మార్గాలు..**

బడ్జెటింగ్, పొదుపు:నెలవారీ ఖర్చులను లెక్కించి, బడ్జెట్ వేసుకోవడం తప్పనిసరి. వచ్చిన జీతంలో కనీసం 20% నుంచి 30% వరకు పొదుపు చేయడానికి ప్రయత్నించాలి. మీరు ఎంత త్వరగా పొదుపు చేయడం ప్రారంభిస్తే అంత త్వరగా మీ లక్ష్యాన్ని చేరుకోవచ్చు. అధిక వడ్డీ ఉండే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు అప్పులను వీలైనంత త్వరగా చెల్లించాలి. ఎందుకంటే అధిక వడ్డీ మీ సంపాదనలో చాలా భాగాన్ని తగ్గిస్తుంది. పెట్టుబడి ఎంపికలు:కోటీశ్వరులు కావాలంటే కేవలం పొదుపు చేస్తే సరిపోదు. ఆ పొదుపును పెంచే మార్గాల్లో పెట్టుబడి పెట్టాలి. ఈ క్రమంలో రిస్క్ రాబడిని దృష్టిలో ఉంచుకోవాలి. దీర్ఘకాలంలో అత్యధిక రాబడి ఇచ్చే అవకాశం ఉన్న పెట్టుబడి మార్గాల్లో స్టాక్ మార్కెట్, ఈక్విటీ మార్కెట్‌లు కీలకంగా ఉన్నాయి. ప్రైవేట్ ఉద్యోగులకు ఒక ఉత్తమమైన మార్గం. ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని మంచి పనితీరు కనబరుస్తున్న ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా మార్కెట్ ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. ఉదాహరణ: మీరు నెలకు రూ.10,000 చొప్పున 25 సంవత్సరాలు చేస్తే సగటున 12% రాబడితో దాదాపు రూ.1.89 కోట్లు సంపాదించవచ్చు. చిన్న మొత్తంలో క్రమంగా పెట్టుబడి పెట్టి పెద్ద సంపదను సృష్టించడానికి ఇది సహాయపడుతుంది. నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడి: మీకు మార్కెట్ గురించి లోతైన అవగాహన ఉంటే మంచి ప్రాథమిక అంశాలున్న పెద్ద కంపెనీల బ్లూ-చిప్ షేర్లలో పెట్టుబడి పెట్టవచ్చు. అయితే ఇందులో నష్టభయం ఉంటుందని గమనించాలి. గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్‌లు: ఆర్థిక అనిశ్చితి సమయంలో బంగారం ఒక సురక్షితమైన పెట్టుబడిగా పరిగణించబడుతుంది. మొత్తం పెట్టుబడిలో కొంత భాగాన్ని (సుమారు 5% - 10%) బంగారంలో పెట్టవచ్చు. నేరుగా బంగారం కొనుగోలు చేయడం కంటే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ముఖ్యమైన పెట్టుబడి సూత్రాలు:'వడ్డీపై వడ్డీ' అనే సూత్రాన్ని సమర్థంగా ఉపయోగించుకోవడానికి వీలైనంత త్వరగా పెట్టుబడి ప్రారంభించాలి. మీరు ఎంత ఎక్కువ కాలం పెట్టుబడిని కొనసాగిస్తే మీ డబ్బు అంత వేగంగా పెరుగుతుంది. పెట్టుబడి మొత్తాన్ని ఒకే ఆస్తిలో కాకుండా స్టాక్స్, గోల్డ్, రియల్ ఎస్టేట్ వంటి వేర్వేరు మార్గాల్లో విభజించాలి. ఒక రంగంలో నష్టం వచ్చినా మరొక రంగం ఆ నష్టాన్ని భర్తీ చేయగలుగుతుంది. మీరు ఎంచుకున్న %ూ%ూ% లేదా ఇతర పెట్టుబడిని నిరంతరాయంగా కొనసాగించాలి. మార్కెట్ తగ్గినా లేదా పెరిగినా నెలవారీ పెట్టుబడిని ఆపకూడదు. ఏటా జీతం పెరిగినప్పుడల్లా మీ పెట్టుబడి మొత్తాన్ని కూడా కొంత పెంచాలి. ఇది మీ లక్ష్యాన్ని త్వరగా చేరుకోవడానికి సహాయపడుతుంది. కోటీశ్వరులు అవ్వడం ఒక రాత్రిలో జరిగేది కాదు. ఇది సమయం, క్రమశిక్షణ, సరైన పెట్టుబడి నిర్ణయాల కలయిక. మీ ప్రస్తుత జీతం ఎంత ఉన్నా దీర్ఘకాలిక పెట్టుబడి ప్రణాళికను అనుసరిస్తే మీరు తప్పకుండా ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోగలరు.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా నుంచి..

## విండ్సర్ ఇన్‌స్పైర్ ఎడిషన్

**న్యూఢిల్లీ:**జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.. 'విండ్సర్ ఈవీ ఇన్‌స్పైర్ ఎడిషన్'ను లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ. 16.65 లక్షలు (ఎక్స్-షోరూమ్)ఈ కారును ఎంచుకునేవారు.. రూ. 9.99 లక్షల (ఎక్స్-షోరూమ్) ధరకు కొనుగోలు చేయవచ్చు. ఇది లిమిటెడ్ ఎడిషన్ వెర్షన్ కావడంతో, కంపెనీ దీనిని 300 యూనిట్లకు మాత్రమే పరిమితం చేసింది. ఎంజీ విండ్సర్ ఈవీ ఇన్‌స్పైర్ ఎడిషన్.. పెర్ల్ వైట్ అండ్ స్టార్రి బ్లాక్‌లను కలిగి ఉన్న డ్యూయల్-టోన్ ఎక్స్టీరియర్‌తో వస్తుంది. ఫ్రంట్ గ్రిల్, బంపర్ కార్నర్ ప్రొటెక్టర్‌లపై రోజ్ గోల్డ్ డిజైన్ ఎలిమెంట్‌లను కలిగి ఉన్న యాక్సెసరీ ప్యాక్‌తో కూడా లభిస్తుంది. ఇంటీరియర్ విషయానికి వస్తే.. ఇన్‌స్పైర్ ఎడిషన్ దాని థీమ్‌ను సాంగ్రియా రెడ్ అండ్ బ్లాక్ లెదర్ అప్హోల్స్టరీ, హెడ్‌రెస్ట్‌లపై ఎంబ్రాయిడరీ ఇన్‌స్పైర్ లోగో వంటివి పొందుతుంది. ఆప్షనల్ యాక్సరీస్ జాబితాలో.. స్కైలైట్ ఇన్ఫినిటీ వ్యూ గ్లాస్ రూఫ్ వైర్‌లెస్ ఇల్యూమినేటెడ్ సిల్ ప్లేట్లు ఉన్నాయ., వీటిని ఎంజీ డీలర్‌షిప్‌లలో కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉన్నాయి. ఎంజీ విండ్సర్ ఈవీ ఇన్‌స్పైర్ ఎడిషన్‌లో 38 కిలోవాట్ బ్యాటరీ, పర్మనెంట్ మాగ్నెట్ సింక్రోనస్ మోటార్‌ను పొందుతుంది.




**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.02 | ₹ 5.07 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,13,800 (22 క్యారెట్లు) | ₹ 1,24,150 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,77,000

జపాన్ మొబిలిటీ షో 2025

## సిద్ధమైన ఫ్రాంక్స్ ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు

**న్యూఢిల్లీ:**మారుతి సుజుకి త్వరలో జరగనున్న జపాన్ మొబిలిటీ షో 2025లో ప్రదర్శించబోయే.. మారుతి సుజుకి ఫ్రాంక్స్ ఫ్లెక్స్-ఫ్యూయల్ కాన్సెప్ట్ గురించి వెల్లడించింది. ఇది 85 శాతం వరకు ఇథనాల్ బ్లెండింగ్‌కు మద్దతు ఇచ్చే ప్రస్తుత 1.2-లీటర్ పెట్రోల్ ఇంజిన్ ట్వీక్డ్ వెర్షన్ ద్వారా శక్తిని పొందుతుందని సమాచారం. అయితే కంపెనీ ఫ్లెక్స్-ఫ్యూయల్ పవర్‌ట్రెయిన్ వివరాలను పూర్తిగా వెల్లడించలేదు. జపాన్ మొబిలిటీ షోలో కనిపించనున్న ఫ్రాంక్స్ ఫ్లెక్స్-ఫ్యూయల్ కారు డిజైన్ ముందు భాగంలో సుజుకి ఎటువంటి మార్పులకు లోను కాలేదు. అయితే సైడ్ ప్రొఫైల్ కొన్ని 'ఫ్లెక్స్-ఫ్యూయల్' డెకల్‌లను పొందుతుంది. టెయిల్‌గేట్‌పై ఫ్లెక్స్-ఫ్యూయల్ బ్యాడ్జ్ ఉన్నట్లు తెలుస్తుంది. జపాన్ మొబిలిటీ షో అనేది రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఆటో షో. ఈ కార్యక్రమం 2025 అక్టోబర్ 30 నుంచి నవంబర్ 9 వరకు ఒడైబాలోని టోక్యో బిగ్ సైట్‌లో జరుగుతుంది. ఇందులో సుజుకి రాబోయే ఈ-విటారా , ఫేస్‌లిఫ్టెడ్ ఎక్స్-బీ, జిమ్నీ నోమేడ్ (5-సీట్ల మేడ్-ఇన్-ఇండియా జిమ్నీ), స్పేసియా, విజన్ ఈ-స్కై బీఈవీ కాన్సెప్ట్ ఈ-ఎవ్రీ కమర్షియల్ వ్యాన్ కాన్సెప్ట్‌లను కూడా ప్రదర్శించనుంది. ఈవేదికపైనే ఫ్రాంక్స్ ఫ్లెక్స్-ఫ్యూయల్ కాన్సెప్ట్‌ను కూడా ప్రదర్శించనుంది.



## జియో నుంచి కొత్త ఫోన్

### కొత్త ఫోన్ తీసుకొచ్చిన ఇది ఉంటే ఫుల్ సేఫ్టీ!

రిలయన్స్ జియో సరికొత్త ఫోన్‌ను తీసుకొచ్చింది. ఢిల్లీలో జరుగుతున్న ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ 2025 సదస్సులో వివిధ సేఫ్టీ ఫీచర్లతో కూడిన జియోభారత్ ఫోన్లను ప్రవేశపెట్టింది. ఫోన్ పర్యవేక్షణ, వినియోగ నిర్వహణ, కుటుంబ సభ్యులు, పిల్లలు, వృద్ధులకు సంబంధించిన హెల్త్ వంటి సేఫ్టీ-ఫస్ట్ ఫీచర్లను ఈ ఫోన్‌లో తీసుకొచ్చింది. వినియోగదారులకు భద్రతతోపాటు పీస్ ఆఫ్ మైండ్ ఇచ్చేలా రూపొందించిన జియోభారత్ ఫోన్లను ఐఎంసీ సదస్సులో రిలయన్స్ ఆవిష్కరించింది. అంతేకాకుండా వైట్-లిస్టింగ్ ద్వారా అవాంఛిత కాల్స్ , కాలర్లను నివారించడంలో సేఫ్టీ షీల్డ్ సహాయపడుతుంది. ఇక అత్యంత ముఖ్యమైన ఫీచర్ ఏంటంటే కుటుంబ సభ్యుల వద్ద ఉన్న జియోఫోన్‌లో బ్యాటరీ , నెట్ వర్క్ లభ్యత స్థితిని రిమోట్ గా పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఇక ఫోన్ బ్యాటరీ బ్యాకప్ ఏడు రోజుల వరకు ఉంటుందని జియో పేర్కొంది. జియోభారత్ ఫోన్ సేఫ్టీ షీల్డ్ మరిన్ని ప్రయోజనాలను రిలయన్స్ జియో అధ్యక్షుడు సునీల్ దత్ వివరించారు. ఈ ఫోన్‌లు ముఖ్యంగా కుటుంబంలోని పిల్లలు, పెద్దవారి కోసం రూపొందించినట్లు చెప్పారు. ఈ ఫోన్‌లు వినియోగిస్తున్న తమ వారు ఎక్కడ ఉన్నారు.. వారి ఫోన్‌లు ఎక్కడ ఉన్నాయో మీరు పర్యవేక్షించగలుగుతారు. ఒకవేళ కనిపించక పోయినట్లయితే ఫోన్‌లోని అలారాన్ని మోగించవచ్చు. జియోభారత్ ఫోన్‌లను జియో స్టోర్స్, జియోమార్ట్, అమెజాన్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కొనుగోలుచ చేయవచ్చు. జియోభారత్ ఫోన్ల ధర రూ.799 నుంచి ప్రారంభమవుతుంది.



# బీహార్ బిలియనీర్లు.. బిజినెస్‌లో తోపులు!



**న్యూఢిల్లీ:**బిహార్ అంటే పేద రాష్ట్రం, నిరక్షరాస్యులు ఎక్కువ అనే అభిప్రాయం దేశంలో చాలామందికి ఉంటుంది. కానీ బిహార్ సాంప్రదాయకంగా పండితులు, నాయకులు, సాంస్కృతిక గొప్పతనానికి ప్రసిద్ధి చెందింది. దేశంలోని అత్యంత విజయవంతమైన వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలకు నిలయంగా కూడా ఉంది. మైనింగ్ నుండి ఫార్మాస్యూటికల్స్, సెక్యూరిటీ సర్వీసులు, పునరుత్పాదక ఇంధనం, రాజకీయాల వరకు వివిధ రంగాల్లో సంకల్పం, విజన్‌తో వేల కోట్ల సంపదను ఎలా సృష్టించగలరో బిహార్ సంపన్నులు చూపిస్తున్నారు. మీడియా నివేదికల ప్రకారం.. 2025లో బిహార్ లోని టాప్ 10 ధనవంతులు, వారి వ్యాపార సామ్రాజ్యాలు, నెట్‌వర్త్‌ల గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

**అనిల్ అగర్వాల్**
నెట్‌వర్త్: రూ.16,000-17,000 కోట్లు
బిజినెస్: వేదాంత రిసోర్సెస్ వ్యవస్థాపకుడు
నేపథ్యం: పాట్నాలో స్క్రాప్ డీలర్ గా ప్రారంభించిన అగర్వాల్ ప్రపంచంలోని అతిపెద్ద సహజ వనరుల కంపెనీలలో ఒకదాన్ని నిర్మించారు. ఇప్పుడు లండన్ లో ప్రధాన కార్యాలయం ఉంది.

**రవీంద్ర కిషోర్ సిన్హా:**
నెట్‌వర్త్: రూ.5,000-10,000 కోట్లు
బిజినెస్: సెక్యూరిటీ అండ్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్
నేపథ్యం: భారతదేశపు అతిపెద్ద సెక్యూరిటీ అండ్ ఫెసిలిటీ మేనేజ్ మెంట్ కంపెనీని నిర్మించిన మాజీ జర్నలిస్ట్.

**మహేంద్ర ప్రసాద్**
నెట్‌వర్త్: రూ .4,000 కోట్లు పైనే
బిజినెస్: అరిస్టో ఫార్మాస్యూటికల్స్
నేపథ్యం: "కింగ్ మహేంద్ర"గా పిలువబడే ఈయనది బిహార్ ఫార్మా ఉనికిలో కీలక పాత్ర.

**సంప్రదా సింగ్:** నెట్‌వర్త్: (2019లో మరణించడానికి ముందు): రూ .25,000 కోట్లు పైనే
బిజినెస్: ఆల్కెమ్ లేబొరేటరీస్
నేపథ్యం: తన సోదరుడితో కలిసి ముంబైలో ఆల్కెమ్ ను స్థాపించి, దానిని ప్రముఖ ఫార్మా బ్రాండ్ గా తీర్చిదిద్దారు.

**సుబ్రతా రాయ్**
నెట్‌వర్త్: రూ .3,000 కోట్లు పైనే
బిజినెస్: సహారా ఇండియా (ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, మీడియా)
నేపథ్యం: 1978లో సహారాను కనీస మూలధనంతో స్థాపించి, దానిని జాతీయ సమ్మేళనంగా నిర్మించారు.

**శుభమ్ సింగ్**
నెట్‌వర్త్: రూ.5000 కోట్లు
బిజినెస్: భారత్ ఊర్జా డిస్టిలరీస్ (ఇథనాల్ ప్లాంట్)
నేపథ్యం: కేవలం 26 సంవత్సరాల వయస్సులో భారతదేశంలోని అతి పిన్న వయస్కుడైన ఇంధన పారిశ్రామికవేత్తలలో ఒకరుగా బిహార్ పునరుత్పాదక ఇంధన రంగాన్ని నడిపించారు.

**సుభాష్ చంద్ర**
నెట్‌వర్త్: రూ .5,000 కోట్లు
బిజినెస్: ఎస్సెల్ గ్రూప్, జీ మీడియా
నేపథ్యం: భారతదేశపు అతిపెద్ద మీడియా సామ్రాజ్యాలలో ఒకదాన్ని నిర్మించారు. బీహార్ వెలుపల ఉన్నప్పటికీ, ఆయన కుటుంబ మూలాలు బిహార్‌తో ముడిపడి ఉన్నాయి.

**సుమంత్ సిన్హా**
నెట్‌వర్త్: రూ .3,000 కోట్లు
బిజినెస్: రెన్యూ పవర్
నేపథ్యం: మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా తనయుడైన సుమంత్ భారత క్లీన్ ఎనర్జీ రంగంలో ప్రముఖ పేరు తెచ్చుకున్నారు.

మహిళా ఉద్యోగులకు

## నెలసరి సెలవు..

### కర్ణాటక కీలక నిర్ణయం

**బెంగుళూరు(జనంసాక్షి):**మహిళా ఉద్యోగుల విషయంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెలకు ఒక రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగినులతో పాటు వస్త్రపరిశ్రమ, బహుళజాతి సంస్థలు, ఐటీ కంపెనీలు, ఇతర ప్రైవేటు పరిశ్రమల్లో పనిచేసే వారికి ఈ సెలవు వర్తించనుందని ప్రభుత్వం వెల్లడించింది. "శ్రామిక మహిళల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం నెలసరి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు మానసిక, శారీరక సౌకర్యం అందించాలన్నదే మా ఉద్దేశం. ఈ నిర్ణయం ఉద్యోగినులకు ఎంతగానో ఉపకరించనుంది. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేస్తున్నాయి. అందుకే ఇక్కడా ఆ సెలవును ఇవ్వాలనుకున్నాం" అని క్యాబినెట్ సమావేశం అనంతరం న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మహిళా హక్కుల కార్యకర్త బృందా అడిగె స్వాగతించారు. మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి ఇలాంటి నిర్ణయాలు దోహదం చేస్తాయని హర్షం వ్యక్తంచేశారు. అయితే అసంఘటిత రంగంలో సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఇప్పటికే బిహార్, ఒడిశా, కేరళ, సిక్కిం రాష్ట్రాలు ఈ నెలసరి సెలవును అమలు చేస్తున్నాయి. అలాగే జొమాటో, స్విగ్గీ, ఎల్ అండ్ టీ, గోజూప్ వంటి సంస్థలు వేతనంతో కూడిన ఈ సెలవును ఇస్తున్నాయి.

ఫోర్బ్స్ ఇండియా బిలియనీర్స్ జాబితా

## టాప్ 10లో ఒకే ఒక్క మహిళ

**న్యూఢిల్లీ:**భారతదేశంలోని అత్యంత ధనవంతులైన 100 మంది వ్యక్తుల జాబితాను.. ఫోర్బ్స్ ఇండియా రిలీజ్ చేసింది. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ 'ముకేశ్ అంబానీ' అగ్రస్థానంలో నిలిచారు. 105 బిలియన్ డాలర్ల నికర విలువతో ముకేశ్ అంబానీ.. ప్రథమ స్థానంలో నిలిచారు. గత ఏడాదితో పోలిస్తే ఈయన సంపద 12 శాతం క్షీణించింది. 2వ స్థానంలో మౌలిక సదుపాయాల దిగ్గజం గౌతమ్ అదానీ కుటుంబం 92 బిలియన్ డాలర్ల సంపదతో ఉన్నారు. మొత్తం మీద వందమంది ధనవంతుల సంపద 2025లో 9 శాతం తగ్గింది. ఓపీ జిందాల్ గ్రూప్‌కు చెందిన సావిత్రి జిందాల్ మూడో స్థానంలో నిలిచారు. వీరి నికర విలువ 3.5 బిలియన్ల తగ్గి.. 40.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. టాప్ 10 జాబితాలో ఉన్న మహిళగా ఈమె రికార్డ్ క్రియేట్ చేశారు. టెలికాం దిగ్గజం సునీల్ మిట్టల్, టెక్ బిలియనీర్ శివ నాడార్ వరుసగా నాలుగు, ఐదోస్థానంలో నిలిచారు.

భారతదేశంలోని టాప్ 10 బిలినీయర్స్
ముకేశ్ అంబానీ: 105 బిలియన్ డాలర్లు
గౌతమ్ అదానీ, కుటుంబం: 92 బిలియన్ డాలర్లు
సావిత్రి జిందాల్: 40.2 బిలియన్ డాలర్లు
సునీల్ మిట్టల్, కుటుంబం: 34.2 బిలియన్ డాలర్లు
శివ్ నాడర్: 33.2 బిలియన్ డాలర్లు
రాధాకిషన్ దమానీ , కుటుంబం: 28.2 బిలియన్ డాలర్లు
దిలీప్ షాంఘ్వీ: 26.3 బిలియన్ డాలర్లు
బజాజ్ కుటుంబం: 21.8 బిలియన్ డాలర్లు
సైరస్ పూనవల్లా: 21.4 బిలియన్ డాలర్లు
కుమార్ మంగళం బిర్లా: 20.7 బిలియన్ డాలర్లు

# భారత్-యూకే ఎఫ్‌టీఏ.. ఆర్థిక వృద్ధికి కొత్త ఆశలు





**న్యూఢిల్లీ:**భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) రెండు దేశాల ఆర్థిక సంబంధాల్లో మైలురాయిగా నిలుస్తుంది. 2025 జులై 24న ఈ ఒప్పందం కుదిరింది. యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తాజాగా భారత్ పర్యటన సందర్భంగా దీని అమలును త్వరగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇది రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచడానికి ఎంతో తోడ్పడుతుందని చెప్పారు. ఈ ఒప్పందం వల్ల భారత్‌లో అద్భుతమైన అవకాశాలు వస్తాయని నిపుణులు నమ్ముతున్నారు. 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలన్న సంకల్పానికి ఇది శక్తివంతమైన చోదకశక్తిగా పనిచేస్తుంది. రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని సుమారు 34 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు. ఎఫ్‌టీఏ ప్రధాన ఆకర్షణల్లో ఎగుమతులు ముందంజలో ఉన్నాయి. ఈ ఒప్పందం 90% టారిఫ్ లైన్లపై తగ్గింపులు అందిస్తుంది. యూకే నుంచి భారత్‌కు విమాన భాగాలు, శాస్త్రీయ సాధనాలు, చాక్లెట్, జింజర్‌బ్రెడ్, మెడికల్ డివైసెస్ వంటివి టారిఫ్‌రహితంగా ఉంటాయి. విస్కీ, జిన్‌పై 150% నుంచి 75%కి సుంకాలు తగ్గింపు ఉంటుంది. 10 సంవత్సరాల తర్వాత ఇది 40%కు చేరుతుంది. ప్రొఫెషనల్ మొబిలిటీలో ఈ ఒప్పందం యూకే పాయింట్స్-బేస్డ్ ఇమ్మిగ్రేషన్ విధానాన్ని ఉల్లంఘించకుండా తాత్కాలిక ప్రయాణాలను సులభతరం చేస్తుంది. ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, అకౌంటెన్సీ, మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ వంటి రంగాల్లో ప్రొఫెషనల్స్ కాన్ఫరెన్సులు, ఇంట్రా-కంపెనీ ట్రాన్స్‌ఫర్లు, కాంట్రాక్ట్ సర్వీసెస్ కోసం వీసా ప్రక్రియలు సమానంగా ఉంటాయి. అకౌంటెంట్స్, ఆడిటర్స్, ఆర్కిటెక్ట్స్, లాయర్స్, ఇంజినీర్లకు మ్యూచువల్ రికగ్నిషన్ ఆఫ్ క్వాలిఫికేషన్స్ ప్రోత్సహిస్తుంది. ఇది అడ్మినిస్ట్రేటివ్ ఖర్చులను తగ్గిస్తుంది. దాంతో భారత ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రొఫెషనల్స్‌కు యూకే మార్కెట్‌లో అవకాశాలు పెరుగుతాయి. వ్యవసాయం, సముద్ర ఉత్పవ్యవసాయ రంగంలో యూకే నుంచి భారత్‌కు ఫ్రెష్/ఫ్రోజెన్ సాల్మన్, లాంబ్ మీట్ వంటి ఉత్పత్తులపై టారిఫ్‌లుండవు. 10 సంవత్సరాల తర్వాత చాక్లెట్, బిస్కట్స్, సాఫ్ట్ డ్రింక్స్ వంటివి ఇందులో చేరుతాయి. షుగర్, రైస్, పోర్క్, చికెన్, ఎగ్స్ వంటి సున్నిత రంగాలను ఇందులో నుంచి మినహాయించారు. ఎంఎస్‌ఎంఈలకు ఇన్ఫర్మేషన్ షేరింగ్, పారదర్శకత పెంచుతూ అడ్డంకులను తగ్గించడం ద్వారా చేయూతని అందిస్తారు. కాంటాక్ట్ పాయింట్లు, మార్కెట్ ఎంట్రీ బెస్ట్ ప్రాక్టీసెస్, ఆన్‌లైన్ ట్రేడ్ ఇన్ఫో, ఫైనాన్స్ యాక్సెస్‌పై సహకారం అందుతుంది. డిజిటల్ ట్రేడ్ ద్వారా ఎలక్ట్రానిక్ కాంట్రాక్ట్స్ ఎంఎస్‌ఎంఈలకు సహాయపడుతుంది. విద్యా రంగంలో నేరుగా కమిట్‌మెంట్స్ లేకపోయినా సర్వీసెస్ సెక్టార్ ద్వారా యూకే యూనివర్సిటీలు (అక్స్‌ఫర్డ్, కేమ్‌బ్రిడ్జ్) భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయి. ఇది భారత విద్యార్థులకు (ప్రతి సంవత్సరం 1.5 లక్షల మంది యూకే వెళ్తారు) మరింత సౌలభ్యం అందిస్తుంది. ఇన్నోవేషన్ విభాగంలో యూకే-భారత్ పరిశోధన, అభివృద్ధి సహకారాన్ని పెంచుతుంది. ఇన్నోవేషన్ వర్కింగ్ గ్రూప్ రెగ్యులేటరీ అప్రోచెస్, టెక్నాలజీ కమర్షలైజేషన్‌పై పనిచేస్తుంది. పారిశ్రామికీకరణలో ఆటోమోటివ్స్ (కారు టారిఫ్‌లు 10%), ఎలక్ట్రికల్ సర్క్యూట్స్, మెడికల్ డివైసెస్, ఎయిర్‌క్రాఫ్ట్ పార్ట్స్‌పై టారిఫ్‌లు ఉండవు. భారత మాన్యుఫాక్చరింగ్ జీడీపీలో 21% (2031 నాటికి) పెరగడానికి యూకే ఇన్వెస్ట్‌మెంట్స్ (లైఫ్ సైన్సెస్, క్లీన్ ఎనర్జీ) సహాయపడతాయి. ఎన్విరాన్‌మెంట్ పరంగా గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొక్యూర్‌మెంట్‌ను ప్రోత్సహిస్తుంది.

## భారత్‌పై ప్రశంస.. అమెరికా అధ్యక్షుడికి కౌంటర్ పడ్డట్లే!

న్యూఢిల్లీ: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ భారత ఆర్థిక వ్యవస్థపై ప్రశంసలు గుప్పించారు. 2028 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారాయన. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన కౌంటర్ ఇచ్చారా? అనే చర్చ మొదలైంది. యూకే ప్రధాని హోదాలో కీర్ స్టార్మర్ తొలిసారిగా భారత్ పర్యటనకు వచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన.. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రశంసలు కురిపించారు. నమస్కారం మిత్రులారా.. అంటూ హిందీలో యూకే ప్రధాని స్టార్మర్ తన ప్రసంగం ప్రారంభించారు. 2028 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందని, ఇందుకుగానూ ప్రధాని నాయకత్వాన్ని అభినందిస్తున్నానని అన్నారాయన. అలాగే.. 2047 వికసిత్ భారత్ అనేది అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చడమేనని అన్నారాయన. ఇక్కడ నేను చూసిన ప్రతిదీ మీరు(మోదీని ఉద్దేశించి..) ఆ లక్ష్యాన్ని సాధించగలరన్న నమ్మకాన్ని నాకు కలిగించింది. ఆ ప్రయాణంలో మేము భాగస్వాములుగా ఉండాలనుకుంటున్నాం అని స్టార్మర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. రష్యా ఆయిల్ వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో భారత ఎకానమీని డెడ్ అంటూ ట్రంప్ అభివర్ణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. ఇప్పుడు బ్రిటన్ ప్రధాని వ్యాఖ్యలు అందుకు కౌంటర్‌గా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఇదిలా ఉంటే.. ఇవాళ న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో యూకే-భారత్ మధ్య ఆర్థిక సహకారం, టెక్నాలజీ, వాణిజ్యం, విద్య రంగాల్లో సహకారంపై చర్చ జరిగింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
10 అక్టోబర్ 2025

# స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా యంత్రాగం సర్వం సిద్ధం

- జిల్లాలో ఏడు జడ్పీటీసీ స్థానాలు, 65 ఎంపీటీసీ స్థానాలకు మొదటి విడతలో ఎన్నికలు
- ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాట్ల పరిశీలన
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరిత



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 (జనంసాక్షి):** రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరిత గురువారం తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల క్రమంలో వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, బోయినిపల్లి, చందుర్తి ఎంపీడీఓ కార్యాలయాల్లో, రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల కోసం చేసిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సెప్టెంబర్ 29న షెడ్యూల్ విడుదల చేసిందన్నారు.ఇందులో భాగంగా జిల్లాలో మొదటి విడతలో ఏడు జడ్పీటీసీలు స్థానాలు, 65 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఎంపీ డీఓ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు చేసిన హెల్ప్ డెస్క్‌లు, ఇతర ఏర్పాట్లను పరిశీలించామని తెలిపారు. ఇప్పటికే ఎన్నికల నేపథ్యంలో ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు శిక్షణ ఇచ్చామని, ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జోనల్, మండల ఆఫీసర్లు, ఎంసీసీ నోడల్ ఆఫీసర్లు, ఎఫ్ఎస్టీ,ఎస్ఎస్టీ టీంలను ఏర్పాటు చేసి వారికి శిక్షణ పూర్తి చేశామన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్ టీ టీంలను విధులు నిర్వర్తిస్తున్నాయన్నారు.అన్ని ఆర్‌ఓ కార్యా లయాల్లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సహా యార్థం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ,ఎన్ని కకు సంబంధించిన పూర్తి సమాచారం అందు బాటులో పెట్టాలని, నామినేషన్ల స్వీకరణ ఇతర వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆ మె ఆదేశించారు.గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో రెండు,మూడో విడతలో నిర్వహించను న్నట్లు తెలిపారు.దానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పీఓ, ఏపీఓలకు ఇప్పటికే ఒక విడత శిక్షణ ఇచ్చామని, మరో విడత ఇస్తామ న్నారు.ఆమె వెంట వేములవాడ ఆర్డీవో రాధా భాయ్,ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీ ల్దార్లు, ఎంపీఓలు పాల్గొన్నారు.

**మొదటి విడతలో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు.**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మొదటి విడుతలో జరుగనున్న ఎన్నికల వివరాలు..బోయినపల్లి జడ్పీటీసీతో పాటు 11 ఎంపీటీసీ స్థానాలు,చందుర్తి జడ్పీటీసి, 10 ఎంపీటీసీ స్థానాలు, రుద్రంగి జడ్పీటీసీ,5 ఎంపీటీసీ స్థానాలు, వేములవాడ అర్బన్ జడ్పీటీసీ,6 ఎంపీటీసీ స్థానాలు, వేములవాడ రూరల్ జడ్పీటీసీ,7 ఎంపీటీసీ స్థానాలు,కోనరావుపేట జడ్పీటీసీ,12 ఎంపీటీసీ స్థానాలు,ఇల్లంతకుంట జడ్పీటీసి,14 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి.జిల్లాలోని ఏడు మండలాలలో మొత్తం ఏడు జడ్పీటీసీ స్థానాలకు,65 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి.

# ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు తీసుకున్నారా?

**పాఠశాలలు, ఏ.టీ.సీ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 09 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలు, ఐ.టీ.ఐలలో కొనసాగుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చందూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, అదే ఆవరణలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. ముఖ గుర్తింపు విధానం (ఎఫ్.ఆర్.ఎస్) ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు తీసుకున్నారా అని పరిశీలించారు. విద్యార్థులు కోసం వండిన మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని సూచించారు. డైనింగ్ హాల్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, పనులను పూర్తి చేయించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం బోధన్ పట్టణం, నిజామాబాద్ నగరంలలో ప్రభుత్వ ఐ.టీ.ఐ లకు అనుసంధానంగా ప్రభుత్వం నూతనంగా నెలకొల్పిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు. ఈ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలిం చారు. ఇంకనూ అవసరం ఉన్న మౌలిక వసతుల గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# చివరి లబ్ధిదారుడి వరకు ఇందిరమ్మ ఇండ్లిస్తాం

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 09 (జనంసాక్షి) :** రేకుర్తి బుడిగె జంగాల కాలనీలో పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్దారుల ఇండ్లకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇల్లిస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఉన్న చివరి లబ్దిదారుని వరకు ఇండ్లు మంజూరు చేస్తుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ నియో జకవర్గంలో ఆలస్యమైనందున అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ఇంకా పూర్తి కాలేదని మిగిలిన అర్హులకు ఇండ్లు మంజూరు చేస్తామని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.



# మాకు న్యాయం చేయండి

- మా డబ్బులు బ్యాంకులో జమ చేయండి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 (జనంసాక్షి):** వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి మహిళా సంఘం సభ్యుల నుండి రూ ఐదు లక్షల 26 వేలు వసూలు చేసి యూనియన్ బ్యాంకులో జమ చేయకుండా చేతివాటం ప్రదర్శించిన సంఘటన గురువారం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులు మాట్లాడుతూ కొనాయిపెల్లిలోని సాయిబాబా ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులు మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యులం బ్యాంకు నుండి లోను తీసుకున్న డబ్బులు ప్రతి నెల యూనియన్ బ్యాంక్ లో విధులు నిర్వహిస్తున్న బ్యాంకు కరస్పాండెంట్ జ్యోతికి ప్రతినెలా బ్యాంకులో కట్టాల్సిన డబ్బులు ఆమెకు చెల్లించామన్నారు. మొత్తం రూ 5 లక్షల 26 వేలు యివ్వాగా ఆమె రెండు లక్షల 70 వేలు మాత్రమే బ్యాంకులో జమ చేసి, మిగతా రూ 2 లక్షలు 56 వేలు తనకు సంబంధం లేదని అనడంతో తాము మోసపోయామని గ్రహించిన సభ్యులు బ్యాంకు ముందు పురుగుల మందు డబ్బాలతో ధర్నాకు దిగారు. తాము కట్టిన డబ్బులకు న్యాయం చేయాలని అంటున్నారు.ఈ విషయంపై బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ, బ్యాంకు నిబంధనల ప్రకారం మహిళా సంఘ సభ్యులు వారు కట్టిన రసీదులు పరిశీలించి బ్యాంకు కరస్పాండెంట్ జ్యోతి ఎంత డబ్బులు జమ చేసిందో పరిశీలన చేస్తామన్నారు.కరస్పాండెంట్ ఏమైనా మోసానికి పాల్పడితే ఆమె వద్ద నుండి చట్టపరంగా డబ్బులను రికవరీ చేసి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.




# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9 (జనంసాక్షి) :** నామినేషన్ల కేంద్రాల సందర్శించారు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.ఎంపీటీసీల మరియు జడ్పిటిసిల ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో జిల్లాల్లోని నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం తాడువాయి మండలంలోని మండల కార్యాలయంలో గల నామినేషన్ కేంద్రాలను వాటి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.. ఎన్ని ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.. ఎన్ని సెంటర్లు ఏర్పాటు చేసినారు.. ఏవిధంగా నామినేషన్ లు తీసుకుంటున్నారు అన్న విషయాలను ఎంపీడీవో ను అడిగి తెలుసుకున్నారు..ప్రతి ఒక రిటర్నింగ్ ఆఫీసర్ దగ్గరికి వెళ్లి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.. రోజువారీగా చేపట్టే కార్యక్రమాలను అర్వోలని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పిటిసి నామినేషన్ కేంద్రాన్ని సైతం పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు అంతేకాకుండ నామినేషన్ వేసే వాళ్ళకి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసినహెల్ప్ డెస్క్ ను పరిశీలించారు ఎన్నికల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.. అలాగే మండల కేంద్రంలో గల ఏటీసీ సెంటర్ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్లో ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వెళ్లే రోడ్డు సరిగా లేకపోవడంతో రోడ్డు మరమ్మత్తులు మరియు రోడ్డు ఏర్పాటుకు ప్రపోజల్స్ పంపాలని ఎమ్మార్వో ను ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎమ్మార్వో శ్వేతా, ఎంపీఓ సవిత, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు దుర్గాప్రసాద్, రామస్వామి రామస్వామి,నర్సింలు, మధు, ఆర్ ఐ హారిక, హనుమద్లు,రాజేశ్వర్ ,కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

# ఉచ్చులు బిగిస్తే ఊచలు తప్పవు

- అటవీ వన్యప్రాణుల వేటగాళ్లను బైండోవర్ చేసిన పోలీసులు



**మహదేవపూర్ అక్టోబర్ 9 (జనంసాక్షి):** అటవీ వన్యప్రాణుల కోసం కుచ్చులు పెట్టే వేటగాళ్లను మహదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు ఎస్సై పవన్ కుమార్ అదుపులోకి తీసుకొని తాసిల్దార్ రామారావు ముందు హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గురువారం రోజున మహదేవపూర్ మండలంలోని అంబటిపల్లి ఏన్కపల్లి,సూరారం, రాపెల్లికోట, కిష్టరావుపేట, పెద్దంపేట, గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు అటవి జంతువుల కోసం అటవీలో ఉచ్చులు బిగిస్తున్నారని సమాచారం తెలియగా అనుమానాస్పదంగా 25 మందిని పోలీస్ స్టేషన్ కి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి అటవీ వన్యప్రాణులకు ఉచ్చులు పెట్టడం నేరమని ఉచ్చులు పెట్టడంవల్ల మనుషులకుకూడా ప్రాణ అపాయం స్తంభవించడం జరుగుతుందని ఎవరైనా అటవిలో ఉచ్చులు పెట్టిన పెట్టే వాళ్లకు సహకరించిన వారికి జైలు శిక్ష తప్పదని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. అనంతరం వారిని మహదేవపూర్ తాసిల్దార్ రామారావు. ముందు హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయలకు బైండోవర్ చేయడం జరిగిందని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై పవన్ కుమార్. ఎస్సై 2 సాయి శశాంక్ ఉన్నారు.

# డాక్టర్ సీటు సాధించిన పోలీస్ పిల్లలు అభినందించిన సీపీ



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 09 (జనంసాక్షి) :** యం.బి. బి.ఎస్ లో సీటు సాధించిన పోలీస్ పిల్లలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఘనంగా సత్కరించి అభినందనందించారు. కొద్ది రోజుల క్రితం యం. బి. బి. ఎస్ మొదట విడత కౌన్సిలింగ్లో సెంట్రల్ జోన్ షేక్ సలీమా కుమార్తె తాన్య సభ హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా, హెూంగార్డ్ బాలకిషన్ కుమారుడు ముప్పా చందుకు మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు, మరో హెూం గార్డ్ మోహన్ కుమార్తె భవాని ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలో సీటు సాధించింది. ఈ సందర్భం గా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్ళు వున్న పిల్లలు చదువుల పట్ల అశ్రద్ధ వహించవద్దని.. వారిని ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సాహించాలని, తమ పిల్లలు యం. బి. బి. ఎస్ సీటు సాధించడం కృషి చేసిన తల్లిదండ్రులకు పోలీస్ కమిషనర్ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అడిషనల్ డీసీపీ లు శ్రీనివాస్, ప్రభాకర్ రావు, ఆర్.ఐ చంద్రశేఖర్ తో హెూం గార్డ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


# చేగువేరా స్ఫూర్తితో.. సామ్రాజ్యవాదంపై పోరాడుదాం

**ఎస్ఎఫ్ఐ - డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చే 58వ వర్ధంతి సభ**




**హైదరాబాద్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** ప్రపంచ విప్లవ కారుడు, సామ్రాజ్యవాదానికి సింహస్వప్నం చేగువేరా 58వ వర్థంతి సభ ఎస్ఎఫ్ఐ -డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విజయ్ కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో దోపిడీ లేని సమాజం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 39 సంవత్సరాలకే తనువు చాలించాడని అన్నారు. చే గువేరా జీవితం నేటి యువత, విద్యార్థులు అధ్యయనం చేసి సమాజంలో అసమానతలు, దోపిడీ లేని ,పేదరికం లేని వ్యవస్థ కోసం పోరాడాలని అన్నారు. పదవులు కోసం పార్టీలు మారే ఈరోజుల్లో క్యూబా దేశానికి అత్యున్నత పదవి మంత్రి అయి ఉండి కూడా రాజీనామా చేసి బొలివియా స్వాతంత్ర్యం కోసం అమెరికా సైన్యంతో గెరిల్లా పోరాటాన్ని నిర్వహించాడని అన్నారు. ఈరోజు ప్రపంచానికి వైద్యంలో వెన్నదన్నుగా క్యూబా నిలుస్తుందంటే చేగువేరా నాడు విద్య, వైద్యంపై చేసిన అసమాన కృషి కారణం అన్నారు. నేడు అమెరికా క్యూబా, వెనిజులా లాంటి దేశాలను అణచివేసేందుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. చే స్ఫూర్తితో సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. సభలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యాక్షులు ఎం.డి.జావేద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.రమేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రాజు, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్ పాల్గొన్నారు.

# ఎంఈడీ, ఎంపీఈడీ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల



రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీ సీపీజీఈటీ – 2025లో భాగంగా ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల మొదటి దశ, రెండో దశ ప్రవేశాలకు షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చ లని చెప్పారు. 15వ తేదీన వెరిఫికేషన్ వివరాలను వెల్లడిస్తామన్నారు. 15, 16 తేదీల్లో వెబ్ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని, 17వ తేదీన ఎడిట్ చేసుకోవచ్చన్నారు. ప్రాథమిక సీట్ల కేటాయింపు జాబితాను 21వ తేదీన విడుదల చేస్తామని, అభ్యర్థులు తమకు కేటాయించిన కళాశాలలో 24వ తేదీలోగా రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరిం చారు. ఇతర వివరాలకు అభ్యర్థులు తమ వెబ్‌సైట్ లో చూసుకోవాలని సూచించారు.

# స్కూల్ బస్సులో పొగలు

**- 25 మంది విద్యార్థులు సురక్షితం**



**హైదరాబాద్ :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ఘోర ప్రమాదం తప్పింది. స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రయివేటు పాఠశాల బస్సులో ఆకస్మికంగా పొగలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపి ఉంచాడు. అనంతరం పిల్లలందరిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అటుగా వెళ్తున్న వాహనదారులు కూడా బస్సు డ్రైవర్‌కు సహాయం అందించారు. పిల్లలను బస్సులో నుంచి బయటకు తీసుకొచ్చారు. పిల్లలకు ఎలాంటి హానీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. స్కూల్ బస్సు ఇంజిన్‌లో నుంచి పొగలు వచ్చినప్పుడు.. బస్సులో 25 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. పిల్లలందరూ సురక్షితంగా బయటపడ్డారని, ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదన్నారు. డ్రైవర్ కూడా ఈ ప్రమాదం తప్పించుకున్నాడు. పిల్లలను మరో బస్సులో పాఠశాలకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# "న్యాయవాది రాకేష్ కిషోర్"పై వెంటనే చర్యలు తీసుకోవాలి

**ప్రజా మిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 09 (జనంసాక్షి):** సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ కిషోర్ పై కేంద్ర ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం ప్రజామిత్ర కార్యా లయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర ంలో ఉన్న ఖజురహో టెంపుల్ గోడ బయట భాగం మీద తల కొట్టేయబడి ఉన్న విష్ణుమూర్తి విగ్రహానికి మరమ్మత్తులు చేపించాలని సెప్టెంబర్ 15 తేదీన సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండి యా కోర్టులో వాదనలకు వచ్చినప్పుడు ఇది యు నెస్కో వరల్డ్ హెరిటేజ్, ఆర్కియాలజీ కల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలోని అంశం ఇందులో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోరాదని అట్టి కేసును కొట్టి వేయడం జరిగిందన్నారు. అప్పటి న్యాయ వాది పదేపదే నేను విష్ణుమూర్తి భక్తున్ని అని అన డం వలన న్యాయమూర్తి సిజెఐ గవాయి మరి మీరు ఒకసారి విష్ణుమూర్తికి ప్రార్థన చేయాలని అనడం జరిగిందన్నారు. దానిపై సోషల్ మీడి యాలో సిజెఐ పై దాడి ఎందుకు చేయకూడదని, ఇతర ఎన్నో రకాలుగా కామెంట్లు చేస్తూ గౌవ య్‌కి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వీడి యోలు పెట్టడం జరిగిందన్నారు. రెండు రోజుల తర్వాత సిజెఐ గౌవాయు వివరణ ఇవ్వడం జరిగిందన్నారు. అంత సమసి పోయిందని అంద రూ అనుకున్నారు కానీ 20 రోజుల తర్వాత అక్టో బర్ 6 తేదీన రాకేష్ కిషోర్ అనే మరో న్యాయ వాది కోర్టులో బూట్ విసడం జరిగింద న్నారు. ఈ 20 రోజుల కాలంలో భారత దేశంలో జరిగిన కుట్రలు, కుతంత్రాలు ఎవరు చేశారో దేశం అంత తెలుసన్నారు. నేరం జరిగినప్పుడు, చట్టాన్ని ఉల్లంఘించినప్పుడు రాకేష్ కిషోర్ అనే న్యాయ వాది పై చట్టపరంగా అన్ని చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఉందన్నారు. ఇక్కడే అర్థమ వుతుంది దీని వెనుక కుట్ర దాగి ఉందని అన్నా రు. కుట్ర దారులు ఎవరో భారతీయులందరికి అర్థం అయి ందన్నారు. సరైన సమయంలో సరైన జవాబు భారతీయులు ఇస్తారని తెలిపారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు విఫలం అయ్యా యని అన్నారు. విగ్రహానికి వస్త్రధారణ మోకాల్ల వరకే ఉన్నందున ఆ విగ్రహం దేవాలయాలు కట్టిన రాజుది అయి ఉండచ్చని అన్నారు. ఈ మీడియా సమావేశంలో నాయకులు నల్లాల కనక రాజు, కాదే శంకర్, మద్దెల రాజేందర్, గజ్జల రవీం దర్, సిహెచ్ రవీందర్ పాల్గొన్నారు.

# సామాజిక పురోగతికి సోషలిజమే మార్గం : కె.ధర్మేంద్ర



**హైదరాబాద్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** విప్లవ పోరాట యోధుడు చే గువేరా జీవితం యువతకు ఆదర్శ మని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, రాష్ట్ర కార్యానిర్వహక అధ్య క్షుడు ఎన్. శ్రీకాంత్,నగర అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ అన్నారు. చెగువేరా వర్ధంతి సందర్భంగా గురు వారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎ న్‌రెడ్డి భవన్ వద్ద చెగువేరా చిత్ర పటానికి పలు వురు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గెరిల్లా పోరాటాన్ని ఉధృతం చేసి ప్రజలను బానిసత్వం నుంచి విముక్తి చేసిన గొప్ప యోధుడు చేగువేరా అని కొని యాడారు. సామాజిక పురోగతికి సోషలిజమే మార్గమ న్నారు. క్యూబా దేశంలో విద్య, వైద్యం ఉచితమని, ఈ దేశాన్ని ఆదర్శంగా తీసుకుంటే ప్రపంచ దేశాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నా రు. చెగువేరా ఆశయాలను ముందుకు తీసుకువెళ్తూ అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం యువత పా టు పడాలని పిలుపు నిచ్చారు. అరుణ్, శాంతి, ఫాతిమా, పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో రూ.10 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం



**హైదరాబాద్ :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ వ్యాపా రం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రతి రోజు నగరం నలుమూలల ఎక్కడో ఒక చోట డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా రూ. 10 కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎఫిడ్రిన్ అనే డ్రగ్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. జీడిమెట్ల పరిధిలోని సుచిత్రా క్రాస్ రోడ్స్ సమీపంలోని స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో సాయిదత్తా రెసిడెన్సీలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు ఈగల్ టీమ్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఈగల్ టీమ్ అక్కడ దాడులు నిర్వహించి.. 220 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. పట్టుబడ్డ డ్రగ్ విలువ రూ. 10 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. అదే అంతర్జాతీయ మార్కెట్‌లో అయితే రూ. 70 కోట్లు విలువ చేస్తుందన్నారు. ఈ డ్రగ్స్ దందాకు సంబంధించి నలుగురిని అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో వాస్తవాయి శివరామకృష్ణ వర్మ, దంగేటి అనిల్, మద్దు వెంకటకృష్ణ, ఎం ప్రసాద్, మునిని దొరబాబు ఉన్నారు. వీరంతా ఏపీలోని కాకినాడ, తూర్పు గోదావరి, నెల్లూరు జిల్లాలకు చెందిన వారని పోలీసులు తేల్చారు.

# కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ఎన్నికల సమరం సాగించాలి

- రేవంత్ రెడ్డి అహంకార ధోరణితో బిసిలకు తీవ్ర నష్టం
- హామీల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం
- మన బాకీ కార్డు ప్రజల బ్రహ్మాస్త్రం కావాలి పార్టీ పట్ల విధేయత, ప్రతిష్ఠ పెంచే నాయకులు మన దగ్గర ఉండడం బలం
- మాజీ మంత్రి సింగిరెడ్డి. నిరంజన్ రెడ్డి





**వనపర్తి అక్టోబర్ 9 (జనంసాక్షి):** కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా, ఎన్నికల సమరం సాగించాలని,రేవంత్ రెడ్డి అహంకార ధోరణితో బి.సి.లకు తీవ్ర నష్టం జరిగిందని, మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి అన్నారు. గురువారం నాడు ఘనపూర్ మండల ఎన్నికల సన్నాహక సమావేశం వనపర్తి జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు రాళ్ళ.కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ... బిఆరెస్ పార్టీకి ఉన్న సమర్థవంతమైన నాయకులు సుశిక్షితులైన కార్యకర్తలు ఇతర సాంప్రదాయ పార్టీలకు లేరని ఇది మనకు బలమని అన్నారు.కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ఎన్నికల సమరం సాగించాలని, ప్రతినిత్యం ప్రభుత్వ వైఫల్యం ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు.బాకీ కార్డుల పంపిణీకి ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తుందని, ప్రతి ఇంటికి వెళ్లి బాకీ కార్డు ద్వారా ప్రభుత్వం ఇచ్చిన హామీలలో బకాయి పడ్డ రూపాయలను ప్రజలకు వివరించాలన్నారు. రేవంత్ రెడ్డి అభివృద్ధి చేయకుండా నిత్యం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, రేవంత్ రెడ్డి ది ప్రైవేట్ వ్యవస్థత నడుపుతున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన అన్నారు.22నెలల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకారం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా 55000, వృద్ధులకు వికలాంగులకు ఫించన్ల ద్వారా 44000,రైతులకు ఒక్క ఎకరానికి 76000,కళ్యాణ లక్ష్మీ ద్వారా తులం బంగారం, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు విద్యార్థులకు విద్యా బరోసా విద్యార్థినులకు స్కూటీలు బకాయి పడ్డారు అని ఇట్టి విషయాన్ని బాకీ కార్డుల ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని పిలుపునిచ్చారు .కె.సి.ఆర్ కిట్టు,కంటివెలుగు,బతుకమ్మ చీరలు,రంజాన్ తోఫా వంటి పథకాలకు మంగళం పలికారని అన్నారు.ఘనపూర్ మండల బి.ఆర్.ఎస్ పార్టీ కంచుకోట అని రాబోవు ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమములో జిల్లా పార్టీ అధ్యక్షుడు గట్టు యాదవ్,మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ జెడ్.పి.టి.సి సామ్యా నాయక్, రంగారెడ్డి, బాలేశ్వర్ రెడ్డి,జాత్రు నాయక్,వెంకట్ రెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీలో పలువరి చేరిక ఘనపూర్ మండల తిరుమలయపల్లి నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.వెంకట్ రెడ్డి ఆధ్వర్యములో నారాయణ, బుడ్డయ్య,కృష్ణయ్య,దాసు,నర్సింలు,తిరుమలేశ్,పెబ్బేరు మండలం సుగర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్.టి. సి ఉద్యోగి మాల.ఆంజనేయులు,మాజీ ఉపసర్పంచ్ మొగిలమ్మ,శ్రీనివాసులు, బెక్కెం. రఘు,హనుమన్న,జయరాం, దశరథం,భాస్కర్, పులేందర్, బాలరాజు గౌడ్ తదితరులు గౌరవ మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బి.ఆర్.ఎస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమములోవనం.రాములు,పెద్దింటి.వెంకటేష్, మధు,వడ్డే.రమేష్,గోవిందు నాయుడు ఉన్నారు.

## గ్రేటర్ వ్యాప్తంగా 979 కాలనీలలో ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ పూర్తి



**హైదరాబాద్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లెగసీ వ్యర్థ్ తొలగింపు కోసం ప్రత్యేక శుభ్రత డ్రైవ్ కొనసాగుతోంది. శానిటేషన్ డ్రైవ్ చేపట్టి నేటితో నాలుగు రోజులు పూర్తిగా ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకూ 150 డివిజన్ ల పరిధిలోనీ 979 కాలనీలలో 1524.5 మెట్రిక్ టన్నుల మున్సిపల్ వ్యర్థాలు, 515.5 మెట్రిక్ టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 335 వాహనాలు మున్సిపల్ వ్యర్థాల తొలగించేందుకు, 67 వాహనాలు భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపుకు ఉపయోగించడం జరిగింది. ప్రజల సహకారంతో ఈ ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని ఎల్.బి. నగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జోన్లలో వ్యర్థాల సేకరణ సజావుగా జరుగుతోంది. అన్ని సర్కిల్స్‌లో వాహనాల మోహరింపు, వ్యర్థాల సేకరణ, డంపింగ్ ప్రాసెస్‌పై అధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ, నగరంలోని పాత వ్యర్థాల తొలగింపుతో పాటు శుభ్రమైన, ఆరోగ్య వంతమైన హైదరాబాద్ నిర్మాణం కు జీహెచ్ఎంసీ యంత్రాంగం, సిబ్బంది కృషి చేస్తుందన్నారు. డ్రైవ్ కు ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జలమండలికి ఉత్తమ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ అవార్డు



**హైదరాబాద్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే వరల్డ్ వాటర్ అవార్డు, ఉత్తమ ఎస్టీపీ, ఉత్తమ యాజమాన్య అవార్డ్ లాంటి వాటిని గెలుచుకోగా.. తాజాగా మరొక అవార్డును తన ఖాతాలో వేసుకుంది. తమ సంస్థలో ఆర్‌టిఐ కేసుల్లో ఉత్తమంగా పనిచేసిన గానూ తెలంగాణ సమాచార కమిషన్ ఉత్తమ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ అవార్డును జలమండలి ఎండీ అశోక్ రెడ్డి రవీంద్ర భారతిలో గౌరవ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా గురువారం అందుకున్నారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికుడు పవన్ (19) ఆత్మహత్య



**న్యాల్ కల్, (జనంసాక్షి) :** జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన న్యాల్ కల్ కు చెందిన మచ్కూరి నర్సింలు కుమారుడు పవన్ (19) గత కొన్ని నెలలుగా జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడి తల్లిమ చ్కూరి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే స్టే వచ్చేది కాదు

- స్టేను నిరసిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించండి
- బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలన్నీ డ్రామాలాడుతున్నాయి
- హైకోర్టు తీర్పుపై జాజుల శ్రీనివాస్ గౌడ్ ఫైర్
- అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ



**హైదరాబాద్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** చట్టబద్ధంగా పెంచిన బీసీ రిజర్వేషన్ల జీవోపై రాష్ట్ర హైకోర్టు స్టే ఇవ్వడానికి బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా నిరసిస్తుందని, ఇది బీసీ వ్యతిరేక చర్యగా భావిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించిన తర్వాత హైకోర్టు వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు కింది నుంచి పై కోర్టుల వరకు బీసీ రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారి కోర్టులను వేదికగా చేసుకుని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని, కోర్టులు కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ 10న తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడికక్కడ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి బీసీలు తమ నిరసనను వ్యక్తం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని రాష్ట్ర గవర్నర్ ఆమోదించి ఉంటే రిజర్వేషన్లపై స్టే వచ్చేది అవకాశం లేదని, ఇదే విషయం హైకోర్టులో జరిగిన వాదన సందర్భంగా అసెంబ్లీలో చేసిన చట్టానికి గవర్నర్ ఆమోదం ఉందా అని రాష్ట్ర హైకోర్టు పదేపదే ప్రశ్నించిందని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు డ్రామాలాడుతున్నాయని, ఒక పార్టీపై ఇంకొక పార్టీ నెట్టు వేసుకుంటూ బీసీలను బలి పశువులు చేశారని ఆయన మండిపడ్డారు. హైదరాబాదులో అన్ని బీసీ సంఘాలు కుల సంఘాలు మేధావులు అఖిలపక్ష రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, దాసు సురేష్, విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కురుమ, మనీ మంజరి, నరేష్ ప్రజాపతి, నరసింహ నాయక్, జాజుల లింగం, మహేష్ యాదవ్ ఈడిగ శ్రీనివాస్ గౌడ్, మాదేశి రాజేందర్ పాల్గొన్నారు.

# పొగాకు వద్దు ఆరోగ్యం ముద్దు

- శారీరిక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె .రవికుమార్




**నాగర్ కర్నూల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ పొగ త్రాగడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వలన ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాల గురించి , జీవితం విలువైనది ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడిని అధిగమించాలని, మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి విద్యార్థులకు అవగాహన కలిగించారు. గురువారం పాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యార్థులకు నాగర్ కర్నూల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె రవికుమార్ ఆధ్వర్యంలో నేషనల్ టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్, ప్రపంచ మానసిక వారోత్సవం సందర్భంగా జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ, పొగతాగడం, పొగాకు ఉత్పత్తులైన గుట్కా, ఖైనీ , తంబాకు, మావ, జర్దా తదితర ఉత్పత్తులు వినియోగించడం వల్ల ఊపిరితిత్తుల అనారోగ్య సమస్యలైనా సీఓ పిడి, బ్రాంకైటీస్, న్యూమోనియా, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె పోటు, పక్షవాతం, అంధత్వం, మధుమేహం, అధిక రక్తపోటు, ముఖ్యంగా పురుషులలో పునరుత్పత్తి, లైంగిక సామర్థ్యం తగ్గడం తదితర అనారోగ్య సమస్యలు కలుగుతాయి అని తెలియజేశారు. కావున అక్టోబర్ 9 వ తారీకు నుండి డిసెంబర్ 8వ తారీకు వరకు 60 రోజులు వరకు ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. అక్టోబర్ 4వ తారీఖు నుంచి 10 తారీకు వరకు ప్రపంచ మానసిక వారోత్సవాల నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా మానసిక ఒత్తిడి అధిగమించడానికి ప్రతిరోజు ధ్యానం, యోగ చేయాలని డిఎంహెచ్ఒ తెలియజేశారు. తదనంతరం గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి సైక్రియాటిస్ట్ హెచ్ ఓ డి డాక్టర్ ఫణికాంత్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో గెలుపు ఓటమిలు ఉంటాయని, మానసిక ఒత్తిడిని అధిగమించడానికి విద్యార్థులు పార్టీ అంశాలు ప్రణాళిక ప్రకారం చదవాలని తెలియజేశారు. జిజిహెచ్ సైక్రియాటిస్ట్ డాక్టర్ అంబుజ మాట్లాడుతూ, విద్యార్థులు ఏదైనా మానసిక సమస్య వచ్చినప్పుడు వెంటనే టెలి మానస్ 14416 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని, 24 గంటలు నిపుణులైన కౌన్సిలర్లు, సైక్రియాటిస్టులు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూని యర్ కళాశాల ప్రిన్సిపల్ స్వామి సీనియర్ లెక్చరర్ మధుసూదన్ రెడ్డి, పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి రాజ గోపాలాచారి, ఎపిఓ విజయ్ కుమార్, మల్లేష్, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఏఎన్ఎం గజవ ర్ధనమ్మ, ఆశా కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ పటాపంచలు

### 7మంది నిందితుల అరెస్ట్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారంరోజుల వ్యవధిలో రెండు సైబర్ క్రైమ్ కేసులను చేదించడంతోపాటు ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటనలపై సైబర్ సిటీ అవినాష్ మహంతి స్పందించారు. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే అరెస్ట్ అయిన ఏడుగురు నిందితులలో 5 మంది ఈనెల 8న నమోదైన సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితులుగా ఉన్న వారేనని ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు ఆయా సైబర్ క్రైమ్ కు సంబంధించి 53 కేసులలో 240 రిఫండ్ ఆర్డర్ ప్రాసెస్ చేయడం జరిగిందని 75 లక్షల 12 వేల 158 రూపాయలను బాధితులకు అందించడం జరిగిందన్నారు. మొత్తం 2.7 కోట్ల రూపాయల విలువచేసే సైబర్ క్రైమ్ లపై విచారణ కొనసాగుతుందన్నారు. ఐదుగురు నిందితులు సైబర్ ఫ్రాడ్ కేసులో పాల్గొనగా మరో ఇద్దరు నిందితులు ఈ ఏడాది జూన్ 16వ తేదీన నమోదైన మరో సైబర్ క్రైమ్ కేసులో నిందితులని సిపి వివరించారు. అయితే అపరిచిత మెసేజ్ లు, ఫోన్ కాల్‌ల పట్ల అప్రమత్తతతో ఉండాలని, ఫోన్ల ద్వారా అడిగిన గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా నెంబర్లు, ఓటీపీ నెంబర్లను అసలు చెప్పకూడదని సిపి సూచన చేశారు.

## ఇద్దరు మాదకద్రవ్యాల సరఫరాదారుల అరెస్ట్

### 7.5 లక్షల సొత్తు స్వాధీనం

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 (జనంసాక్షి) :** జల్సాలకు అలవాటు పడి మత్తుకు బానిసైన ఇద్దరు వ్యక్తులు మత్తు పదార్థాల కొనుగోలుకు అవసరమైన డబ్బులు సంపాదించుకోవడానికి మరికొందరు వ్యక్తులకు మత్తు పదార్థాలను సరఫరా చేస్తూ అరెస్టు అయిన ఉదంతం నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ డిసిపి యోగేష్ గౌతమ్ ఈ మేరకు గురువారం పాత్రికేయ సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం... ఈనెల 8వ తేదీన నార్సింగి ప్రాంతంలో నార్సింగి పోలీసులు మరియు తెలంగాణ రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక విభాగానికి సంబంధించి ఈగల్ సంస్థ అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు సీరమ్ అనంత కుమార్(50), పేరూరు వీరబాబు(32) లను అదుపులోకి తీసుకొని వారి వద్దనుండి 7 లక్షల 50 వేల రూపాయల విలువచేసే 107. 4 గ్రాముల కొకైన్ మత్తుపదార్థాన్ని స్వాధీన పరచుకున్నారు. కాగా 2017 వ సంవత్సరం నుండి కొకయం సేవనకు అల వాటు పడిన సిరం అనంత కుమార్ దానిని కొనుగోలు చేయడానికి అవసరమైన డబ్బు ల నిమిత్తం బయట నుండి కొకైన్ ను తీసు కొచ్చి హైదరా బాద్ పరిసర ప్రాంతాలలో మరికొందరికి ఎక్కువ ధరకు విక్రయిస్తూ మత్తు పదార్థాల సరఫరాదారుగా మారడం జరిగింది. ఈ క్రమంలో ముంబై కి సంబంధించిన కార్తికే య శేఖర్ అనే వ్యక్తి వద్ద నుండి 107.4 గ్రాముల కొకైన్‌ను కొనుగోలుచేసి తరలిస్తుండగా సమాచారం అందు కున్న నార్సింగి పోలీసులు, టిజి న్యాబ్ ఈగలు సంస్థ అధికా రులతో కలిసి నార్సింగి పోలీస్ ఇన్స్పెక్టర్ సిహెచ్ హరికృష్ణా రెడ్డి పర్యవేక్షణలో టిజి న్యాబ్ ఇన్స్పెక్టర్స్ రమేష్ రెడ్డి, గోపి వీరబాబు, సీరం అనంత కుమార్ పై దాడి చేసి ప్రత్య క్షంగా పట్టుకో వడం జరిగింది. ఈ క్రమంలో వారి వద్ద నుండి 7.5 లక్షల రూపాయల విలువ చేసే 107.4 గ్రాముల కొకైన్, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగింద న్నారు. పరారీలో ఉన్న కార్తికేయ సేకరణ త్వరలోనే అదుపులోకి తీసుకొని మరింత లోతుగా దర్యాప్తు చేస్తామని ఆయన వివరించారు.

## డిజిపినీ కలిసిన పేట ఎస్పి వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 9(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గురువారం డీజీపీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డీజీపీ నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వినీత్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, జిల్లా పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ వినీత్ స్పందిస్తూ నారాయణపేట జిల్లా ప్రజల భద్రత, మహిళా రక్షణ, సైబర్ నేరాల నియంత్రణ, సాంకేతికత ఆధారిత పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించను న్నట్లు తెలిపారు.

## మద్దూరు ఘటనపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

**నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9(జనంసాక్షి):** కొడంగల్ అసెంబ్లీ, మద్దూరు మండలం,బోడ మర్రిగడ్డ తండా కు చెందిన గిరిజన బిడ్డ రమేష్ నాయక్ సూసైడ్ నోట్ రాసి మిస్సింగ్ అయిన ఘటనపై గురువారం బిజెపి ఎస్టీ మిర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్ గురువారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ కు ఫిర్యాదు చేశారు.రమేష్ నాయక్ కనిపించకుండా పోయి నేటికి 16 రోజుల కావస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మిస్సింగ్ అయిన రమేష్ నాయక్ ఆచూకీ తక్షణమే వెలికితీయాలని,జిహాదీ ఉగ్ర ముఠా సభ్యులు తాజుద్దీన్, యాసిన్ వంటి వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచరులు, సమాధానం చెప్పాలని కోరారు.

# పిడుగు పడి మహిళా మృతి

### పరామర్శించిన ఎమ్మెల్యే



**నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రం పట్టణ పరిధిలో గురువారం సాయంత్రం పిడుగు పాడి మహిళ మృతి చెందింది. వ్యవసాయ పనులు చేస్తుండగా ం పిడుగుపాటుకు పట్టణానికి చెందిన పద్మ(35) అక్కడికక్కడే మృతి చెందింది.విషయం తెలుసుకున్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్నిక రెడ్డి మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పట్టణ అధ్యక్షులు ఎండి సలీం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గందే. చంద్రకాంత్, మనోహర్ గౌడ్, మల్లేష్,కోట్ల మధుసూదన్ రెడ్డి, వెంకు గౌడ్,మారుతీ,రాజీ రెడ్డి ఉన్నారు.

## కోర్టు స్టేతో ఆగిపోయిన నామినేషన్ల ప్రక్రియ

### మొదటి రోజు ఒకే నామినేషన్

**మల్దకల్ అక్టోబర్ 9 (జనంసాక్షి):** ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ఎన్నికల ప్రక్రియ అర్థాంతరంగా ఆగిపోయింది. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి గ్రామాలకు రిటర్నింగ్ అధికారులను పంపించి నామినేషన్ల ప్రక్రియను గురువారము ప్రారంభించారు.42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ఎన్నికలు బ్రేక్ పడింది.మండలంలోని ఐదు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా కేవలం తాటికుంట నామినేషన్ కేంద్రంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతి కుమార్ కు ఐఎన్సి పార్టీ నుండి చంద్రశేఖర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.ఉదయం నుంచి 10 గంటల నుండి సాయంత్రం 5:00 వరకు అధికారులు నామినేషన్ కేంద్రాల్లో ఉండగా మొదటి రోజు ఒకే నామినేషన్ దాఖలయింది.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ తుది నిర్ణయం తీసుకునే వరకు ఎలాంటి నామినేషన్లను తీసుకోకూడదని అధికారులు అంటు న్నారు. ఏది ఏమైనప్పటికీ జెడ్పిటిసి, ఎంపీటీసీ ఆశావహాలు ఆశలు నిరాశలయ్యాయి.

## ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో వృద్ధులకు సమగ్ర ఆరోగ్య సేవలు

- వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఐసీఓపీఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా..
- ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వృద్ధుల కంటి సంరక్షణ విభాగం హెడ్ డాక్టర్ అవినాష్ పతేంగే



**హైదరాబాద్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** వృద్ధులకు సమగ్ర ఆరోగ్య సేవలు అందిస్తున్నామని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వృద్ధుల కంటి సంరక్షణ విభాగం హెడ్ డాక్టర్ అవినాష్ పతేంగే తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇంటిగ్రేటెడ్ కేర్ ఫర్ ఓల్డర్ పీపుల్ ఫ్రేమ్‌వర్క్‌ను కంటి సంరక్షణలో అమర్చడం ద్వారా వృద్ధుల సంపూర్ణ ఆరోగ్యాన్ని పరిగణించే విధానాన్ని తీసుకురాగలిగామని పేర్కొన్నారు. మా పాల్ ప్రివెన్షన్ కేంద్రాలు వృద్ధాప్యాన్ని ఎలా అనుసరించాలి అనే దానిపై తిరిగి నిర్వచించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వృద్ధుల ఆరోగ్య సంరక్షణలో నాయకత్వం వహిస్తూ.. కల్లం అంజి రెడ్డి క్యాంపస్ (హైదరా బాదు)తో పాటు జీఎంఆర్ వరలక్ష్మీ క్యాంపస్ (విశాఖపట్నం), మిథు తుల్సి చన్‌రాయి క్యాంపస్ (భువనేశ్వర్) కోడే వెంకటాద్రి చౌదరి క్యాంపస్ (విజయవాడ), రాజశేఖర రెడ్డి క్యాంపస్ (కడప) వృద్ధుల కంటి సంరక్షణ కోసం సౌకర్యాలు కల్పిస్తుం దన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇంటిగ్రేటెడ్ కేర్ ఫర్ ఓల్డర్ పీపుల్ ఫ్రేమ్‌వర్క్‌ను సమగ్రంగా అనుసరిస్తున్నామన్నారు. ఈ ఫ్రేమ్‌వర్క్ యునైటెడ్ నేషన్స్ హెల్తీ ఏజింగ్ డికేడ్లో భాగంగా అభివృద్ధి చేయబడిందన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ జనవరి 2025లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఆప్తమాల్మిక్ నర్సింగ్ అసిస్టెంట్స్ ద్వారా స్క్రీనింగ్ ప్రారంభించామన్నారు. సులభమైన, నిర్మాణాత్మక సాధనాలను ఉపయోగిస్తూ జ్ఞాపకశక్తి, చలనం, పోషణ, దృష్టి, వినికిడి, డిప్రెషన్‌ను స్క్రీన్ చేసి అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ స్క్రీనింగ్‌లు జ్ఞాపక శక్తి లోపం, పోషణ లోపం, వినికిడి లోపం, సమతుల్యత సమస్యలు, డిప్రెషన్ వంటి ప్రారంభ రిస్క్‌లను గుర్తించడంలో సహాయపడతున్నాయని తెలిపారు. తద్వారా సమయానుకూల రిఫరల్స్, అనేక విభాగాల మద్దతు అందించవచ్చన్నారు.

## వర్షాలతో కుళ్లిపోయిన పంటలు

### తమను ఆదుకోవాలంటూ రైతులు



**చిలప్ చేడ్,09 అక్టోబర్ (జనంసాక్షి) :** ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో మంజీర నదిలో భారీగా వరద నీరు రావడంతో తము వేసుకున్న పంటలు నీటిలో మునిగి మొత్తం కుళ్లిపోయిందని చిలప్ చేడ్ మండలంలోని రైతులు కన్నీరు పర్యంతమయ్యారు. గత పదిహేను రోజుల కింద ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో ఎగువన ఉన్న సింగూర్ ప్రాజెక్టు నుంచి నీరు అధికంగా రావడంతో మండలంలోని మంజీర నది పరివాహ ప్రాంతాలు అయినా గంగారం, అజ్జమర్రి, బంద పోతుగల్, ఫైజాబాద్, చిలప్ చేడ్, చండూర్, చిట్కుల్ గ్రామ శివారులలో పత్తి, వరి పంటలు పూర్తిగా కుళ్లిపోయాయి అని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం పంటల నష్టాన్ని గుర్తించి మండలంలోని రైతులకు ఆర్థిక సహాయం కింద ఒక ఎకరాకు 35వేల రూపాయల చొప్పున ప్రభుత్వం చెల్లించాలని ఆయా గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## బీసీలకు ఇది చీకటి రోజు

### తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీ శంకర్



**హైదరాబాద్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** రాజ్యాంగ సవరణ జరగకుండా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు సాధ్యం కావని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టకుండా జీవో 9ని ఇచ్చి మాపని అయి పోయిందని భావించటం అన్యాయమని తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. పలు రాష్ట్రాలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్ట్ తీర్పు నేపథ్యంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు ఎట్లాగూ సాధ్యం కాదని తెలిసి కూడా కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ని విడుదల చేసిందని తెలిపారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ కాంగ్రెస్ను గెలిపించేందుకు బీసీలను మరోసారి మోసగించేందుకు ఉపయోగపడిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 9 బీసీలకు న్యాయం చేయలేక పోయి నందుకు బీసీలకు ఇది చీకటి రోజుగా చరిత్రలో మిగిలిపోతుందని విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సమ సమన్యాయం ఆత్మగౌరవం ప్రతి బీసీ స్వప్నమని అదే నినాదంతో హక్కుల సాధన బీసీ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
10 అక్టోబర్ 2025

# హైకోర్టు వద్ద బీసీ సంఘాల నేతల ఆందోళన

- సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు



హైదరాబాద్, అక్టోబర్9 (జనంసాక్షి) : బిసి రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే విధించడంతో హైకోర్టు ఎదుట బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. గేట్ నెం.4 దగ్గర నినాదాలు చేస్తూ.. రోడ్డుపై బైఠాయించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ కోర్టు వద్ద బీసీ సంఘాలు నేతలు నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్లే బీసీలకు అన్యాయం జరిగింది అని బీసీ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. బీసీలకు పదవులు వస్తుంటే అగ్రకులస్తులు ఓర్వలేకపోతున్నారు అని వారు మండిపడ్డారు. బీసీల నోటి కాడ ముద్దను లాక్కున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రి పదవులు మొత్తం అగ్రవర్ణాలకే. కనీసం ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ పదవులైనా బీసీలకు దక్కొద్దా..? అని ప్రభుత్వాన్ని బీసీ నేతలు నిలదీశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. జీవో అమలును నిలిపివేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాలకు దాఖలుకు పిటిషనర్లకు 2 వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు కోర్టు వాయిదా వేసింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించి షాక్ ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై రెండు రోజుల పాటు హైకోర్టులో సుధీర్ఘ విచారణ కొనసాగిన సంగతి తెలిసిందే. ఏజీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర కేబినెట్ బీసీ జనగణన నిర్వహించాలనే నిర్ణయం తీసుకుందని తెలిపారు. సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీల జనాభా 57.6 శాతం ఉందని ఆయన పేర్కొన్నారు.బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఏజీ తెలిపారు. ఈ తీర్మానం సామాజిక న్యాయం దిశగా ముఖ్యమైన అడుగని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం తెలపకపోయినా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అది చట్టబద్ధమైనదే అని ఏజీ పేర్కొన్నారు.

# న్యాయవ్యవస్థలో బీసీలు రావాలి

- తమవారు లేకపోవడంతోనే అన్యాయం
- బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరం
- మాజీ ఎంపీ వీహెచ్, ఆది శ్రీనివాస్‌ల ఆవేదన



హైదరాబాద్, అక్టోబర్9 (జనంసాక్షి) : బీసీ రిజర్వేషన్ల అంశంపై మాజీ ఎంపీ వీ. హనుమంత రావు మాట్లాడుతూ...కోర్టు తీర్పు చాలా బాధ కలిగించిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తమ నోటి దగ్గరి ముద్దను లాక్కున్నారని మండిపడ్డారు. తారిఖ్ పే తారిఖ్ అని కోర్టు మరో తారిఖ్ ఇచ్చిందని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై ప్రభుత్వం తరపున చేయాల్సింది చేశామని చెప్పారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చే సమయంలో తాము అడ్డుకోలేదని.. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే అడ్డుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థలో బీసీలు వచ్చే వరకు తమకు అన్యాయం జరుగుతూనే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని కాంగ్రెస్ నేత, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'హైకోర్టు తీర్పుతో చాలా నిరాశ చెందాం. బీసీ రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. కేంద్రం సహకరించకపోయినా, గవర్నర్ పట్టించుకోకపోయినా, ప్రతిపక్షాలు కలిసి రాకపోయినా సీఎం రేవంత్ రెడ్డి ఒంటరి పోరాటం చేశారు. కులగణనతో పాటు డెడికేటెడ్ కమిషన్ వేసి బీసీల లెక్క తేల్చాము. బీసీల నోటికాడి బువ్వ అందకుండా పోయింది.. అయినా మేం నిరాశ చెందం.. పోరాటం కొనసాగుతుంది. తప్పకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి పెడుతాం. బీసీలు ఎవరూ అధైర్యపడొద్దు.. సీఎం రేవంత్ నాయకత్వంలో తప్పనిసరిగా రిజర్వేషన్లు సాధించుకుందాం' అని అన్నారు. హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సీఎంతో సమావేశం కానున్నారు. స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. న్యాయనిపుణులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ నిర్వహించనున్నారు. నోటిఫికేషన్ స్టేపై సుప్రీం కోర్టుకు వెళ్లే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. హైకోర్ట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీసీ సంఘాల నేతలు, కార్యకర్తలు రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. 'వుయ్ వాంట్ జస్టిస్', 'బీసీ వ్యతిరేకుల్లారా ఖబడ్దార్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు బీసీ రిజర్వేషన్ల అంశంపై హై కోర్టు స్టే విధించిన నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థులు అయోమయంలో ఉన్నారు. పీసీసీ ఆదేశాలతో పలువురు స్థానిక నేతలు నామినేషన్ దాఖలు చేశారు. హైకోర్టు స్టే ఇవ్వడంతో ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న ఆందోళనలో ఉన్నారు.

# అక్రమంగా తిష్టవేసిన బంగ్లాదేశీయులు

- 28మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

న్యూఢిల్లీ, అక్టోబర్9 (జనంసాక్షి) : ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత ప్రభుత్వం.. దేశంలోని అక్రమ వలసదారుల ఏరివేత పై ఢిల్లీ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. నివాసితుల సంక్షేమ సంఘాలను విదేశీ దేశాలకు స్థలాలను నియమించడం లేదా అద్దెకు ఇవ్వడం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. 'అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల'పై పెద్ద ఎత్తున దాడిలో భాగంగా మూడు వేర్వేరు జిల్లాల్లో 28 మందిని అరెస్ట్ చేశారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా.. ఆగ్నేయ పోలీసు జిల్లాలో ఇద్దరు మైనర్లతో సహా 11 మంది అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకున్నారు. రాజధానిలో అక్రమంగా నివసిస్తున్న 13 మంది బంగ్లాదేశ్ జాతీయులను దక్షిణ జిల్లాలో అదుపులోకి తీసుకున్నారు. ఈ రోజు ప్రారంభంలో వాయువ్య జిల్లా నుండి నలుగురు బంగ్లాదేశ్ వలసదారులను అరెస్టు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో దేశంలోని వివిధ నగరాల్లోని అక్రమ వలసదారులను గుర్తించే పనిలో పోలీసులు, ఇతర అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా సౌత్ ఈస్ట్ డిస్ట్రిక్ట్ పోలీసులు 28 మంది అక్రమ బంగ్లాదేశ్ వలసదారులను గుర్తించి అరెస్టు చేసింది. వారు భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించింది. విచారణలో వారంత పశ్చిమ బెంగాల్‌లోని ఖుల్నా సరిహద్దు ద్వారా ఇతర వ్యక్తులతో పాటు భారత దేశంలోకి అక్రమంగా ప్రవేశించారని ఒప్పుకున్నారని తెలిపారు.. మొత్తం 28 మంది అక్రమ వలసదారులను అరెస్ట్ చేసి.. ఇప్పుడు తాత్కాలిక నిర్బంధ కేంద్రంలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అలాగే వారిని దేశం నుంచి బహిష్కరించడానికి అవసరమైన చట్టపరమైన లాంఛనాలు జరుగుతున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత.. భారత ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటి వరకు మొత్తం 235 మంది అక్రమ బంగ్లాదేశీయులను బహిష్కరించినట్లు ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.

# దశలవారీగా హ్యామ్ రోడ్లు చేపట్టండి

- ట్రాఫిక్ సర్వేను దృష్టిలో పెట్టుకోండి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో దశలవారీగా హ్యామ్ రోడ్ల నిర్మాణం త్వరిత గతిన చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి హ్యామ్ రోడ్ల నిర్మాణం పై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణ క్రమంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని, రోడ్ల నిర్మాణ క్రమంలో ట్రాఫిక్ సర్వేను గమనంలో పెట్టుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. మొదటి ఫేజ్‌కు అతి త్వరలో టెండర్లు పిలవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్, ఫైనాన్స్ సెక్రటరీ హరిత పలువురు ఆర్ అండ్ బి అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

# బిహార్ ఎన్నికల్లో ఏఐ వీడియోలపై ఆంక్షలు

- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ, అక్టోబర్9 (జనంసాక్షి) : బిహార్ ఎన్నికల్లో ఏఐ వీడియోల వినియోగంపైన ఎలక్షన్ కమిషన్ తాజాగా ఆంక్షలు విధించింది. అభ్యర్థులు తమ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఏఐ వీడియోలతో ఎలాంటి ప్రచారం చేయకూడదని స్పష్టం చేసింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో, న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగేలా ఈ చర్య తీసుకున్నట్టు చెప్పింది. కృత్రిమ మేధ దుర్వినియోగం కాకూడదని పేర్కొంది. ఏఐతో తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేయడం వంటి చర్యలకూ దూరంగా ఉండాలని పేర్కొంది. ఇతర సందర్భాల్లో ఏఐ వాడిన సమయంలో ఈ విషయాన్ని ఆయా డిజిటల్ కంటెంట్‌పై కనబడేనలా చూపించాలని కూడా ఎన్నికల సంఘం పేర్కొంది. సోషల్ మీడియాపై దృష్టి పెట్టేందుకు ఇప్పటికే ఈసీ పలు చర్యలు తీసుకుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈసీ తాజా ప్రకటనతో ఏఐ వీడియోలు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో(ఎమ్‌సీసీ) పరిధిలోకి వచ్చాయి. దీంతో, ఏఐకి సంబంధించిన నిబంధనలకు అన్ని పార్టీలు కచ్చితంగా కట్టుబడి ఉండాలి. ఎమ్‌సీసీ ప్రకారం, ఇతర పార్టీల ప్రోగ్రామ్‌లు, విధానాలపైనే రాజకీయ కామెంట్స్‌ను పరిమితం కావాలని సూచించింది.

# తప్పలను కప్పిపచ్చుకునే యత్నం

- సీఎం రేవంత్‌పై అర్వింద్ ఫైర్



హైదరాబాద్, అక్టోబర్9 (జనంసాక్షి) : సిఎం రేవంత్ రెడ్డి బీసీ రాజకీయాలను ఉపయోగించి దద్దమ్మ పాలనను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ ఎంపీ అరవింద్ ధర్మపురి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఒక విధంగా మాటలు చెప్పి, తర్వాత మరో విధంగా ప్రవర్తించడం రేవంత్ రెడ్డికి కొత్త విషయమేమీ కాదు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ తెలంగాణ రాజకీయాలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో ఎందుకు సక్రమంగా వ్యవహరించలేదని అరవింద్ ప్రశ్నించారు, కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్‌ను లోపల ఎందుకు ఉంచలేదు, కేటీఆర్‌ను లోపల ఎందుకు ఉంచలేదు, కవిత రాజీనామాను ఎందుకు ఆమోదించకపోతున్నారని ప్రశ్నించారు. హరీష్ పాల వ్యాపారం, సంతోష్ టానిక్ సంబంధిత అంశాలను, అలాగే కల్వకుంట్ల కుటుంబంతో చేసిన ఒప్పందం బయటకు రాకుండా చేయడానికి రేవంత్ బీసీలను రాజకీయ వ్యూహంగా వాడుతున్నారని ఆయన ఆరోపించారు. మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదు. తమిళనాడులో తెచ్చుకున్నప్పుడు కూడా రేవంత్ కు తెలియలేదు. ఇప్పుడు బీసీలను రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఆడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌పై బీజేపీలో బొంతు పేరు

- ఎంపీ అర్వింద్ కీలక ప్రతిపాదన



హైదరాబాద్, అక్టోబర్9 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థిపై బీజేపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నేత బొంతు రామ్మోహన్ పేరును తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావుకు ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రతిపాదించారు. బొంతు రామ్మోహన్‌ను పార్టీలోకి తీసుకుని జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని.. ఆయన కోరారు. బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల మేనేజ్‌మెంట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. బొంతు రామ్మోహన్‌కు బ్యాక్‌గ్రౌండ్ ఉందని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. అనంతరం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేపై అర్వింద్ స్పందించారు. బీసీలపై సీఎం రేవంత్ కపట ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. బీసీల ఆత్మగౌరవంతో రేవంత్ ఆడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ సవరణ చేయకుండా బిల్లు ఉంటుందా..? అర్వింద్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థ ఇంచార్జ్ చంద్రశేఖర్ తివారి, ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల కట్టడాలపైనే హైడ్రా దృష్టి


- పెద్దల కట్టడాల జోలికి వెళ్లదా?
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి



హైదరాబాద్, అక్టోబర్9 (జనంసాక్షి) : హైడ్రా ధనవంతుల కట్టడాలను కూల్చడం లేదని.. కేవలం సామాన్యుల ఇళ్లను కూలుస్తోందని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా కూల్చడం తప్ప ఇప్పటివరకు చేయగలిగింది ఏం లేదన్నారు? అన్ని అనుమతులు తీసుకుని కట్టుకున్న ఇళ్లను కూడా కూలుస్తున్నారని గుర్తు చేశారు. చెరువులు, కుంటలను మొత్తం కబ్జాలు చేస్తున్నారన్నారు.. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న వారికి కబ్జా భూములకు సైతం అనుమతిలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు కబ్జా ఆక్రమణలు, నిర్మాణాలపై హెచ్ఎండీఏ, రేరాకు సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇదే అంశంపై అసెంబ్లీలో కూడా పలుమార్లు ప్రస్తావించానన్నారు. హైడ్రా కూల్చివేతల పాపం అధికారులదే.. ప్రభుత్వం మమ్మల్ని ఏమీ చేయలేదని ప్రభుత్వ అధికారులు విర్రవీగుతున్నారని మండిపడ్డారు. హైడ్రా తీరు, కబ్జాలతో తాను వేసిన రిట్ పిటిషన్‌పై కోర్టులో విచారణ జరిగింది. కౌంటర్ దాఖలు చేయమని ప్రభుత్వానికి ఆదేశాలు ఇస్తూ హైడ్రా, హెచ్ఎండిఎ, జిహెచ్ఎంసిలకు నోటీసులు జారీ చేయమని చెప్పారు. విచారణను హైకోర్టు 30 వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

# బోల్తాపడ్డ బొలెరో..

- టమాటాల కోసం ఎగబడ్డ జనం



సంగారెడ్డి, అక్టోబర్ 9 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లా కంది మండలంలో రోడ్డు ప్రమాదం జరిగింది. టమాటాల లోడ్‌తో వెళుతున్న బొలెరో వాహనాన్ని డీసీఎం ఢీ కొట్టింది. దీంతో బొలెరోలోని టమాటాలు రోడ్డుపై పడ్డాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు, స్థానికులు ఎగబడి టమాటాలను సంచుల్లో తీసుకెళ్లారు. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్‌కు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితం

- రాజకీయ స్వలాభం కోసం బీసీల హక్కులను పణంగా పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో బీసీ రిజర్వేషన్లపై స్టే విధించడం పట్ల.. కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన,.. చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈరోజు ఓబీసీలు ఎదుర్కొంటున్న దురవస్థకు కారణమని తెలిపారు. బీసీలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి, న్యాయపరమైన లొసుగులను సరిచేసుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ఆగస్టు 31న అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్‌కు పంపినప్పటికీ, గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి ఉన్న మూడు నెలల గడువు ముగియకముందే ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం గవర్నర్‌కు పంపిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఆ గడువు పూర్తికాకముందే ప్రభుత్వం తొందరపడి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి చట్టపరమైన లొసుగులను సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంలో మాత్రమే చూసి, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ వర్గాల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని రాంచందర్ రావు గారు తెలిపారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు "బిజెపి అడ్డుకుంటోంది" అనే దుష్ప్రచారం చేస్తున్నారని, కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చట్టపరమైన అవగాహన లేదా ఆలోచనల స్పష్టత లేదని విమర్శించారు. భారతీయ జనతా పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పూర్తిగా మద్దతు ఇస్తూ దానికి కట్టుబడి ఉందని రాంచందర్ రావు గారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి బీసీ రిజర్వేషన్లపై చట్టపరమైన సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయపరంగా చెల్లుబాటు కాని విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి లేని, చట్టపరంగా తప్పుడు నిర్ణయాలతో బీసీల హక్కులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుందని మండిపడ్డారు.

# ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తాం

- రూ.323 కోట్లతో ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్
- సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై 14న సమావేశం
- వ్యర్థాలు కలిసే చోటు పరిశీలించి నిర్ణయం తీసుకుందాం
- సమస్యలు పరిష్కరించకుండా దాటవేసే మనిషిని కాదు
- అలాంటి పరిస్థితి వస్తే రాజకీయాలు మానేసి వెళతా
- ఉప్పాడ మత్స్యకారులకు పవన్ కళ్యాణ్ హామీ



కాకినాడ, అక్టోబర్9 (జనంసాక్షి) : ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తానని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాట ఇచ్చారు. ఇప్పటికే ఉప్పాడ– కొణపాక మధ్య తీర రక్షణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. రూ.323 కోట్లతో ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మించేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని తెలిపారు. ఉప్పాడలో నిర్వహించిన మత్స్యకారుల బహిరంగ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై ఈ నెల 14న సమావేశం ఉందని గుర్తు చేశారు. ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై ఈనెల 14న సమావేశం నిర్వహిస్తామని, అలానే ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామని మత్స్యకారులకు పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఇక పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ..' రూ.323 కోట్లతో సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి కేంద్రం సానుకూలం ఉంది. ఉప్పాడ–కొణపాక మధ్య తీరరక్షణ పనులు ప్రారంభించాం. పరిశ్రమల వ్యర్థాల శుద్ధిపై మూడు విడతల్లో పరిశీలిస్తాం. మత్స్యకారులు ఎక్కడికి చెబితే అక్కడికి మూడ్రోజుల్లో వస్తాను. వ్యర్థాలు ఎక్కడ కలుస్తున్నాయో.. అక్కడికే బోటులో వెళ్తాను. ప్రజలను వంచించాలని నాకు ఎప్పుడూ ఉండదు. ప్రజలకు న్యాయం చేయలేనప్పుడు రాజకీయాలు వదిలేసి వెళ్లిపోతాను. 100 రోజుల సమయం ఇస్తే.. కాలుష్యం తగ్గింపుపై ప్రణాళిక రూపొందిస్తాను' అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. కాకినాడలోని కలెక్టరేట్ లో ఉప్పాడ ప్రాంతానికి చెందిన మత్స్యకార ప్రతినిధులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడిన పవన్ వారి సమస్యలను తెలుసు కున్నారు. ఈ సమావేశంలో ఉప్పాడ మత్స్యకారుల సమస్యలపై చర్చించామని పవన్ కళ్యాణ్ తెలిపారు. చేపల వేటపై 7 వేలకు పైగా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఏటా రూ.20 వేలు ఇస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. పరిశ్రమల వ్యర్థాల వల్ల మత్స్య సంపద తగ్గిపోతోందనే ఆందోళన ఉందన్నారు. పరిశ్రమలకు వ్యతిరేకం కాదని మత్స్యకారులు చెబుతున్నారు. పరిశ్రమల వ్యర్థాల వల్ల మత్స్యసంపద తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాలను శుద్ధి చేయకుండా వదలడం వల్ల మత్స్యసంపద దెబ్బతింటుందని చెబుతున్నారు. ఈ సమస్యను మనమంతా కలసి పరిష్కరించుకుందామని హామీ ఇచ్చారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370